

సంవత్సరపు ఉత్తమోత్తమ చిత్రము!

హైదరాబాద్ — దిల్షాద్ టాకీసులో దిగ్విజయముగా నడచుచున్నది!

ఆర్. కె. ఫిలిమ్సువారి "బరాసత్"

ప్రొడ్యూసర్ డైరెక్టరు: రాజ్ కపూర్

నటులు: నర్గీస్ * రాజ్ కపూర్ * నిమ్మి * కె. యన్. సింగ్ * ప్రేమ్‌నాథ్ * కక్కూ

త్వరలో ప్రభాత్—బెంగుళూరు. ప్రధాన దక్షిణ భారత కేంద్రములు

మైసూర్: రాజ్ శ్రీ పిక్చర్సు :: బెంగుళూరు

చంద్రిమయా విడుదల

## మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడు గారి

# బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగ్గై పిళ్ళై వీధి,
తెప్పకొలం.



# గ్యారంటీగల

## విశుద్ధమైన లోహములోను ఇత్తడిలోనూ

అందమైన అమరికతో పోతపోసిన పాత్రలు


I.M.M.C MADRAS

ఇంటిలోనూ, ప్రతి హోటల్
లోనూ చాలా ఉపయోగ
కరముగా నుండును.

: తయారుచేయువారు :

## ఇండియన్ మెటల్ & మెటలర్జికల్ కార్పొరేషన్

498, మింట్‌స్ట్రీట్ :: మద్రాసు - 3




ప్రాణాయామం పట్టి
ముళ్ల పరుపుమీద పడు
కోవడం సన్యాసికి చేతనయితే
లోధ్ర
Lodhra
సేవించి ఆరోగ్య ★★★
సౌందర్యాలు పెంపొందించు
కొంటూ ఉత్సాహంగావుండ
డము ఆమె చేతనవును.
"లోధ్ర" ఋతు దోషాలను
పారద్రోలి ఆరోగ్య సంతోష
సంతానములను సంప్రాప్తింప
జేయును
కేసరి కుటీరం లిమిటెడ్,
రాయపేట, మద్రాస్.

# మద్రాస్ ఎనామెల్ వర్క్సు లిమిటెడ్,

(స్థాపితము : 1934)

65, సైదన్‌హామ్సు రోడ్ — మదరాసు



# ఆంధ్ర పరిశ్రమ

గృహోపకరణములు, ఆస్పత్రి పరికరములు, విద్యుద్దీపసాధనములు. ఇంకను పలువిధములైన పింగాణీ వస్తువులు తయారుచేయు ఉన్నత ఆంధ్రపరిశ్రమ. ఇంతపెద్ద ఎనామెల్ పరిశ్రమ దక్షిణదేశములో మరెక్కడా లేదు. ఎడ్వర్‌టైజర్లు, మునిసిపాలిటీలు, లోకల్ బోర్డులు, రైల్వేలు సైన్యం - తదితరులకు కావలసినవన్నీ మా ఫ్యాక్టరీనుంచి సప్లైచేయబడును.

మేనేజింగ్ డైరెక్టర్,

పురం ప్రకాశరావు.




# రు. 500 బహుమానము

## ఉమా గోల్డు కవరింగు వర్క్సు

ఉమా మహల్ :: మచిలీపట్నము

ఉమా గోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు.

అసలు బంగారు రేకు లోహముపైన అంటించి (Gold Sheet Welding on Metal) తయారు చేయబడినవి. కాదని ఋజువు చేసినవారికి రు. 500 బహుమానమివ్వబడును. మేము తయారు చేయు ప్రతివస్తువు ప్యాకింగు పైన "ఉమా" అను ఇంగ్లీషు అక్షరములు గుర్తించి కొనవలెను. బంగారు వన్నె 10 సంవత్సరములు గ్యారంటీ.

* * *

పరీక్ష చేయగోరువారు ఉమా ఆభరణములను మహా ద్రావకములో వేసిన 5 నిమిషములకే బంగారము రేకు వెడలివచ్చును. ఈ విధముగా పరీక్ష చేసినవారు అనేకమంది మాకు సర్టిఫికేట్లు యిచ్చియున్నారు. 800 డిజైనుల క్యాటలాగు ఉచితముగా పంపబడును. ఇతర దేశములకు క్యాటలాగు ధరలమీద 25% అధికము.

*N.B.*—వస్తువుల వి. పి. పార్శిలు చార్జి 0-15-0 మాత్రమే అగును.

Tel : "UMA" MASULIPATAM



## ది మైసూర్ ఫర్టిలైజర్ కంపెనీ, వారి

# కమలము మార్కు ఎరువులు

నాణ్యతకు సరఫరాకు నమ్మతగినవి!

మీ భూములను సారవంతమొనర్చి, సస్య సమృద్ధిగల్గించి ఆహారకొరతను తీరుస్తాయి.

దేశావసరమే ఆహారం!

మీ అవసరమే కమలము మార్కు ఎరువులు

ప్రధాన కార్యాలయం :

31 - A నార్త్ బీచ్ రోడ్డు, మదరాసు.

బ్రాంచీలు : ఉదకమండలం, కూనూరు, మెట్టుపాళయం, ఈరోడ్, కుప్పం, బెంగుళూరు.

ఏజన్సీలు రాజధాని అంతటా కలవు.

# స్టార్ ఆఫ్ ఇండియా

పెన్సిళ్లకై

ది మద్రాస్ పెన్సిల్ ఫాక్టరీ వారిని

★

ఉత్తమ తరగతి అచ్చుపనులకు, లిథోప్రింటింగునకు

హో అండ్ కంపెనీ వారిని

★

అన్ని రకములైన స్టేషనరీ పరికరములకు

వి. పెరుమాళ్‌చెట్టి అండ్ సన్స్ వారిని

సంప్రతించండి.

వి. పెరుమాళ్‌చెట్టి అండ్ సన్స్,

5, స్ట్రింగర్ వీధి :: మద్రాసు - 1




## ముఖ్యముగా గమనింపవలసిన విషయము ఏది?

★ ఆకలైనపుడు చేతికందినవానిని భుజించి. ఆరోగ్యము బోగొట్టుకొని మందుల కోసం వృధాగా డబ్బును వ్యయముచేయు విధముననే కొందరు సరసముగ దొరుకునట్టి కృత్రిమపు నస్యములను కొని ఉపయోగించి కాలక్రమమున తల నొప్పి, మైకము, ఉత్సాహములేమి, నిద్రలేమి, నరముల పటుత్వము తగ్గుట, దృష్టి మాంద్యము మున్నగు వ్యాధులకు లోనై ఆర్జించిన ధనమును వెచ్చించు కొంటున్నారు.

★ కృత్రిమపు నస్యముల ఉపయోగించుటవల్లనే ఈ వ్యాధులు వచ్చినవి, లేక వచ్చుచున్నవి అనుదాన్ని ప్రజలు గుర్తించటంలేదు. ఏలన, ఈ కృత్రిమపు నస్యముల ఉపయోగించుటచే కలుగు కీడులు బయటకు తెలియుటలేదు. కాని యీ కీడులను గ్రహించిన జడ్జీలు, డాక్టరులు మరియు లక్షలకొలది జనము "శ్రీ అంబాళ్ మద్రాసు నస్యం" ఒక్కదానిని మాత్రమే ఉపయోగించి ఆనందాన్ని పొందుతున్నారు. కృత్రిమపు నస్యాలను కన్నెత్తియైన చూడటంలేదు.

★ శ్రీ అంబాళ్ పట్టణపునస్యము కారమునకై యెట్టి రసాయనపు వస్తువును కలుపబడినది కాదు. నెలరోజులుంచినను గుణమున మార్పువుండదు. నాసికకు హితమును, మెదడునకు ఉత్సాహమును కలిగింపదగినది. నేడే పరీక్షించి, దాని గుణమును మీ మిత్రులకు తెలుపుడు.

---

## శ్రీ అంబాళ్ & కంపెనీ

**2/13. పెరుమాళ్ళుగుడితోట 1వ వీధి,**

**తపాలాపెట్టె నెం. 3, :: జి. టి. మద్రాసు.**


పొరుగింటి పైన ద్వేషాలు
పెరిగించితే రేగు రోషాలు
మరచిపో ఇక మత్సరాలు
పొరుగు సమమే నీదు మేలు!
విజయ వారి....
షావుకారు
[ఇరుగు పొరుగుల కథ]
దర్శకుడు - ప్రసాద్...
నిర్వాహకులు - నాగిరెడ్డి :: చక్రపాణి...
क्रियासिद्धिः सत्वे भवति
VIJAYA PRODUCTIONS L.

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక......

## రిపబ్లిక్ సంచిక

సంపుటి 13] ఫిబ్రవరి 1950 [సంచిక 2


## లక్ష్యసిద్ధి

భారతదేశం యావత్తూ జాతీయపర్వదినంగా భావించి అమితోత్సాహంతో ఉత్సవాలు జరుపుకున్న రోజున గాంధిమహాత్ముడు ప్రాయోపవేశంచేసి ప్రార్థనలతో [illegible] గడిపివేశారు. అది 1947 ఆగస్టు 15.

150 సంవత్సరాల బానిసత్వంనుండి దాదాపు 40 కోట్ల భారతీయులు విముక్తి పొంది సర్వాధికార సమన్విత స్వతంత్ర ప్రజారాజ్యస్థాపనకు ప్రాతిపదికవేసుకొన్న రోజు అది. నాడు ప్రజానాయకులకు, ప్రజలకు కర్తవ్యాన్ని బోధించి అందర్నీ స్వధర్మనిరతుల చేయడానికి మహాత్ముడు మనమధ్యఉండి నిరాహారదీక్ష బూనినారు. నేడు ప్రజలు ఆయన నిర్దేశించిన మార్గానికి ఎంత దూరులైనారో వారికి గాంధి మహాత్ముడు అంతదూరమైనాడు. వారి ఆత్మ మనలను కర్తవ్యనిర్వహణలో ఉత్సాహ పరుచునని ఆత్మతృప్తిని పొందుటకు అలవాటుపడినాము. ఇహలోకమును వదలి వెళ్ళినా పరలోకమునుండి మనలను వెయికళ్ళతో కనిపెట్టిఉంటున్నారని మన చర్యలను సమర్థించుకొని సంతృప్తి చెందుతున్నాము.

ఇతర ఆసియాఖండరాజ్యాలవలె భారతదేశం అరాచకానికి ఆలవాలము కాలేదన్ని మనకు ఉన్నంతమాత్రపు స్థిరమైనప్రభుత్వం ప్రాచ్యప్రపంచంలో మరొకదేశానికి లేదని మనం గర్విస్తున్నాం. కాని 1947 ఆగస్టు 15 న మహాత్ముడు ఎందుకు ఉపవాసంచేశారు? 1920 లో దేశీయనాయకత్వాన్ని వహించి దాదాపు మూడు దశాబ్దాలపర్యంతం వారు సాగించిన వివిధఉద్యమముల లక్ష్యాలకు మనం ఇప్పటికీ ఎంతదూరంలో ఉన్నాము? అనేప్రశ్నలను వేసుకొని సమాధానాల సరయడానికి

ఈషణ్మాత్రమైనా ప్రయత్నించడంలేదని విచారించే భారతీయుడు ఒక్కడూ కన్పించడంలేదు.

నేటినుంచీ మన ప్రజాప్రతినిధులు ఒకనెల తక్కువగా మూడుసంవత్సరాలు చర్చలు జరిపి తయారుచేసిన దీర్ఘ రాజ్యాంగశాసనాన్ని అనుసరించి. మనదేశ ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవహారాల పరిష్కారం, ప్రభుత్వ పరిపాలన సాగుతూ ఉంటుంది. రాజ్యాంగాన్ని ఎవరు తయారుచేశారు అన్నవిషయంకంటే ఆ రాజ్యాంగాన్ని, ఎవరు ఏవిధంగా అమలుజరుపుతున్నారు అన్నది ప్రధానాంశం. 1947 ఆగస్టు 15 నుంచీ ఈనాటివరకూ మనదేశపరిపాలన బ్రిటిష్ రాజ్యాంగవేత్తలు తయారుచేసిన చట్టాన్ని అనుసరించేగదా జరిగింది. అయినా ఆ రాజ్యాంగచట్టాన్ని అమలుజరిపింది మన అగ్రనాయకులుకదా అన్న తృప్తి ఒకటిఉంది. కనుకనే ఆ శాసనంలో అవాంఛనీయమైన అనేకనిబంధనలు ఉన్నప్పటికీనీ, దేశంలో ఏర్పడిన అసాధారణ పరిస్థితులను ఎదుర్కొనే నిమిత్తం వీరు ఈ శాసనాన్ని, బ్రిటిష్ సామ్రాజ్యరక్షణకు తయారైన క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌లాంటి దారుణశాసనాలనూ అమలుజరిపినా ప్రజలు అగ్రనాయకుల ఆజ్ఞలను శిరసావహిస్తూవచ్చారు.

ఈ రెండున్నర సంవత్సరాల అనుభవంమీద ఒక విషయం స్పష్టమౌతున్నది. ప్రజలు తమకు రాజకీయాధికారం లభించిందా లేదా అనే విషయమైగాక, స్వరాజ్యం వచ్చినతరువాత తమ ఆర్థికస్థితి ఎలా ఉంది? సంఘంలో తమకుపూర్వంకంటె ఏమైనా గౌరవస్థానం లభించిందా? జీవనప్రమాణం హెచ్చిందా? పౌరస్వాతంత్ర్యం విస్తృతం కాకపోయినా పూర్వంకంటె పరిమితంకాకుండా ఉందా? ఒక్కవాక్యంలో చెప్పాలంటే మన దేశాన్ని మన నాయకులే పాలించడం ప్రారంభించినతరువాత మనం తినే తిండి, కట్టే గుడ్డఖరీదు ఏమైనా తగ్గిందా? అనే సామాన్య ప్రజలు ప్రశ్నించుతూ ఉన్నారు అని స్పష్టమౌతున్నది.

నాయకులు ఈ విషయాన్ని గ్రహించలేదనిగాని, గ్రహించి ప్రజల కనీసకోర్కెలను తీర్చడానికి ప్రయత్నించలేదనిగాని ఎవ్వరూ నేరారోపణ చేయడానికి వీల్లేదు. ప్రజలకు పరిపూర్ణమైన ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యం లభించితేగాని రాజకీయ స్వాతంత్ర్యంవల్ల ప్రయోజనంలేదని అనుక్షణం మన నాయకులు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. 1947 ఆగస్టు 15 న గాంధిమహాత్ముడు ఉపవాసంచేసి దైవ ప్రార్థనలతో కాలక్షేపంచేయడానికి కారణంకూడా ఇదే. భారత ప్రజానీకము నాలుగు దశాబ్దాలుగా సత్యాగ్రహోద్యమాలను, శాసనోల్లంఘనఉద్యమాలను సాగించడానికి వారిని ఉత్సాహపరచినది ఈ రాజకీయ స్వాతంత్ర్యాభిలాషగాదు. ఈ రాజకీయ

స్వాతంత్ర్యం ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్య, సమత్వములను సాధించుటకు ప్రయోజనకరమైన పరిహారము కాగలదనే దృఢవిశ్వాసమే భారత ప్రజలను 1857 నుంచీ స్వాతంత్ర్య సమరోన్ముఖులను చేస్తూవచ్చింది. ఈ విషయాన్నే గాంధీమహాత్ముడు తన నిరాహారదీక్షద్వారా స్వతంత్రభారతప్రభుత్వ రథసారధ్యమును వహించిన నాయకులందరికీ జ్ఞాపకం చేశారు.

1947 అగస్టు 15 న ఈ అంతిమలక్ష్యానికి ప్రజలు ఎంతదూరంలో ఉన్నారో ఇవాళ 1950 జనవరి 26 న కూడా అంతదూరంలోనే ఉన్నారు. ఆర్థిక, సాంఘిక సమత్వం ఇవాళకూడ లక్షింపతగిన మహదాశయాలుగా, సాధింపవలసిన మహోన్నతలక్ష్యాలుగా మాత్రం ఉన్నవి. వయోజన వోటింగ్ సూత్రాన్ని అమలుజరపడం వల్ల రాజకీయసమత్వం లభించింది. కాని సంఘంలో విపరీతమైన తరతమ భేదాలు అలాగే ఉన్నవి. ద్రవ్యపంపకం పాతపద్ధతులపైననే సాగుతూఉంది. అందుకు కారణం ద్రవ్యోత్పత్తి జనాభా పెరుగుదలకు తగ్గట్టు ప్రజావసరాలకు తగ్గట్టు పెరగక పోవడమే అని మన నాయకులు అంటున్నారు. యథార్థస్థితిని గ్రహించితే మనం కూడా ఆ విషయాన్ని కాదనలేము. కనకనే ఆర్థికసమత్వ సాధనకు ద్రవ్యోత్పత్తిని ప్రజావసరాలను తగ్గట్టు అధికంచేయాలని, ద్రవ్యం అంటే ప్రజావసరవస్తువులేగనక దేశపారిశ్రామిక ఉత్పత్తినీ, ఆహారధాన్యాల ఉత్పత్తినీ అందరి అవసరాలూ తీరేటట్లు హెచ్చుచేసి, తద్వారా సమవిభజన సాధించాలని మన నాయకులు ఉద్బోధిస్తున్నారు.

మన నాయకులు ఉత్పత్తిని—వస్తూత్పత్తిని—అధికంచేయాలని ఉద్బోధిస్తుంటే కొన్నివర్గాలవారు ఉత్పత్తి ఎలాఉన్నా, ఉన్నసంపదనే, వచ్చినంతవరకే అందరికీ సమంగా పంచాలని ఆందోళనచేస్తున్నారు. కష్టపడకుండా, ఇతరుల కష్టఫలితాన్ని తామూ అనుభవించడం అందరికీ సమ్మతమే. సమ్మతమేగాదు; అందుకు సంబంధించిన నినాదాలు హృదయానికి హత్తుకుపోతవి! ఆ ఆందోళనలో విపరీతమైన ఆకర్షణశక్తిఉంది. ప్రజలను ఆ నినాదాలనుండీ, ఆ ఆందోళననుండీ నిర్మాణాత్మక కార్యక్రమాలకు సుముఖులుగా చేయడం అంత సులభమైనపనిగాదు. ప్రజల మనస్సులను దేశావసరములపైకి, వారి కర్తవ్యములవైపుకు మరల్చకపోతే అరాచక శక్తులను అరికట్టడం సాధ్యంగాదు. దేశంలో శాంతిని స్థాపించడం సులభంగాదు. ఈ రెండూ జరగందే జాతిఅభివృద్ధికి ప్రజలజీవన ప్రమాణాభివృద్ధికి ప్రభుత్వం యావచ్ఛక్తిని వినియోగింపజాలదు. మనస్ఫూర్తిగా, శక్తికొద్దీ, లక్ష్యాన్ని కేంద్రీకరించి పనిచేయకపోతే ప్రయోజనం ఏమీ ఉండకపోగా, ప్రమాదాలు అధికమౌతవి.

ప్రజలకు క్రమంగా భారత జాతీయ కాంగ్రెస్‌లోనూ, కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనూ విశ్వాసం తగ్గిపోతూఉంది. కాంగ్రెస్‌నాయకులపై పూర్వంఉన్న అభిమానంలేదు. కాంగ్రెస్ మంత్రివర్గాలపై పూర్వంఉన్న గౌరవంలేదు. ఇందుకు ముఖ్యకారణం మన నాయకుల్లోనూ, ప్రభుత్వంలోనూ నైతికప్రమాణం ఘోరంగా తగ్గిపోయింది. పడిపోయింది. 'యథారాజా తథా ప్రజ' అన్నది నేడు అక్షరాలా సత్యమైనది. జయపూర్ కాంగ్రెస్‌లో నైతికప్రమాణాలను హెచ్చించడంగురించీ, నైతికవిలువలను పునరుద్ధరించటంగురించీ చేయబడిన తీర్మానం, ఇప్పటికీ తీర్మానరూపంలోనే ఉంది. ప్రజలు మనస్ఫూర్తిగా కాంగ్రెస్‌తో, ప్రభుత్వంతో సహకరించడంలేదు. ప్రజల ఈ వైఖరికి కారణం ఏమిటో తెలుసుకోవాలి. ఆ వైఖరిని మార్చివేయడానికి ఏం చేయాలో విచారించుకోవాలి. విచారణ ఫలితాలను అమలుజరపడానికి తీవ్రకృషి చేయాలి. నేడు ప్రతిఒక్కరూ అధికారులే గాదు; కాంగ్రెస్‌వాదులే కాదు; యావన్మంది భారతీయులు ప్రతి ఒక్కరూ ఆత్మపరీక్ష చేసుకోవాలి. నేటి దేశీయస్థితికి మనం వ్యష్టిగా, సమష్టిగా ఎంతవరకు బాధ్యులమో గ్రహించుకోవాలి.

ప్రభుత్వం అంటే అంత అనుకూలాభిప్రాయం లేకపోవడానికి కాంగ్రెస్ అంటే కొంత ప్రతికూలాభిప్రాయం ఉండడానికి కారణం ప్రధానంగా దేశంలో ఏర్పడిన అసాధారణ ఆర్థిక, రాజకీయపరిస్థితులే. ప్రభుత్వం ఇది చేయలేదు, అది చేయులేదు అనీ, మంత్రులు ఇలాచేశారు, అలాచేశారు అనీ ప్రజలు అసంతృప్తి చెందడానికి కారణంకూడా ఇదే. అయితే 1947 ఆగస్టునుంచి 1950 జనవరివరకూ మన ప్రభుత్వం ఏమీచెయలేదని అనగలమా?

రాజకీయరంగంలో మన ప్రభుత్వం ఏ ఇతర ప్రభుత్వమూ సాధింపలేని అఖండ విజయాలను సాధించింది. రష్యాలో 1917లో బోల్షివిక్ విప్లవం విజయవంతమై లెనిన్ అధికారాన్నిపొందినా 1924 వరకూ దేశరాజకీయస్థితి కుదటబడలేదు. ఇది ఆకాలం కథ అని అనుకున్నా, మన పొరుగునఉన్న బర్మా ఈనాటివరకూ అంతర్యుద్ధంతో కుంగిపోతున్నది. జాతీయ చైనా అపారమైన అమెరికా ఆర్థిక సైనిక సహాయం ఉన్నప్పటికీ కమ్యూనిస్టులకు పాదాక్రాంతమైంది. భారతదేశం తన రాజకీయ స్వాతంత్ర్యాన్ని నిలుపుకున్నది. దేశవ్యాప్త అంతఃకలహాలుగా పరిణమించే మత సంఘర్షణలను ఎక్కడికక్కడ అదుపులోఉంచి శాంతిభద్రతలను సంరక్షించుకోకల్గింది. సర్దార్‌వల్లభాయ్‌పటేల్ రాజనీతిజ్ఞత, దూరదృష్టివల్ల ఏ ముక్కకు ఆ ముక్కగా ఛిన్నాభిన్నమై పోవలసిన భారతదేశం అఖండ భారతదేశంగా అవతరించింది. తరతరాలవారు ఇందుకు మన తరంవారికి కృతజ్ఞులుగా ఉండగలరు.

560 సంస్థానాలను భారతదేశంలో లీనం చేసివేయడమనేది ఎంత మహాశ్చర్యమో ఈ రెండుశతాబ్దాల భారతదేశ చరిత్రను పరిశీలించినవారికి బోధపడుతుంది.

అలాగే అంతర్జాతీయ వ్యవహారాల్లోనూ మన ప్రతిష్ట అనుకోనంతగా పెరిగిపోయింది. సోవియట్ ప్రపంచంతో మనదేశసంబంధాలు ఉండవలసినంత సన్నిహితంగా ఉండకపోయినా ఇంతవరకూ ఏదేశంతోనూ విరోధం అనేది లేకుండా కాలక్షేపం చేస్తూవచ్చాం. అందుకు మన విదేశాంగవిధానం మూలసూత్రాలే కారణం. పోయినసంవత్సరాంతంలో భద్రతామండలికి ఎన్నికలు జరిగినవి. అందులో యుగస్లావియా, చెకస్లవేకియా పోటీచేస్తే భారతదేశం యుగస్లావియానుగాక చెకస్లోవేకియానే బలపరచింది. అలాగే చైనా భూభాగం యావత్తూ పెకింగ్ ప్రభుత్వాధీనం అయినట్లు ధృవపడగానే, ఆ ప్రభుత్వాధిపతి మన ప్రధానమంత్రినిగురించి అసభ్య ప్రసంగములు చేసినాకూడా, భారత ప్రభుత్వం మౌల్ సే - టుంగ్ ప్రభుత్వాన్ని గుర్తించింది. అలాగే ప్రజాస్వామ్యరాజ్యాలన్నింటితో అతిసన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకోకల్గింది. భారతప్రధానమంత్రి అమెరికాయాత్ర మన విదేశాంగవిధానం ఎంత ఫలప్రదమైందో గ్రహించడానికి ఒకగీటురాయిలాంటిది. అలాగే భారతదేశం రిపబ్లిక్ రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసుకున్న కామన్వెల్తు సభ్యత్వానికి భంగం కలుగనివిధంగా నిబంధనలను మార్చుకోవడంకూడా మన విదేశాంగవిధానానికి విజయం. ఇండొనీషియా పోయినమాసాంతాన స్వతంత్రరాజ్యంగా అవతరించిందంటే అది భారతప్రధానమంత్రి కృషిఫలితమే. ఈవిధంగా భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన రెండుసంవత్సరాల్లో ఆసియారాజ్యాల్లో అగ్రస్థానాన్ని పొందింది. ప్రపంచ అగ్రరాజ్యాల్లో సముచితస్థానాన్ని పొందింది.

భారత ప్రభుత్వం ఇక పరిష్కరింపవలసినవి ఆర్థిక సాంఘిక సమస్యలు మాత్రమే. ఆ సమస్యలు సాధ్యమైనంతశీఘ్రంగా, సవ్యంగా సంతృప్తికరంగా పరిష్కారమైతే మన రాజకీయస్వాతంత్ర్యం స్థిరపడిపోతుంది. పాకిస్తాన్‌కూడా మనతో సవ్యంగా వ్యవహరించవలసివస్తుంది. ప్రస్తుతం ఉభయ అధినివేశాలకూ జరుగుతూ ఉన్న ఆర్థిక, వ్యాపారయుద్ధం ఇరుపక్షాలకూ గౌరవప్రదంగా ఉండేటట్లు పరిసమాప్తమౌతుంది. ఆతరువాత కాశ్మీరు సమస్య ఎంతోకాలం అపరిష్కారంగా ఉండదు.


హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ, సంస్కరణవల్ల మన సాంఘిక సమస్యలు ముప్పాతిక మూడువీసాలు పరిష్కారమైపోతవి. నూత్నరాజ్యాంగంవల్ల రాజకీయ సమత్వం ఏర్పడినట్లే ఈ హిందూధర్మ స్మృతి సంస్కరణవల్ల సాంఘిక సమత్వం

ఏర్పడుతుంది. కాబట్టే పండిట్ నెహ్రూ తన ప్రభుత్వం ఉండటమూ, పోవటమూ ఈ 'హిందూకోడ్ బిల్లు' పైనే ఉంటవని ఖచ్చితంగా చెప్పివేశారు. డాక్టర్ అంబేడ్కర్ అన్నట్లు ఈ స్మృతి సంస్కరణ నూత్నరాజ్యాంగం అమలుజరగడంతోబాటే చేయాల్నారు. అలా చేయకపోతే ఇప్పటి ధర్మస్మృతి నూత్నరాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటుందనీ, అందువల్ల రాజ్యాంగం అమలుకావడంతో ఇందులోని కొన్ని నిబంధనలు వాటి కవి చట్టవిరుద్ధమై అంతరించిపోతవనీ ప్రకటించారు. కాబట్టి రిపబ్లిక్ పార్లమెంట్ వీలైనంత త్వరలో హిందూకోడ్ బిల్లును శాసనం చేయవలసిఉంటుంది.

ఇక ఆర్థిక సమత్వసాధనలోనే ప్రజలు ప్రభుత్వముతో పూర్తిగా హృదయపూర్వకంగా సహకరింపవలసి ఉంటుంది. రైతులు, కూలీలు తమ కనీసపు కోరికలను పునరుద్ఘాటించడంతో తృప్తిచెందక, వస్తూత్పత్తి అధికంచేయడానికి నడుములు బిగించి పనిచేయాలి. ఉన్న సంపదను అందరూ సమంగా పంచుకోవడంవల్ల అందరూ దరిద్రులుకావడం, ఏఒక్కరికీ రెండుపూటలా తిండి, ఉండేందుకు ఇంత పరిశుభ్రమైన నెలవు, కట్టుకోవడానికి చాలినంత బట్ట ఉండదు. దారిద్ర్యాన్నే నిర్మూలించాలని నాయకులు ఉద్బోధిస్తూఉంటే, వర్గసంఘాలు ఘోషిస్తూఉంటే అందరూ దరిద్రులుకావడానికి మన కార్యవిధానం దారితీయరాదు. సమత్వం దారిద్ర్యంలోగాక సంపదలో ఉండాలి.

కార్మికుల కనిష్టవేతనాలను నిర్ణయించి, పారిశ్రామికులకు పన్నుభారం తగ్గించి అధికవస్తూత్పత్తికి ప్రభుత్వం ఎంతో దోహదం చేసింది. కార్మికులకు వాసయోగ్యమైన ఇళ్లు కట్టిస్తున్నది. సాంఘిక భీమాపద్ధతిని అమలుచేస్తూఉంది.

ఇలాగే రైతుల విషయంలోనూ ధాన్యానికి ధరలను నిర్ణయించడం జరిగింది. వ్యవసాయానికి అవసరమైన సామగ్రిని కంట్రోలు ధరలకు వీలైనంతమందికి అందజేస్తున్నారు. కొందరికి ఉచితంగా ఎరువులను, విత్తనాలనూ ఇస్తున్నారు. ప్రభుత్వం ఈవిధంగా తన బాధ్యతలను, విధులను నిర్వహిస్తున్నది. అలాగే మనమూ మనవిధిని నిర్వహిస్తామని నేడు ప్రమాణంచేసి, రేపట్నుంచీ ఆ ప్రమాణాన్ని పాలించడానికి పని ప్రారంభించాలి. ప్రమాణాలకు, ప్రగల్భాలకు, వాదప్రతివాదాలకు, తర్కవితర్కాలకు ఇది సమయంగాదు. దేశసంపదకు సమష్టిప్రయత్నం చేయాలి. మాటలుమాని, చేతలమీదనే యావచ్ఛక్తినీ కేంద్రీకరించాలి. అప్పుడే మనం మన స్వాతంత్ర్యానికి అర్హులం కాగలం.



# భారత రాజ్యాంగం

[సింహావలోకనం]

[ఈ వ్యాసంలో భారతరాజ్యాంగంయొక్క ప్రధానవిషయాలను వివరించిన శ్రీ ఎస్. ఎన్. ముఖర్జీ భారతరాజ్యాంగ పరిషత్తుకు సంయుక్తకార్యదర్శి. రాజ్యాంగ రచయితగా ఉండి, రాజ్యాంగంతాలూకు అంశాలను రచించడంలో శ్రీ బి. ఎన్. రావుతోబాటు బాధ్యత వహించారు.]

1950 జనవరి 26న ప్రపంచంలో ఒక కొత్త రిపబ్లికు, భారత రిపబ్లికు, అవతరిస్తుంది. ఇరవై ఏళ్ళక్రితం మహాత్మాగాంధీ నాయకత్వంకింద ఇదేరోజున భారతీయులు స్వాతంత్ర్యం సాధించడానికి బద్ధకంకణులై ఉండిన కారణంచేత భారత రిపబ్లికు ఆరంభానికి ఈ తేదీ నిర్దేశించడం జరిగింది.

రాజ్యాంగరీత్యా ఇండియా సర్వతంత్ర స్వతంత్ర ప్రజాస్వామిక రిపబ్లికు. దీని అధికారాలన్నీ భారతప్రజలనుండి ఉత్పన్నమవుతాయనీ, ప్రజాస్వామికానికి ముఖ్య లక్షణాలయిన న్యాయస్వాతంత్ర్య సమతాసౌభ్రాతృత్వాలు రాజ్యాంగంయొక్క ఆశయాలనీ రాజ్యాంగపీఠిక చెపుతోంది. ఇండియాయొక్క ఉన్నతరాజ్యాధికారి పరంపరానుగత పరిపాలకుడు కాడు కనుక ఇది రిపబ్లికను రాజ్యాంగం.

ఇది ఫెడరలు విధానంగల రాజ్యాంగం. ఇందులో ద్విపరిపాలనావిధానం ఉండి, ప్రత్యేక రాష్ట్రాలలో ప్రత్యేక ప్రభుత్వాలూ, అన్నిటికీ కలిసి యూనియను ప్రభుత్వమూ ఉంటాయి. అమెరికా, కెనడాలలోవలెనే ఇక్కడకూడా ప్రత్యేక రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రప్రభుత్వానికి లోబడి ఉండవు. ఈ రాజ్యాంగం ద్విపరిపాలనావిధానాన్ని అనుసరించినప్పటికీ ప్రధానవిషయాలలో ఒకేవిధానం అంతటా అమలు జరుగుతుంది. ఉదాహరణ: ద్విపౌరత్వ విధానం ఉండదు; అందరూ భారత పౌరులేగాని రాష్ట్రపౌరులంటూ ఉండరు. దేశమంతటికీ ఒకే న్యాయనిర్వహణ శాఖా, ఒకే సివిలు, క్రిమినలు చట్టమూ వగైరాలుంటాయి. ఏరాష్ట్రంగాని యూనియనునించి విడిపోరాదు, తన స్వంతరాజ్యాంగం రచించుకొనరాదు.

కర్త: శ్రీ ఎస్. ఎన్. ముఖర్జీ

(భారతరాజ్యాంగపరిషత్తు సంయుక్త కార్యదర్శి)

## మార్పులకు అవకాశాలు


ఇతర ఫెడరేషనులవలె భారత ఫెడరేషను నిర్బంధాలలో కూడుకొని, మార్పులకు అవకాశం లేనిది కాదు. ఇతర ఫెడరేషనులు కేంద్రీకరణకుకూడా అవకాశం ఇవ్వవు. భారత రాజ్యాంగంలో ఈ అవకాశం ఉంటుంది. 47 ప్రత్యేక విషయాలనుగురించి శాసనాలు చేసే అధికారం యూనియను పార్లమెంటుకుంటున్నది. రాజ్యాంగాన్ని మార్చడానికికూడా విశేషమైన అవకాశాలున్నవి.

ఈ రాజ్యాంగం సాధారణ పరిస్థితులలో ఫెడరలుగా ఉన్నప్పటికీ, అసాధారణ తీవ్రపరిస్థితు లేర్పడగానే కేంద్రీకరణకు తావిస్తుంది. తీవ్రపరిస్థితులలో వైషమ్యాలు ఏర్పడి పరస్పర విరుద్ధశక్తులు తల ఎత్తినప్పుడు పౌరులు రాష్ట్రాలకు కాక యూనియనుకే విధేయులై ఉండడం అత్యవసరం.

## పార్లమెంటరీ డెమోక్రసీ

భారత రాజ్యాంగంకింద ఉన్నత పరిపాలనాధికారి "అధ్యక్షుడు" అని పిలువబడినప్పటికీ, అమెరికాలోలాంటి అధ్యక్షపరిపాలనకాక, పార్లమెంటరీ డెమోక్రసీద్వారా ప్రజాప్రభుత్వం అమలుజరుగుతుంది. యూనియను తరఫున అన్ని అధికారాలనూ వినియోగించే అధ్యక్షుడు, వయోజన వోటింగు విధానంద్వారా ప్రజలు ఎన్నుకొన్న మంత్రుల సలహాతో మాత్రమే వ్యవహరిస్తాడు. ఈవిధంగా ప్రభుత్వం చేసే ప్రతిచర్యకూ ప్రజామోదం ఉంటుంది. ఇటువంటి ప్రభుత్వం మన రాష్ట్రాలలో చాలా ఏళ్ళు అమలుజరిగింది. బాధ్యతాయుతప్రభుత్వం మనకు కొత్తకాదు. ప్రాచీనకాలంలోకూడా మనరాజులు ప్రజాభిప్రాయాన్ని పురస్కరించుకొని తమ మంత్రులను మార్చుతూ ఉండేవారు.

మన రాజ్యాంగంలో 395 అంశాలూ, 8 షెడ్యూళ్ళూ ఉన్నవి. మనదేశపరిస్థితులు తెలియనివారికి రాజ్యాంగం అతివిస్తరంగా తోచవచ్చు. ఇతర రాజ్యాంగాలలో ధర్మశాస్త్రానికి వదలబడే అంశాలుకూడా మన రాజ్యాంగంలో విస్పష్టంగా నిర్దేశించబడినవి. మనదేశం విస్తీర్ణమైనదీ, ప్రజలు వివిధులూ, సంరక్షించబడవలసిన హక్కులు విపులమూ కావడంచేత ఈవిధంగా చేయవలసివచ్చింది. వివిధపక్షాల సమన్వయంకొరకున్నూ, తాత్కాలిక ఏర్పాటులతోనూ కూడా రాజ్యాంగాన్ని విస్తరించవలసివచ్చింది. మనం కొత్తగా ప్రజాస్వామ్యం అమలుచేస్తూ ఉండడంవల్లకూడా అనేకనిర్వచనాలు విస్పష్టం చేయవలసివచ్చింది.



కాన్‌స్టిట్యుయంట్ అసెంబ్లీ భవనము

## భారత సంస్థానాలు

భారత యూనియనులో 28 రాష్ట్రాలూ, అండమాను, నికోబారుదీవులూ చేరి ఉంటవి. మొదటి షెడ్యూలుకింద ఈ రాష్ట్రాలు మూడు తరగతులుగా విభజించబడినవి. మొదటితరగతి గవర్నరులుండిన రాష్ట్రాలు, రెండవతరగతి సంస్థానాలు, మూడవతరగతి ఛీఫ్ కమిషనరుల రాష్ట్రాలు. 1947 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్యచట్టం అమలుజరిగేనాటికి ఇండియాలో 9 గవర్నర్ల రాష్ట్రాలూ, 5 ఛీఫ్ కమిషనరు రాష్ట్రాలూ, 500 చిల్లర సంస్థానాలూ ఉండినవి. ఇవి దేశమంతటా ఉండినవి. ఇందులో కొన్ని బ్రిటిషుదీవులంత పెద్దవి, కొన్ని కొద్ది ఎకరాలవేరవి. వీటి ఉమ్మడి వైశాల్యం ఇండియా డొమినియనులో సగమూ, జనాభా ఇండియా జనాభాలో నూటికి 27 వంతులూ ఉండేది. 1947 ఆగస్టు 15కు పూర్వం ఈ సంస్థానాలు నేరుగా ఇంగ్లండు రాజుయొక్క పరిపాలనకింద ఉండేవి. వీటిపై కేంద్రశాసనసభ కట్టి పరిపాలనాధికారమూ ఉండేదికాదు. భారతస్వాతంత్ర్యచట్టం అమలులోకి రాగానే ఈ సంస్థానాలపై బ్రిటిషువారి పెత్తనం తొలగిపోయి, కేంద్రప్రభుత్వానికి వీటిపైగల అధికారాలు అస్పష్టంగా ఉండిపోయినవి. ఈ సంస్థానాలను శాంతియుతంగా, అన్నిపక్షాలవారి సమ్మతితో, రాజకీయంగానూ పరిపాలనా దృష్టితోనూకూడా ఇండియాలో చేర్చి, స్వతంత్రభారత రిపబ్లికు స్థాపించే భారం మన నాయకులపై బడింది. వారీ సమస్యను సమగ్రంగానూ, విజయవంతంగానూ పరిష్కరించారు. కొన్నిసంస్థానాలను ఏకంచేసి, మరికొన్నిటిని రాష్ట్రాలతో

చేర్చి మొత్తం సంస్థానాలసంఖ్య 16 కు దించారు. ఇందులో 9 మొదటి షెడ్యూలులోని రెండవ అయిటముగానూ, మిగిలిన 7 మూడవ అయిటముగానూ రాజ్యాంగంలో పేర్కొనబడి ఉన్నాయి. అంతేకాక నూతన రాజ్యాంగంలో ఈ సంస్థానాలకు రాష్ట్రాలతో సరిసమానమైన ప్రతిపత్తికూడా కలదు.

కొత్తసంస్థానాలను కలుపుకొనేటందుకుగాని, సృష్టించేటందుకుగాని శాసనాలు చేయటానికి నూతనరాజ్యాంగలో పార్లమెంటుకు అధికార మివ్వబడింది.

## పౌరత్వం

ఇండియాకంతకూ ఒక పౌరత్వం ఉన్నది. పౌరత్వానికి సంబంధించిన సమగ్రశాసనాలను పార్లమెంటు చేయవచ్చు. రాజ్యాంగంలో చేసిన తాత్కాలిక ఏర్పాటుప్రకారం ఇండియాలో పుట్టినవారు ఇండియాలో పుట్టిన తల్లిగాని తండ్రిగాని కలవాడూ, లేక రాజ్యాంగం అమలులోకి రావటానికి పూర్వం కనీసం అయిదుసంవత్సరాలపాటు ఇండియాలో ఉన్నవాడూ పౌరత్వానికి అర్హుడవుతాడు. పాకిస్తానునుండి ఇండియాకు వలసవచ్చినవారికొరకూ, దేశాంతరాలలో ఉన్న భారతీయులకొరకూ ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినవి.

## ప్రాథమిక హక్కులు

రాజ్యాంగాలలో ప్రాథమిక హక్కులను పేర్కొనటం రివాజు. ప్రభుత్వం నైతికంగా ఆ హక్కులను కాపాడవలసిఉంటుంది. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం, మానవహక్కులు సర్వత్రా పాటించబడితేనేగాని అంతర్జాతీయ శాంతి సాధ్యంకాదని గుర్తించబడింది. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు విస్తృతంగా వివరించబడినవి. అమెరికాలోవలె ప్రాథమిక హక్కులను ఆదర్శప్రాయంగా రచించి వాటిని హద్దులో ఉంచే శాసనాలను సుప్రీముకోర్టుచేత చేయించకుండా, మన రాజ్యాంగ రచయితలు ప్రాథమిక హక్కులకు అవధులు కల్పించే అధికారం ప్రభుత్వానికే వదిలారు. మన రాజ్యాంగంలో ఈకింది ప్రాథమిక హక్కులు పేర్కొనబడినవి:

సమానత్వపు హక్కు.
స్వాతంత్ర్యపు హక్కు.
దోపిడికాకుండా ఉండే హక్కు.
మతస్వాతంత్ర్యపు హక్కు.
విద్యాసంస్కృతుల హక్కు.
ఆస్తి హక్కు.
రాజ్యాంగంద్వారా పరిష్కారాలు పొందే హక్కు.

## అస్పృశ్యతా నిర్మూలన

రాజ్యాంగంలోని 17వ అంశం అస్పృశ్యతను నిషేధిస్తూ, దానిని అమలుజరిపే వారు శిక్షార్హులని చెబుతున్నది. సమానత్వపు హక్కు క్రింద ఇది అత్యంత ప్రధానాంశం. 19వ అంశంప్రకారం స్వేచ్ఛగా మాట్లాడటానికీ, భావప్రకటనకూ, సమావేశంకావటానికీ, సంచరించటానికీ, నివసించటానికీ, ఆస్తి సంపాదించీ, వినియోగించీ, విక్రయించటానికీ, ఇష్టమైన వృత్తులు సాగించటానికీ హక్కున్నది. వీటికి కొన్ని అవధులుకూడా ఉన్నాయి.

## వ్యక్తి స్వాతంత్ర్యం

21, 22 అంశాలు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని రక్షిస్తాయి. 22వ అంశం అకారణమైన ఎరెస్టులనూ, అంతులేని నిర్బంధాలనూ నిషేధిస్తుంది. 31వ అంశంప్రకారం చట్టరీత్యాతప్ప ఎవరి ఆస్తిగాని స్వాధీనపరచుకోబడరాదు. ప్రజోపయోగాలకొరకు స్వాధీనపరచుకోబడే ఆస్తికి పరిహారం ఇవ్వబడాలి. పరిహారంకింద ఇచ్చే మొత్తంగాని, పరిహారం నిర్ణయించే విధానాలుగాని తెలుపబడాలి.

32వ సూత్రంప్రకారం పనిచేయడానికీ, విద్య పొందడానికీ, నిరుద్యోగిగా ఉన్నప్పుడుగాని, వార్ధక్యంలోగాని, వ్యాధిగ్రస్తుడై ఉన్నప్పుడుగాని, వికలాంగుడైనప్పుడుగాని ప్రభుత్వసహాయం పొందడానికీ, పని అన్యాయంగా గాని, క్రూరంగా గాని ఉండకుండ చూడడానికీ, 14 ఏళ్ళ లోబడిన వయస్సుగల పిల్లలకు ఉచిత, నిర్బంధవిద్య లభించడానికీ, ఆరోగ్యభంగం కలిగించే తాగుడులూ, మాదద్రవ్యాలూ నిషేధించడానికీ, అంతర్జాతీయ శాంతిభద్రతలు పొందేలాగు కృషిచేయడానికీ హక్కున్నది.

యూనియనుకు ప్రధానాంగాలైన పాలన, శాసన, న్యాయశాఖలు రాజ్యాంగం యొక్క అయిదవ విభాగంలో వివరించబడింది.

## అధ్యక్షుడు

యూనియనుకంతకూ ఉన్నత పాలనాధికారి అధ్యక్షుడు. యూనియనుయొక్క రాజ్యనిర్వహణాధికారమంతా ఆయనలోనే ఉండి పాలనచర్యలన్నీ ఆయనద్వారనే జరగాలి. కేంద్ర, రాష్ట్రశాసనసభలకు ఎన్నుకోబడిన సభ్యులు అధ్యక్షుని ఎన్నుకొంటారు. వోట్లు అంచనాకట్టడంలో కేంద్రశాసనసభవోట్లు అన్నిరాష్ట్రశాసనసభలవోట్లకూ సమంగా పరిగణించబడతవి. అధ్యక్షుడు అయిదేళ్ళు పదవిలో ఉండి తిరిగి మళ్ళీ అధ్యక్షస్థానానికి నిలబడవచ్చును. రాజ్యాంగాన్ని అతిక్రమించాడన్న నేరంమీద అధ్యక్షుని విచారించి తొలగించవచ్చు.



సర్ బి. న్. రావు



డా॥ అంబేద్కర్

ఉపాధ్యక్షుడు కేంద్రశాసనసభచేత ఎన్నుకోబడతాడు. అతడుకూడా అయిదేళ్ళు పదవిలో ఉంటాడు. అమెరికాలోలాగే ఉపాధ్యక్షుడు కేంద్రంలోని ఉన్నతశాసనసభకు అధ్యక్షుడుగా ఉంటాడు. కాని అధ్యక్షస్థానం ఖాళీ అయినప్పుడు ఉపాధ్యక్షుడు అధ్యక్షుడుగా తాత్కాలికంగా వ్యవహరిస్తాడు. అయితే అమెరికాలోలాగ అధ్యక్షుని గడువు తీరేవరకు కాక నూతనాధ్యక్షుని ఎన్నిక జరిగేవరకే ఉపాధ్యక్షుడు అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు.

కేంద్రంలో పార్లమెంటువిధానం ఉంటుంది. దిగువశాసనసభ (ప్రతినిధుల సభ)కు బాధ్యులైన మంత్రివర్గంయొక్క సలహాలతో అధ్యక్షుడు బ్రిటీషురాజువలె వ్యవహరిస్తాడు. మంత్రులసలహాలేకుండా అధ్యక్షుడు ఏమీ చేయుగాదన్నది రాజ్యాంగంలో చెప్పబడలేదుగాని అది ఆచారంగా పాటించబడుతుంది.


## పార్లమెంటు

అధ్యక్షుడూ, రాష్ట్రాల కౌన్సిలూ, ప్రజాప్రతినిధులసభా కలిసి పార్లమెంటు అవుతుంది. రాష్ట్రాల కౌన్సిలులో 250 కి మించని సభ్యులుంటారు. ఇందులో 12 మందిని అధ్యక్షుడు నియమిస్తాడు. మిగిలినవాళ్లు రాష్ట్ర ప్రతినిధులు. సారస్వతమూ, శాస్త్రమూ, కళలూ, సాంఘిక వ్యవహారాలూ మొదలైన వాటిలో నిపుణులను అధ్యక్షుడు నియమిస్తాడు. ఈ సభలో జనాభానుబట్టి రాష్ట్రాలకు

సభ్యులలో కొందరు



సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్



శ్రీ యస్. గోపాలస్వామి అయ్యంగార్

ప్రాతినిధ్యం ఉంటుంది. శాసనసభలు గల రాష్ట్రాలలో శాసనసభా సభ్యులే రాష్ట్ర ప్రతినిధులను ఎన్నుకొంటారు. శాసనసభలు లేని చోట్లకు ప్రాతినిధ్యం ఏ విధంగా ఉండేది పార్లమెంటు నిర్ణయిస్తుంది. రాష్ట్రాల కౌన్సిల్ ఒక్కసారిగా ఎన్నడూ రద్దుకాదు. రెండేళ్లకొకసారి సభికులలో మూడోవంతు మంది విరమిస్తూ ఉంటారు. వారి స్థానే కొత్తవారు వస్తూ ఉంటారు.

ప్రజాప్రతినిధి సంస్థలో 500 మందికి మించని సభ్యులుంటారు. వీరిని ప్రజలు వయోజన వోటుతో నేరుగా ఎన్నుకుంటారు. 5 లక్షల ప్రజలకు ఒక ప్రతినిధికి తక్కువ ఉండడు, 7 న్నర లక్షల ప్రజలకు ఒక ప్రతినిధికి మించి ఉండడు. సాధ్యమైనంతవరకు దేశమంతటా ఒకే లెక్కన ప్రజలకు ప్రాతినిధ్యం ఏర్పరచబడుతుంది. వేరుగా కేంద్రపరిపాలనకింద ఉండే రాష్ట్రాల ప్రజలకూ, రాష్ట్రస్థితలేని ప్రాంతాల ప్రతినిధులకూ ఇవ్వదగిన ప్రాతినిధ్యాన్ని పార్లమెంటు చట్టరీత్యా నిర్ణయిస్తుంది. ప్రజాప్రతినిధులు అయిదేళ్ళపాటు పదవులలో ఉంటారు.

## న్యాయమైన ఎన్నికలు

ఎన్నికలు న్యాయంగా జరిగేటట్లు చూడడానికీ, ఎన్నికల ఏర్పాట్లు నిర్వహించడానికీ అధ్యక్షుడొక కమిషను నియోగిస్తాడు. సుప్రీమ్‌కోర్టు జడ్జిహోదాగల ప్రధాన ఎన్నికల కమిషనరుకూడా ఏర్పాటుచేయబడతాడు. ఇతనిపై పాలకవర్గంవారి అజమాయిషీ ఏమీ ఉండదు. ప్రత్యేక నియోజకవర్గాలు లేవు.

పార్లమెంటు సభలను ఆరంభించమనీ, ముగించమనీ ఆదేశించేవాడు అధ్యక్షుడు. ప్రజాప్రతినిధి సభను రద్దుచేయడానికికూడా ఆయనకు అధికారం ఉన్నది. పార్లమెంటు సమావేశాలు ఆరంభమైనప్పుడల్లా అధ్యక్షుడు ప్రసంగంచేస్తాడు. ఆప్రసంగాన్ని పురస్కరించుకొని చర్చసాగుతుంది.


డబ్బుకు సంబంధించిన బిల్లులతప్ప మరేబిల్లు అయినప్పటికీ ఉభయశాసన సభలలో ఎందులోనైనా ప్రతిపాదించబడవచ్చు. అది ఉభయశాసనసభల ఆమోదాన్నీ, అధ్యక్షుని అనుమతినీ పొందిన అనంతరం శాసనమవుతుంది. ఇటువంటి బిల్లుల విషయంలో ఉభయశాసన సభలమధ్య వ్యత్యాసాలు కలిగితే అధ్యక్షుడు ఉభయశాసనసభలను సమష్టిగా సమావేశపరచవచ్చు. ఆ సమష్టి సమావేశంలో అధికసంఖ్యాకులు బిల్లు నామోదించినట్లయితే ఉభయశాసనసభలు ఆమోదించినట్లు భావించబడుతుంది.

డబ్బుకు సంబంధించినబిల్లు ప్రతినిధులసభలోనే ప్రతిపాదించబడాలి. ఆ సభలో ఆమోదించబడిన అనంతరం అది రాష్ట్రాల కౌన్సిలుకు పంపబడుతుంది. 14 రోజులలోగా వారు బిల్లును తిప్పి పంపుతూ తమ సూచనలనుకూడా ప్రతినిధి సభకు అందజేస్తారు. ఆ సూచనలలో ఒక్కటికూడా ప్రతినిధుల సభకు ఆమోదం కాకపోయినా బిల్లును ఉభయశాసనసభలు ఆమోదించినట్లే భావించబడుతుంది.

## న్యాయశాఖ

అమెరికాలోవలె ఇండియాలో రెండు న్యాయశాఖలు లేవు. ఇక్కడి న్యాయస్థానాలన్నీ ఒకేశాఖలోనివై ఉండి వీటన్నిటికీ తలగా సుప్రీంకోర్టు ఉంటుంది. సుప్రీంకోర్టుకింద వివిధ రాష్ట్రాలలో హైకోర్టులుంటవి. హైకోర్టుకింద సబార్డినేటుకోర్టులుంటవి. సుప్రీముకోర్టు న్యాయమూర్తులందరూ అధ్యక్షునిచేత నియమించబడి 65 ఏళ్ళు నిండేవరకూ పదవులు నిర్వహిస్తారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తి అయేవాడు ఇండియా పౌరుడై ఉండాలి, హైకోర్టు న్యాయమూర్తిగా అయిదేళ్ళుగాని, అడ్వొకేటుగా పదేళ్ళుగాని పనిచేసి ఉండాలి. ప్రఖ్యాత న్యాయవేత్తనుకూడా అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించవచ్చును. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని పదవిలోనుంచి తొలగించటానికిముందుగా, అతను అక్రమంచేశాడనిగాని అశక్తుడనిగాని నిర్ణయిస్తూ ఉభయ శాసనసభలలోని అధికసంఖ్యాక సభ్యులు (హాజరైనవారిలో మూడింట రెండువంతులు) వోటుచేసి అధ్యక్షునికి నివేదించాలి. అనంతరం అధ్యక్షుడు న్యాయమూర్తిని తొలగిస్తూ ఉత్తరువు చేయాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతాలు రాజ్యాంగంలోనే సూచించబడినవి. విరామం తీసుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి తిరిగి ఏ న్యాయస్థానంలోనూ ప్రాక్టీసు చేయరాదు.

ఈ విధంగా ఉన్నత న్యాయమూర్తుల స్వాతంత్ర్యం కాపాడబడుతున్నది.



శ్రీ కె. యమ్. మున్షీ



శ్రీ యస్. మాధవరావు

## సుప్రీంకోర్టు అధికారాలు

ఇండియాలోని సుప్రీంకోర్టుకు ఏదేశంలోని ఉన్నత న్యాయస్థానానికీ లేని అధికారాలున్నవి. అమెరికాలోని సుప్రీముకోర్టుకూడా అన్ని అప్పీళ్ళు విచారించదు. యూనియను ప్రభుత్వానికీ రాష్ట్రప్రభుత్వానికీ మధ్యగాని, కేవలం రాష్ట్రప్రభుత్వాలమధ్యగాని జరిగే వివాదాలను సుప్రీంకోర్టుమాత్రమే విచారిస్తుంది. రాజ్యాంగ విషయకమైన వ్యాఖ్యానాల తభావతు గురించి హైకోర్టులిచ్చే తీర్పులపై చేయుబడే అప్పీళ్ళను సుప్రీంకోర్టు విచారిస్తుంది. సివిలు వ్యవహారాలను అదివరకు ప్రీవీకౌన్సిలు విచారించినట్లే ఇప్పుడు సుప్రీంకోర్టు విచారిస్తుంది. కొన్నిరకాల క్రిమినలు కేసులను గురించి హైకోర్టుతీర్పులపై సుప్రీంకోర్టులో అప్పీళ్ళు చేసుకోవచ్చు. రాజ్యాంగంలో ఉదహరించబడిన ప్రాథమికహక్కులను అమలుజరపే విషయంలో సుప్రీంకోర్టుకు ప్రత్యేకాధికారాలివ్వబడినవి.

## హైకోర్టులు

సుప్రీంకోర్టు పంపిణీమీదనే హైకోర్టులుకూడా ఉంటవి. వాటి న్యాయమూర్తులు కూడా అధ్యక్షునిచే నియోగించబడతారు. కాని వారు 60 ఏళ్ళు నిండగానే విరమించాలి.

వాటి అధికారాలు పూర్వంలాగే ఉంచబడిగాని కొన్ని నిర్బంధాలు పూర్వం ఉండినవి ఇకముందుండవు. రివిన్యూ వ్యవహారాలపై హైకోర్టుకు అధికారం ఉండరాదనే నిబంధనపోయింది. హైకోర్టులు తమ జూరిస్డిక్షనుకిందఉన్న ప్రాంతంలోని ఇతర కోర్టులనేకాక, కోర్టులకిందికిరాని న్యాయస్థానాలనుకూడా పర్యవేక్షించవచ్చు.

## రాష్ట్రాలు

మొదటి షెడ్యూలులోని మొదటి రెండుతరగతులకింద ఉపహరించబడిన రాష్ట్రాల (గవర్నరు రాష్ట్రాల, సంస్థానాల) ప్రభుత్వ వ్యవస్థాపన కేంద్రాన్ని అనుకరిస్తుంది. మొదటితరగతి రాష్ట్రాల ఉన్నత పాలనాధికారులైన గవర్నర్లను అధ్యక్షుడు నియమిస్తాడు; రెండవతరగతివాటికి ఉన్నత పాలనాధికారులైన రాజప్రముఖులను అధ్యక్షుడు గుర్తిస్తాడు. గవర్నర్లు 5 ఏళ్ళపాటు పదవిలో ఉంటారు. రాష్ట్రాలలోకూడా పార్లమెంటువిధానం ఉంటుంది. రాజప్రముఖుడు ప్రజాప్రతినిధులైన మంత్రుల సలహాతో వ్యవహరిస్తాడు.

ప్రతిరాష్ట్రంలోనూ గవర్నరుతోగాని రాజప్రముఖునితోగాని కూడిన శాసనసభ ఉంటుంది. కొన్నింటిలో ఎగువదిగువశాసనసభలు (లెజిస్లేటివుకౌన్సిలు, ఎసెంబ్లీలు) ఉంటవి. మరికొన్నింటిలో ఎసెంబ్లీమాత్రమే ఉంటుంది. ఉన్నచోట కౌన్సిళ్ళను రద్దుచేయడానికిగాని, లేనిచోట సృష్టించడానికిగాని పార్లమెంటుకు అధికారం ఉన్నది.

ఎసెంబ్లీ (దిగువ శాసనసభ)లో ప్రజలు సయోజనవోటుతో ఎన్నుకొనే ప్రతినిధులుంటారు. 75 వేల ప్రజలకు ఒకడికంటె హెచ్చుప్రతినిధు లుండరాదు. శాసనసభలో 500 కు మించిగాని 60 కి తగ్గిగాని సభ్యులుండరాదు. శాసనసభలు 5 ఏళ్ళపాటు అమలులో ఉంటవి. ఎసెంబ్లీలోని సభ్యులసంఖ్యలో నాలుగవవంతు మించి కౌన్సిలులో సభ్యులుండరాదు. 40 మందికి తక్కువగల సభ్యులుకూడా కౌన్సిలులో ఉండరాదు. కౌన్సిలు సభ్యులలో సగంమందిని స్థానికపరిపాలనలవారూ, విశ్వవిద్యాలయపట్టభద్రులూ ఎన్నుకొంటారు. మూడోవంతుమందిని ఎసెంబ్లీసభ్యులు తమలో లేనివారినుంచి ఎన్నుకొంటారు. మిగిలినవారిని గవర్నరు నియోగిస్తాడు. ఈవిధంగా నియోగించబడేవారికి ప్రత్యేకార్హత లుంటవి. ఈ ఏర్పాటును శాసనంద్వారా మార్పుచేసే అధికారం పార్లమెంటుకు కలదు. రాష్ట్రాల కౌన్సిలులోలాగే లెజిస్లేటివు కౌన్సిళ్ళలోకూడా రెండేళ్ళ కొకసారి సభ్యులలో మూడోవంతు సంఖ్యగలవారు విరమిస్తూఉంటారుగాని కౌన్సిలు ఒక్కసారిగా రద్దుకాదు.

కేంద్రంలోలాగ రాష్ట్రాలలో ఉభయశాసనసభల సంయుక్తసమావేశం జరుగదు. ఏ బిల్లునుగురించిగాని రెండుసభలకు వ్యత్యాసం ఏర్పడితే, దిగువశాసనసభ రెండవసారి బిల్లును ఆమోదించిన కొన్ని పరిస్థితులలో బిల్లు చట్టమవుతుంది.

## నిమ్నజాతుల రక్షణ

వెనుకబడిన ప్రాంతాలనూ, ఆటవిక ప్రదేశాలనూ పరిపాలించటం విషయమై కొన్ని ఏర్పాట్లున్నవి. ఈ ఏర్పాట్లు 5, 6 షెడ్యూళ్ళలో ఉదహరించబడినవి. ఈ ప్రాంతాల పరిపాలనలో అక్కడ్డి ప్రజలకు సన్నిహిత సంబంధం ఉంటుంది.

కేంద్రరాష్ట్ర ప్రజాప్రతినిధుల సభలలో నిమ్నజాతులకు జనాభానుబట్టి ప్రత్యేక స్థానాలు పదేళ్ళదాకా ఇవ్వబడతవి. నిమ్నజాతులకూ, ఆంగ్లో ఇండియనులకూ ఇవ్వబడిన ప్రత్యేక రక్షణలు ఏవిధంగా పనిచేస్తున్నదీ తణిఖీచేసి నివేదించటానికి అధ్యక్షు డొక ప్రత్యేకాధికారిని నియమిస్తాడు. ఈ నివేదికలను అధ్యక్షుడు ఉభయ శాసనసభల ఎదుట ఉంచుతాడు. 10 ఏళ్ళ గడువు తీరినప్పుడుగాని ఈలోగాగాని, వెనుకబడిన ప్రాంతాల పరిపాలన ఏవిధంగా అభివృద్ధిపొందినదీ తెలుసుకొనటానికి కమిషనును నియమిస్తాడు. కమిషనువారి నివేదికపైనా, సిఫార్సులపైనా ఎట్టిచర్య గైకొన్నదీ పార్లమెంటుకు తెలియజేస్తాడు.

## యూనియనుకూ రాష్ట్రాలకూ సంబంధం

రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులో మూడుజాబితా లున్నవి. ఒక జాబితాలో యూనియనుప్రభుత్వం శాసనాలు చేయదగిన విషయాలూ, రెండవ జాబితాలో రాష్ట్రప్రభుత్వాలు శాసనాలు చేయదగిన విషయాలూ, మూడవ జాబితాలో ఉభయత్రా శాసనాలు చేయదగిన విషయాలూ ఉన్నవి.

యూనియను లిస్టులో రక్షణ, అణుశక్తి, విదేశవ్యవహారాలు, రైల్వేలు, విమానాలు, తపాలాతంతి, బాంకింగుభీమాలు మొదలైన 97 విషయా లున్నవి. రాష్ట్రాలలిస్టులో 66 విషయాలూ, ఉమ్మడిలిస్టులో 47 విషయాలూ ఉన్నవి. అదనపు అధికారాలు, అనగా రాష్ట్రాలలిస్టులోగాని ఉమ్మడి లిస్టులోగాని లేని విషయాలు, కేంద్రానివి.

ప్రత్యేక పరిస్థితి ఏర్పడినట్లు యూనియను పార్లమెంటులోని సభ్యులలో మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదిస్తే రాష్ట్రాల లిస్టులోని అంశాలపై కేంద్రం శాసనాలు చేయవచ్చు. ఆ విధంగానే, దేశానికిగాని దేశంలో ఒక భాగానికిగాని ఎట్టి కారణంచేతనైనా ప్రమాదపరిస్థితి సంభవించిందని అధ్యక్షు ప్రకటన జరిగినా రాష్ట్రవిషయాలపై కేంద్రం శాసనాలు చేయవచ్చు. రెండు మూడు రాష్ట్రాలు ప్రత్యేక తీర్మానాలద్వారా కేంద్రానికి అధికారంఇస్తే ఆ



2

రాష్ట్రాల కన్నిటికీ కలిపి కేంద్రం శాసనం చేయవచ్చు. ఒడంబడికలనుగాని అంత ర్జాతీయ నిబంధనలనుగాని అమలుజరిపే విషయంలోకూడా రాష్ట్రాల లిస్టులోని విషయాలపై కేంద్రం శాసనం చేయవచ్చు.

రాష్ట్రానికీ కేంద్రానికీకూడా శాసనాధికారంగల విషయాలలో దేనిపైనగాని ఉభయప్రభుత్వాలూ చేసిన శాసనాలు పరస్పర విరుద్ధంగా ఉంటే పార్లమెంటు శాసనం నిలుస్తుంది. కాని అట్టి రాష్ట్రశాసనాన్ని అధ్యక్షుడు ఆమోదించే యెడల ఆ రాష్ట్రంలో అదే అమలుజరుగుతుంది.

ఏయేవిషయాలపై శాసనాలుచేసే అధికారం యూనియనుకూ రాష్ట్రాలకూ ఉన్నదో ఆయా విషయాలు సంబంధించినంతవరకు యూనియనుకూ రాష్ట్రానికీ పాలనాధికారంకూడా ఉంటుంది. కాని రెంటికీ శాసనాధికారంగల విషయాలలో సాధారణంగా పాలనాధికారం యూనియనుకుండదు.

## ద్ర వ్యం

కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ కూడా రెండురకాల ద్రవ్యనిధులుంటాయి. ఒకటి స్థావరనిధి—రివిన్యూ యావత్తూ ఇందులోకి చేర్చబడుతుంది. రెండవది అవసరనిధి. స్థావరనిధినుంచి చేసే ఖర్చులన్నిటికీ శాసనసభలు చట్టరూపమైన అనుమతి నివ్వాలి. ఈ అనుమతి రాకపూర్వం చేసే అనుకోని ఖర్చులు అనవసర నిధినుండి చేయవచ్చు.

కేంద్రరాష్ట్రాల మధ్య ద్రవ్యం కేటాయింపు ఇంచుమించు 1935 చట్టం కింద లాగే ఉంటుంది. అయితే కొన్ని తరగతుల పన్నులద్వారా లభించే నికరా దాయం కేంద్రరాష్ట్రాలమధ్య ఏ విధంగా కేటాయించబడాలనే దాన్ని గురించీ, రాష్ట్రాలకు జరగవలసిన గ్రాంటులు ఏసూత్రాలను అనుసరించాలన్న దాన్ని గురించీ రాజ్యాంగంద్వారా కమిషను నియమించబడి శిఫార్సులు చేస్తుంది.

యూనియను, రాష్ట్రాల ఎకౌంట్లు తణిఖీచెయ్యటానికిగాను అధ్యక్షుడు ఆడిటరు జనరలును నియమిస్తాడు. ఈ అధికారి స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినవి. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూగల శాసనసభలు అను మతించిన ఖర్చులకు మించి వ్యయం కాకుండా ఈయన చూస్తాడు.

రాష్ట్రాలన్నిటిమధ్యా స్వేచ్ఛా వాణిజ్యం సాగుతుంది. కాని దేశ క్షేమంకొరకు దీనిపై నిర్బంధాలు ఏర్పరచే అధికారం కేంద్రరాష్ట్ర శాసనసభలకున్నది.

## దే శ భా ష

యూనియనులోని రాజభాష హిందీ. రాష్ట్రాలు తమ సరిహద్దులోగల ఏ భాషను గాని, హిందీనిగాని పాలనార్థం వినియోగించవచ్చు. 15 ఏళ్ళ పాటు ఇంగ్లీషు అమలులో ఉంటుంది.

## అదనపు అధికారాలు

దేశమంతటాగాని, ఒక ప్రాంతంలోగాని తీవ్రపరిస్థితి కలదని అధ్యక్షుడుచేసే ప్రకటనను ఉభయ పార్లమెంటు సభలూ ప్రకటన జరిగిన 2 నెలలలోగా ఆమోదించాలి. లేకపోతే రెండు నెలల అనంతరం ఆ ప్రకటన చెల్లదు.


రాష్ట్రాలకు పైనుంచి ప్రమాదంరాకుండానూ, రాష్ట్రపరిపాలన రాజ్యాంగానికి బద్ధమై జరిగేటట్లూ చూసే బాధ్యత యూనియనుది. రాష్ట్ర గవర్నరుద్వారాగాని, రాజప్రముఖునిద్వారాగాని, ఇతరత్రాగాని అధ్యక్షుడు ఆ రాష్ట్రంలోని పరిస్థితి విషమించిందని విని అక్కడ రాజ్యాంగానికి అనుకూలంగా పరిపాలన సాగదని విశ్వసించినట్టయితే, రాష్ట్రప్రభుత్వాధికారాలు అన్నీగాని కొన్నీగాని తానే స్వయంగా అమలుచేస్తానని ప్రకటించి, ఆ రాష్ట్రశాసనసభ పార్లమెంటుకు లోబడి ఉండేటట్లు చేయవచ్చు. కాని ఆ రాష్ట్రపు హైకోర్టు అధికారాలుమాత్రం అధ్యక్షుడు తనవశం చేసుకోరాదు.

అధ్యక్షుడు చేసే ఈ ప్రకటనను పార్లమెంటు 2 నెలలోగా ఆమోదించాలి. అప్పటికీ దాని గడువు ఆరుమాసాలు. ఇంకా గడువు పెంచాలంటే పార్లమెంటు మళ్లీ ఆమోదించాలి. ఎట్టి పరిస్థితిలోగాని దాని గడువు 3 ఏళ్లకు మించదు.

## రాజ్యాంగం సవరణలు

ఇతర రాజ్యాంగాలను మార్చటంకన్న మనరాజ్యాంగాన్ని మార్చటం చాలా సులభం. సుప్రీం కోర్టు, హైకోర్టులు, శాసనాధికారాలకు చెందిన జాబితాలు, పార్లమెంటులో రాష్ట్రాలప్రాతినిధ్యం మొదలైనవాటిలో మార్పులు జరగాలన్నప్పుడుమాత్రం ఆ మార్పులను యూనియనులోని శాసనసభలలో సగం అయినా ఆమోదించాలి. మిగిలిన అన్నివిషయాలనూ పార్లమెంటు శాసనాలద్వారా మార్చవచ్చు.

భారతరాజ్యాంగంలోని ప్రధానాంశాలే పైన పేర్కొనబడినవి. రాజ్యాంగ రచయితలు అనేకదేశాల రాజ్యాంగాల అనుభవాన్ని ఈ రచనలో వినియోగించారు. ఈ రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది వేయటమేకాక, సరిగా అమలు జరిగితే దేశంయొక్క అభివృద్ధికీ, ప్రజల యోగక్షేమాలకూ అనుకూలించగలదు.



# మీకు తెలుసా?

| | |
|---|---|
| రాజ్యాంగ పరిషత్తు సభ్యులసంఖ్య | 308 |
| తొలి సమావేశం జరిగిన తేదీ | 1946 డిసెంబరు 9 |
| ఆఖరి సమావేశం జరిగిన తేదీ | 1949 నవంబరు 26 |
| రాజ్యాంగ రచనాకాలం | 2 ఏళ్లు 11 నెలల 18 రోజులు |
| రాజ్యాంగపరిషత్సమావేశాల సంఖ్య | 11 |
| సమావేశాల్కు తిలకించవచ్చినవారి సంఖ్య | 53,000 |
| రాజ్యాంగపరిషత్తుకింద అయినే ఖర్చు | రు. 6,396,729 లు |
| రాజ్యాంగసలహాదారు రచించిన ముసాయిదాలోని | |
| అంశాల సంఖ్య | 243 |
| షెడ్యూళ్ల సంఖ్య | 13 |
| రచనాసంఘంవారు రాజ్యాంగపరిషత్తుకు నివేదించిన ముసాయిదాలోని | |
| అంశాల సంఖ్య | 315 |
| షెడ్యూళ్ల సంఖ్య | 8 |
| ముసాయిదా రాజ్యాంగానికి | |
| నోటీసిచ్చిన సవరణల సంఖ్య | 7,635 (సుమారు) |
| ప్రతిపాదించిన సవరణల సంఖ్య | 2,473 |
| ఆమోదించబడిన రాజ్యాంగంలోని | |
| అంశాల సంఖ్య | 395 |
| షెడ్యూళ్ల సంఖ్య | 8 |

## వివిధదేశాలలో రాజ్యాంగ రచన

| దేశం | రాజ్యాంగంలోని అంశాలు | రచనాకాలం |
|---|---|---|
| అమెరికా | 7 అంశాలు | 4 నెలలు |
| కెనడా | 147 ,, | 2 ఏళ్లు 5 నెలలు |
| ఆస్ట్రేలియా | 128 ,, | 9 ఏళ్లు |
| దక్షిణాఫ్రికా | 153 ,, | 1 ఏడు |
| ఇండియా | 395 ,, | 2 ఏళ్లు 11 నెలల 18 రోజులు |

# బాపూజీ ఆశయాలు — నవభారతం

"పరదాస్యంతో నిద్రాణమైనవున్న భారతజాతిని జాగరితంచేసి, స్వాతంత్ర్య దీప్తిని వెలయించిన జాతిపిత గాంధీజీ సిద్ధాంతాలకు నవభరత రాజ్యాంగం అనుగుణంగా కలదా?"

ఈప్రశ్నకు సమాధానం ఆలోచించుకోడానికిపూర్వం రాజ్యాంగమంటే ఏమిటో తెలుసుకోవటం అవసరం. ఒక దేశం ఏయేప్రధానసూత్రాలపై పరిపాలించబడగలదో అదే రాజ్యాంగం. ప్రభుత్వ పరిపాలనా నిర్వహణకు అంగాలయిన శాసనసభలు, కార్యనిర్వహణాధికారశాఖ, న్యాయనిర్వహణాధికార శాఖలు ఏయే ప్రాతిపదికలపై ఆధారపడి తమ విధ్యుక్తధర్మాలను నిర్వహించాలోకూడా రాజ్యాంగంలో ఉంటుంది.

అంతేకాని, రాజకీయ సిద్ధాంతాలే రాజ్యాంగంకాదు. కాని, రాజ్యాంగంలోని సూక్తులు కొన్నిగాని లేదా అన్నిగాని ఆ రాజకీయసిద్ధాంతాలకు అనుగుణంగా వుండవచ్చు—వుండగలవు కూడా.

ఈ దృక్పధంతో పరిశీలించినపుడు, నవభారత రాజ్యాంగాంలో గాంధీజీ సిద్ధాంతాలు మళ్ళీ యథాతథంగా చేర్చబడినవని చెప్పవచ్చు. గాంధితత్వం, గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలకు అనుగుణంగానే నవభారత రాజ్యాంగంకలదు.

పతితభారత జాత్యుద్ధరణకై తన జీవితపర్యంతం గాంధీజీ సూచించిన కార్యక్రమంలో ముఖ్యమైనవి మూడుసూత్రాలు. అవి—1. ఖద్దరు, 2. అస్పృశ్యతా నిర్మూలనం, 3. హిందూ-ముస్లిం సమైక్యత. నవభారత రాజ్యాంగంలో ఈ మూడుసూత్రాలకు ప్రధానస్థానమివ్వబడినదనడం నిర్వివాదాంశం.

ప్రభుత్వం అనుసరించదగు విధానాలకు ప్రాతిపదికలుగా పేర్కొనబడిన సూత్రాలలో ఒకదానిలో (435 సూత్రం) వ్యక్తులు విడివిడిగాను, సహకార విధానంపై సమష్టిగాను కుటీరపరిశ్రమలపట్ల ఆసక్తికలిగి వాటిని అభివృద్ధిపరిచే విధంగా వారికి ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలని స్పష్టంగా పేర్కొనబడింది.

అస్పృశ్యతకూడా పూర్తిగా నిర్మూలించబడింది. నవభారతంలో అస్పృశ్యతా పరిగణన చట్టవిరుద్ధంగా పేర్కొనబడింది. ప్రాధమిక హక్కులకు సంబంధించిన

17వ సూత్రంలో అస్పృశ్యతను పాటించడం ద్రోహకరమని, అలాచేసేవారు న్యాయశాస్త్రంప్రకారం శిక్షించబడవచ్చునని కూడా పేర్కొనబడింది. కాన, ఇంత వరకు అస్పృశ్యులుగా పరిగణించబడుతున్న కోటానుకోట్ల భారతీయులకు నవ భారతరాజ్యాంగం స్వాతంత్ర్యప్రదాయి కాగలదు.

సమష్టి వియోజకవర్గాలద్వారా మాత్రమే ఎన్నికలు జరగాలని విధించడం ద్వారా హిందూ-ముస్లిం సమైక్యతకు ప్రాతిపదికను నవభారత రాజ్యాంగం రూపొందించగలిగింది.

## గాంధీజీ కలలుకన్న నవభారత స్వరూపం

గాంధీజీ లక్ష్యాలను, గాంధితత్వాన్ని వ్యాఖ్యానించబూనడం హాస్యాస్పదం. తన నిర్మాణకార్యక్రమంలో అతిముఖ్యమైనవిగా ఆయన పేర్కొంటూ వచ్చిన ప్రధాన సూత్రాలు మూడూమాత్రమేగాక, ఇంకా అనేక లక్ష్యాలనుకూడా సాధించాలని ఆయన ఆశించాడు.

భారతదేశాన్ని, భారతజాతిని సత్య, అహింసా సూత్రాలపై పునరుజ్జీవింప చేయడానికి ఆయన సంకల్పించాడు.

గాంధీజీ రూపొందించదలచిన నవభారతస్వరూపం ఆయన మాటలలోనేయిది :-

* "కలవారు లేనివారు అనే వ్యత్యాసంలేకుండా, సమస్త ప్రజాకోటి ఒకే తరగతిగ, వివిధ మతవర్గాలవారు ఏకోదరులవలె సమైక్యంగా మెలగుతూ, నిరుపేద సయితం ఇది తన మాతృదేశంకావడం తన మహద్భాగ్యమని భావించుతూ, దాని పురోభివృద్ధికై అనవరతం కృషిచేస్తూ ఉండగలదేశం; అస్పృశ్యతకు, మద్యపానీయాలకు ఆస్కారంలేనిదేశం; పురుషులు, స్త్రీలు సమానంగా సకల హక్కులను అనుభవిస్తూఉండగలదేశం—ఇదే నేను కలలుకంటున్న భారతదేశం."

గాంధీజీ అమలుజరిపిన కార్యక్రమాన్ని వ్యాఖ్యానించి చూచినట్లయితే ఆయనకు ఈకింది ఆశయాలుకూడా కలవని చెప్పవచ్చు.

"అన్ని మతవర్గాలకు సమానంగా హక్కులు వుండడమేగాక జాతి, మత, కులవిభేదాలు అంతరించడం; అన్నిజాతుల సంస్కృతులకు సంపూర్ణస్వేచ్ఛ సిద్ధించడం."

* పండిట్ నెహ్రూ రచించిన "భారతస్వరూప సందర్శనం" నుంచి ఉదహరించబడిన వాక్యాలు.

నవభారత రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలకు సంబంధించిన అధ్యాయాన్ని ఒక్కసారి పరిశీలిస్తే ఈలక్ష్యసిద్ధికి అది అనుగుణంగావున్నట్టు విశదంకాగలదు.

మతరీత్యా మైనారిటీలుకాగల వర్గాలను గుర్తించడం, వారికి రక్షణలు రాజ్యాంగంలో కల్పించడం సంభవించలేదు. కాని, ప్రాథమిక సూత్రాలలోని 25 వ సూత్రంలో ప్రతి పౌరునికి మతస్వాతంత్ర్యం చేకూర్చబడింది, అంతేకాదు; అదే అధ్యాయంలోని 29, 30 సూత్రాలద్వారా ప్రతి మైనారిటీవర్గం తన సంస్కృతిని రక్షించుకోడానికి, తనకు కావలసిన విద్యాసౌకర్యాలను పొందడానికికూడా అవకాశంకలిగించబడింది.

ఇండియన్ రిపబ్లిక్ ప్రభుత్వం మతప్రమేయంలేనిదే—మతంతో ఎంతమాత్రం సంబంధ లేనిదే—అయితే, జాతి, మత, వర్గ, వర్ణ విభేదాలులేకుండా పౌరుడైన ప్రతివ్యక్తికి రక్షణకల్పించే బాధ్యత ప్రభుత్వానికి కలదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనబడింది.

## కిసాన్-మజ్దూర్ రాజ్యం

దోపిడికి అవకాశంలేకుండా నిరాటంకంగా, స్వేచ్ఛగా రైతులు, కార్మికులు పురోభివృద్ధిగాంచగల కిసాన్-మజ్దూర్ రాజ్యసంస్థాపనమే గాంధీజీ ఆశయం.

ఇరవై ఒక్క సంవత్సరాలునిండిన ప్రతి పురుషునికి, ప్రతి స్త్రీకి నవ రాజ్యాంగంలో ఓటింగ్ అధికారం ప్రసాదించబడింది. గాంధీజీ కనిన కలలు ఫలించినవడానికి ఇదివక్కటే నిదర్శనం.

ప్రభుత్వవిధానం ప్రాతిపదికలకు సంబంధించిన అధ్యాయంలోని 39వ సూత్రంలో స్త్రీ పురుష విభేదంలేకండా ప్రతివ్యక్తికి జీవనోపాధి కలిగించడం ప్రభుత్వకర్తవ్యమని వివరించబడింది. దేశంలోగల సాధనసంపత్తులపై కంట్రోలుగాని, యాజమాన్యంగాని సకల ప్రజలకు లాభదాయకంగా ఉండాలని, ధనం కేంద్రీకృతం కాకండాను, పరిశ్రమలు ప్రజాకోటికి అరిష్టదాయకంగాకండాను ఆర్థికవిధానం వుండాలనికూడా స్పష్టపరుపబడింది. స్త్రీలకు పురుషులకు సమానంగా వేతనాలు ఉండాలని, స్త్రీ పురుష విభేదంలేకండా కార్మికులందరికి ఆరోగ్యరక్షణకు సదుపాయాలు కలిగించడమేగాకండా పరిస్థితుల ప్రాబల్యంవల్ల తమశక్తికి, వయస్సుకుమించిన పనులను నిర్వహించవలసిన అవసరం ప్రజలకురాకండా చూడాలని, బాలబాలికలకు రక్షణ కల్పించాలని, ముక్కుపచ్చలారకముందే తిండి కోసం తడుముకుంటూ తమజీవితాన్నంతా వ్యర్థంచేసుకొనగల పరిస్థితికి వారు రాకండా తప్పించాలనికూడా స్పష్టపరచబడింది.

జీవనభృతి, విద్యాసౌకర్యాలు, నిరుద్యోగదశలో ఆర్థిక సహాయం, వృద్ధాప్యంలో పింఛను, వ్యాధిగ్రస్థుడైనపుడు, అంగవైకల్యం ప్రాప్తించినపుడు పరిహారం మున్నగువాటికి హక్కులు, కార్మికులకు ఉండాలని, వారి సంతానానికి ఉచితంగా వైద్య, విద్యా సౌకర్యాలు వుండాలని, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు ఉండాలని నవ భారతరాజ్యాంగంలోని అనేక క్లాజులలో పేర్కొనబడింది.

## వెనుకబడిన తరగతులకు రక్షణ

వెనుకబడిన తరగతులవారికి విజ్ఞానం కలిగించడానికి ప్రత్యేక విద్యాసౌకర్యాలు మాత్రమేగాక వారి ఆర్థికస్థితిని చక్కబరచడానికి శ్రద్ధవహించడం ప్రభుత్వ బాధ్యతగా విధించబడింది. సంఘంలో వారికి ఎలాంటి అపచారం, అన్యాయం జరగకుండా వారిని రక్షించవలసిన బాధ్యతకూడా ప్రభుత్వానిదే. వారు సత్వరమే పురోభివృద్ధి గాంచడానికి దోహదమివ్వగల విధంగా ప్రత్యేకంగా 330 నుంచి 342 వరకునున్న సూత్రాలుకూడా పొందుపరుపబడినవి.

నిజానికి నవభారతరాజ్యాంగం ఉపోద్ఘాతంలోనే సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రజలందరికి సమంగా న్యాయం, మత, భావ, వాక్ సభస్వాతంత్ర్యాలు సమానావకాశాలు చేకూర్చడం రాజ్యాంగ లక్ష్యంగా వివరించబడింది.

రాజ్యాంగంలోని 38 వ సూత్రంలో జాతీయజీవనంలోని సకలరంగాలలోను ప్రజలందరికి సమానావకాశాలు, సమానాధికారాలు చేకూర్చి, ప్రజాభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేయాలని పేర్కొనబడింది.

## మద్యనిషేధం

నిరుపేదలపాలిటి పిశాచమైన మద్యపానాన్ని సాధ్యమైనంత త్వరితంగా నిషేధించాలని గాంధీజీ ఆశించినమాట వాస్తవం.

వైద్యంకోసం తప్ప, ఆరోగ్యానికి భంగకరంకాగల మద్యపానాలను, తదితర మత్తుపదార్థాలవాడకాన్ని సాధ్యమైనంత త్వరితంగా నిషేధించడం ప్రభుత్వ కర్తవ్యంగా రాజ్యాంగంలో పేర్కొనబడింది.

## గ్రామ పంచాయతీలు

భారతదేశానికి గ్రామమే పునాదియని, గ్రామసీమల అభివృద్ధికి పంచాయతీ విధానమే పరమోత్తమమైన మార్గమని గాంధీజీ భావించాడు.

గ్రామపంచాయితీలను స్థాపించి, స్థానిక స్వపరిపాలనాధికారంతో అవి సర్వ స్వతంత్రంగా వ్యవహరించడానికి తగు అధికారం వాటికివ్వడం ప్రభుత్వ ధర్మంగా శాసించబడింది.

## గోసంరక్షణ

గ్రామసీమలు అభివృద్ధిపొందనిదే, దేశంమొత్తం అభివృద్ధిపొందదనే భావం కలవాడు గాబట్టి పశుసంరక్షణావశ్యకతను గ్రహించి, అందునుగురించి గాంధీజీ విశేషంగా ప్రచారంచేశాడు.

వ్యవసాయానికి పనికివచ్చే దుక్కిటెద్దులను మాత్రమేగాకండా తదితర పశుసంతతినికూడా, ఆధునాతనమైన శాస్త్రీయపద్ధతులపై అభివృద్ధిపరచడానికి, గోవులను, మానవునికి ఉపకరించే తదితర పశువులను వధించడాన్ని నిషేధించడానికి వెంటనే తగు చర్యలు గైకొనవలసిన బాధ్యత రాజ్యాంగంలో ప్రభుత్వానికి అప్పగించబడింది.

## జాతీయభాష

ఇంగ్లీషుకు ప్రత్యామ్నాయంగా, దేశంమొత్తానికి సంబంధించిన అన్ని వ్యవహారాలలోను హిందీని (లేదా హిందూస్థానీని) వాడాలని గాంధీజీ ప్రబోధించాడు. అయితే, ప్రాంతీయభాషలుకూడా హిందీతోసమానమైనవని, వాటికి కూడా సమానప్రాధాన్యంకలదని ఆయన భావించాడు. అందుచేతనే, అనేక ప్రాంతీయ భాషలను ఆయన స్వయంగా అభ్యసించాడుకూడా. కాని, ఏభాషపైన— తుదకు ఇంగ్లీషుపట్లకూడా—ఆయనకు ద్వేషభావంలేదు. హిందీభాష దేవనాగరి, ఉర్దూ లిపులు రెండింటిలోను విశేష ప్రచారం కలిగివున్నది కనుక ఆరెండు లిపుల లోను హిందీని ప్రతివ్యక్తి అభ్యసించాలని ఆయన గట్టిగానే చెబుతూవుండేవారే గాని, దేశవిభజనతో ఆ వాదనకు కొంత బలం తగ్గిందనే చెప్పాలి.

తన అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా ఇతరుల అభిప్రాయాలను ఓర్మితో పాటించడం మహాత్ముని విశిష్టత. సరిగా ఈ పద్ధతిపైనే ఇండియన్ రిపబ్లిక్ జాతీయ భాషాసమస్యపై నిర్ణయం జరిగింది.

ఇండియన్ రిపబ్లిక్ రాజ్యభాష దేవనాగరికలిపి బద్ధమైన హిందీయేనని రాజ్యాంగంలో పేర్కొనబడింది. అయితే యుగసంధిలో—15 సంవత్సరాల వరకు—ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఇంగ్లీషులోనే నిర్వహించబడాలనికూడా నిర్ణయించబడింది.

ప్రభుత్వ వ్యవహారాలలో క్రమేపీ హిందీభాషకాన్ని ప్రవేశపెట్టి, దానిని పూర్తిగా అభివృద్ధిపరచే నిమిత్తమై ప్రెసిడెంట్‌కు సలహానిచ్చేందుకుగాను 1955 సంవత్సరంలో ఒక కమిషన్ నియమించబడాలనికూడా ఆదేశించబడింది.

ఇదేవిధంగా ఇండియన్ రిపబ్లిక్‌లోని రాష్ట్రాలుకూడా (రాష్ట్ర సంస్థానాలు కూడా రాష్ట్రాలతో పరిగణించబడగలవు) తమ ప్రాంతీయభాషనుగాని లేదా హిందీనిగాని రాజభాషగా చేసుకోవలెనని విధించబడింది. అయితే రాష్ట్రాలమధ్య నడిచే వ్యవహారాలన్నీ రిపబ్లిక్ రాజభాషయైన హిందీలో మాత్రమే నడవాలని కూడా షరతు పెట్టబడింది.

## ప్రపంచ శాంతి

అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి యుద్ధం సాధనంకాదని గాంధీజీ దృఢ విశ్వాసం. ఇందుకు సాధనంగా యుద్ధాన్ని వినియోగించడాన్ని విషేధించాలని కూడా ఆయన అభిమతం. అహింసా రాధకుడు కనుక, సత్యాగ్రహాయుధ నిర్మాత కనుక, హింసను ఏరూపంలోనైనా ఆయన సహించలేదు. అది వ్యక్తులమధ్య పొసగినా, దేశాలమధ్య పొసగినా హింసను ఆయన నిరసించే వాడేగాని ఎన్నడూ సహించలేదు. కాగా అంతర్జాతీయ శాంతికి అర్రులు చాచినవారిలో ఈ యుగంలో గాంధీజీని మించిన వ్యక్తిలేడు.

భారతజాతిపిత ప్రబోధాల సారాన్ని గ్రహించిన ఆయన శిష్యులు కనుక నవ భారత రాజ్యాంగ నిర్మాతలుకూడా అంతర్జాతీయ శాంతిపట్ల నవభారతం ఔత్సుకతను విస్పష్టంగా వివరించారు.

అంతర్జాతీయ శాంతిభద్రతల సంరక్షణ కేమి వివిధరాజ్యాలమధ్య ధర్మమైన గౌరవప్రదమైన సంబంధాలను నెలకొల్పడానికేమి కృషిచేయడం, అంతర్జాతీయ న్యాయసూత్రాలను పాటించడం, వివిధ రాజ్యాలతో జరిగిన ఒడంబడికలను పాటించడం, అన్యరాజ్యాలతో వివాదగ్రస్తంగా పరిణమించిన సమస్యలను మధ్యస్థులద్వారా పరిష్కరించుకొనడం ఇండియన్ రిపబ్లిక్ ప్రభుత్వం విధ్యుక్తధర్మాలుగా 51 వ సూత్రంలో పేర్కొనబడినవి.

కాగా, నవభారత రాజ్యాంగం బాపూజీ సిద్ధాంతాలకు పూర్తిగా అనుగుణంగానే వున్నదనడం నిస్సందేహం.



# బాపుజీ

ప్రధానమంత్రి పండిత నెహ్రూ సారథ్యంకింద స్వతంత్ర భారతవర్షం తన అనంత యాత్రాచరిత్రలో ఈరోజు ఒక వినూత్నఘట్టంలో ప్రవేశిస్తున్నది. నూత్న రాజ్యాంగావరణతో భారతదేశం సర్వస్వతంత్ర ప్రజాస్వామ్య రాజ్యంగా అవతరిస్తున్న ఈ శుభసమయంలో భారత భాగ్యవిధాత, బాపుజీని, ఆయన జాతికి చేసిన అపారసేవను ఒకసారి సంస్మరించడం భారతీయుల విధ్యుక్త ధర్మం.

కేవలం జడావస్థలోనూ, అజ్ఞానాంధకారంలోనూ, చిరకాలం దాస్యశృంఖలాలలోనూ పడివున్న భారతజాతిని జాగ్రదావస్థకూ, జ్ఞానపథానికీ తెచ్చి, స్వస్వరూపజ్ఞానం కలిగించి, దాస్యవిమోచనను ప్రసాదించిన మహా మహుడు గాంధిజీ. భారతజాతి ఆ మహాత్మునికి అపరజీకి ఎంతైనా ఋణపడివున్నది.

*   *   *

ఇరవయవ శతాబ్దంలో ప్రపంచం మొత్తంమీద ఇద్దరే ఇద్దరు మహాపురుషులు ఉద్భవించారన్నాడు బ్రిటిష్ పార్లమెంటు కార్మిక సభ్యుడు రెజినాల్డ్ సొరెన్సన్. ఈ ఇద్దరిలో ఒకడు లెనిన్ మహాశయుడు. రెండవవాడు మన మహాత్ముడు అని అతడి అభిప్రాయం. లెనిన్ మహాశయుడు ఈశతాబ్ద ప్రథమపాదంలో ఒక బ్రహ్మాండమైన విప్లవం ద్వారా జార్ చక్రవర్తి నిరంకుశపాలన నుంచి పదునెనిమిది కోట్లమంది రష్యన్ ప్రజలకు స్వాతంత్ర్యభిక్ష పెట్టాడు. ఈ శతాబ్దంలోనే ద్వితీయపాదం అంత్యాన అమోఘ శాంతిసమరంద్వారా గాంధిజీ నలభై కోట్లమంది భారతీయులకు బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశత్వంనుంచి స్వాతంత్ర్యాన్ని ఆర్జించిపెట్టాడు. లెనిన్, గాంధిజీలు ఇద్దరూ విప్లవమూర్తులే.

లెనిన్, గాంధి మహాశయు లిద్దరికీ లక్ష్యాలు ఒకటే అయినా, ఉభయుల సిద్ధాంతాలలోనూ ఉత్తర, దక్షిణ ధృవాలకు వున్నంత వ్యత్యాసం లేకపోలేదు. పారతంత్ర్యంలో మునిగివున్న ప్రజావిమోచనమే ఇద్దరి పరమాశయమూ అయినప్పటికీ, ఆశయసాధనకు ఉపయోగించిన మార్గాలు వేరు. అనుసరించేమార్గం ఏదైనప్పటికీ, లక్ష్యసాధనే లెనిన్‌కు ముఖ్యం. ఆశయ మెంత ముఖ్యమైనదో, ఎంత పరమ పవిత్రమైనదో అనుసరించే మార్గంకూడా అంత ముఖ్యంగానూ, అంత పరమపవిత్రం

పి. శ్రీరాములు

గానూ వుండాలన్నది గాంధిజీ మతం: పవిత్ర సాధనాలద్వారాగాని, పవిత్ర లక్ష్యాలు నెరవేరవని మహాత్ముని పరమ విశ్వాసం.

* * *

భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిపెట్టడంలో మాత్రమే గాంధిజీ ఖ్యాతీ, సేవ ఫున్నవనడం మహాత్మునికి అపచారం చేసినట్లవుతుంది. కేవలం ఒక దేశస్వాతంత్ర్య సాధనకోసమే గాంధిజీలాంటి లోకోత్తరపురుషుడు, అవతారమెత్తవలసిన అగత్యంలేదనే చెప్పవచ్చు. ప్రపంచ సభ్యతాచరిత్రలో తమతమ దేశాలకు స్వాతంత్ర్యం సాధించిన వీరులు, యోధులు యుగయుగాలలోనూ అనేకమంది అవతరించారు; అస్తమించారు. కాని, గాంధిజీ విశిష్టత వేరు. ఆయన పరిపూర్ణ అవతారమూర్తి; పూర్ణపురుషుడు.

గాంధిజీ రాజనీతిజ్ఞులలో ఋషిపుంగవుడు; ఋషిపుంగవులలో రాజనీతిజ్ఞుడు. తనజాతి ఐహికంగా, పారమార్థికంగా సర్వతోముఖ వికాసం సాధించడానికి, పారతంత్ర్యం ప్రబల నిరోధకంగా పరిణమించిందని గ్రహించగానే, మహాత్ముడు భారతీయులలో సాగించిన దివ్యప్రబోధం సర్వకాల సర్వావస్థలలోనూ, సమస్త ప్రజాకోటికీ సద్యోఫలితాలను ఇవ్వగలిగినట్టిది. మానవశ్రేయాన్నే పరమలక్ష్యంగా పెట్టుకొని సేవచేసిన ప్రపంచ మహాపురుషులలో గాంధిజీకివున్న అమోఘస్థానం మరెవ్వరికీ లేదు. ప్రపంచ భూత భవిష్యత్ చరిత్రలలో అపర బుద్ధ భగవానుడూ, అహింసామూర్తీ, అమరమూర్తీ అయిన గాంధిజీ ప్రభవించిన కారణంగా ఇరవయవ శతాబ్ది తేజోమయమై విలసిల్లుతుంది.

* * *

ప్రథమ ప్రపంచసంగ్రామ ప్రారంభం నుంచే వివిధరాజ్యాల మధ్యా సంకుచితత్వం, స్వార్థపరాయణత్వం, నిరంకుశాధికారస్థాపన వాంఛా బయలుదేరినవి. వివిధ జాతులమధ్యా జాతి విద్వేషం విలయతాండవం చేయసాగింది.

ఆపరిస్థితులలో 1915, జనవరి మాసంలో గాంధిజీ తన నూత్న సత్యాహింసామార్గాన్వేషణానుభవంతో భారత రాజకీయరంగంలో అడుగు పెట్టాడు. బలీయమైన బ్రిటిష్ సామ్రాజ్యాధిపత్యాన్ని ఎదుర్కోవడంలో విచిత్రమైన, అపూర్వమైన విధానాన్ని అవలంబిస్తున్న గాంధిజీ సిద్ధాంతాలనుచూసి అప్పటిలో అవహేళనచేసిన భారతీయులు లేకపోలేదు. ఐతే దక్షిణాఫ్రికాలో తాను సాగించిన శాంతి ఉద్యమ సాఫల్యమే మహాత్ముని ఆత్మవిశ్వాసానికి పెట్టని కోటగా పరిణమించింది. ఆతర్వాత, నాల్గే నాలుగేళ్ళలో గాంధిజీ తన నవ్య సిద్ధాంతాచరణతో యావద్భారత ప్రజా బాహుళ్యదృష్టినీ ఒక్కసారిగా మిరుమిట్లు గొలిపేట్లు ఆకర్షించగలిగాడు. భారత రాజకీయరంగంలో తన నాయకత్వానికి స్థిరమైన రూపురేఖలు దిద్దుకోగలిగాడు. బీహారులో (చంపారణ్య)

రాజెన్‌బాబు ప్రభృతులతో సాగించిన వ్యష్టి సత్యాగ్రహోద్యమము, అహమ్మదాబాదు కార్మికుల కష్టనిష్ఠుర నివారణకు జరిపిన నిరశనదీక్ష, రాజకీయరంగంలో ఆనాడు గాంధిజీ ప్రాభవానికి ఉత్తమ నిదర్శనాలు. జలియన్‌వాలా బాగ్ దురంతాల సమయంలో 1919 లో జరిగిన అఖిల భారత జాతీయకాంగ్రెస్‌తో మహాత్మునికి దేశంలో సుస్థిరమైన నాయకత్వం లభ్యమైంది.

* * *

జాతీయ కాంగ్రెస్ చరిత్రలో 1920లో జరిగిన కలకత్తా సమావేశం రాజకీయంగా అత్యంత ప్రధానమైనట్టిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడానికి, అహింసాత్మక సత్యాగ్రహ విధానమే సర్వోత్తమమైనదని గాంధిజీ చేసిన ప్రతిపాదనను ఆ సమావేశంలో అందరూ ఆమోదించారు. స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించాలనీ, ఖద్దరు ధరించాలనీ, శిస్తునిరాకరణ సాగించాలనీ, బిరుదులు పరిత్యజించాలనీ, న్యాయస్థానాలను, శాసనసభలను, ప్రభుత్వ పాఠశాలలను బహిష్కరించాలనీ, బ్రిటిష్ ప్రభుత్వంపై శాంతియుత ప్రత్యక్ష ప్రతిఘటనకు గాంధిజీ నిర్వచించిన సత్యాగ్రహ పద్ధతులన్నిటినీకూడా ఇదే సమావేశంలో కాంగ్రెస్ వాదులందరూ ఆమోదించారు.

సత్యాగ్రహ సూత్ర నిర్వచనం చేయడమంటే సులభమేగాని, వాటిని ఆచరణలో పెట్టవలసినప్పుడు ఎంతైనా జాగ్రత అవసరంకదా! అందులో శాంతిసమర నిర్వహణలో ఆయన అనుభవరహితులైన, అతి ఆవేశపరులైన ప్రజాబాహుళ్యంమీద ఆధారపడవలసి వచ్చింది. తానాదేశించిన ప్రకారం కాకుండా, అహింసా పద్ధతిని విడనాడి ప్రజలు క్రమముతప్పి, హింసాకాండకు ఉద్యమిస్తున్నారని గ్రహించగానే 1919 లోనూ, 1921 లో కూడా ప్రారంభమై సాగుతున్న జాతీయోద్యమాలను మధ్యలో విరమించడానికి మహాత్ముడు వెనుకాడలేదు. ఆ సందర్భంలోనే చౌరీచౌరాలో ప్రజలు గంగవెర్రులెత్తి పోలీసులను సజీవంగా దహనం చేసివేశారని తెలిసినప్పుడు, మహాత్ముడు ఉద్యమం ప్రారంభించడంలో తాను హిమాలయమంత తప్పిదాన్ని చేశానని పరితపించవలసిన పరిస్థితి ఏర్పడింది.

* * *

1924 లో ఒకసారి, 1934 లో మరొకసారి కాంగ్రెస్ వ్యవహారాలనుంచి విరమించి, ఆశ్రమవాసిగా కొన్ని ఏళ్ళపాటు కాలంగడిపినా, కాంగ్రెస్‌సంస్థ శ్రేయస్సునే ఆయన సర్వదా అభిలషించాడు. ఆయన సహాయ సహకారాలను, సలహాలను పాటించకుండా కాంగ్రెస్ ఏపనీ చేసేదికాదు. ఆయనే కాంగ్రెస్, కాంగ్రెసే ఆయనగా వ్యవహరించాడు. 1930 లో దండీయాత్రతో ప్రారంభించిన

ఉప్పుసత్యాగ్రహంతోనూ, 1940 వ్యక్తి సత్యాగ్రహంతోనూ, 1942 నాటి "క్విట్ ఇండియా" మహోద్యమంద్వారానూ బ్రిటిష్ అధిపత్యాన్ని ఒక్క ఊపు ఊపి ప్రపంచదృష్టిని భారత స్వాతంత్ర్య సమస్యపైకి ఏవిధంగా కేంద్రీకరించ గలిగిందీ లోకవిదితమైన విషయాలు.

*　　*　　*

ప్రఖ్యాత చైనా గ్రంథకర్త లిన్‌యు టాంగ్ చెప్పినట్లు, ఇది నిత్య సత్యాలనే సామాన్య ప్రజానీకానికి సులభంగా అవగాహన అయేటట్లు చెప్పవలసిన యుగం; సామాన్య నీతులనే అందరి హృదయ ఫలకాలలోనూ హత్తుకుపోయేటట్లు ప్రబోధించవలసిన సమయం. తన యాభై ఏళ్ళ ప్రజాహిత జీవితంలోనూ మహాత్ముడుచేసిన ప్రబోధం సరిగా ఇదే. భారతజాతిలో చైతన్యావస్థ కలిగించడానికి గాంధిజీ సాగించిన ప్రబోధ ప్రచారాలలో కొత్తఏమీలేదు. సర్వసాధారణంగా శాంతియుతమైన, సౌఖ్యప్రదమైన జీవితానికి ఒక వ్యక్తి, ఒక జాతి, ఒక రాజ్యం ఏ ధర్మమార్గాన్ని అనుష్ఠించాలో దాన్నే అతిస్పష్టంగా నిర్వచించాడు. నిర్వచించడంతో ఆగకుండా, తనకైతాను యావజ్జీవిత పర్యంతమూ ఆచరణలో పెట్టి చూపించాడు. అనుష్ఠానానికి అతీతమైన, అసాధ్యమైన ధర్మసూత్రాలను నిర్వచించక పోవడంలోనే మహాత్ముని ప్రతిభవున్నది

ప్రతికక్షులు ఆయనలో కనబడిన స్వల్ప తప్పిదాలను, ఉద్యమవైఫల్యాలను వేలుపెట్టిచూపి విమర్శించినప్పుడు, గాంధిజీ "నేనూ సాధారణ మనిషినే. మానవమాత్రులందరివలె నేనూ తప్పిదాలు చేసివుండడం సహజమే. ఇతరుల విలువను అంచనా వేయడంలోనూ, వారి వైఖరిని గురించి ఒక నిర్ణయానికి రావడంలోనూ తరుచూ తప్పిదాలు చేసే వుంటానని అంగీకరిస్తాను," అని బదులు చెప్పేవాడు.

*　　*　　*

విశ్వాసబలంవుంటే మహా పర్వతాలను సైతం కదిలించివేయవచ్చునని మహాత్ముని నిశ్చితాభిప్రాయం. అందుచేతనే. "విశ్వాసం అన్నది స్వల్ప తాకిడికి ఇట్టె వాడిపోయే అతికోమలమైన కుసుమంలాంటిది కాదుసుమా! హిమాలయపర్వతం మాదిరిగా.అతి అచంచలమైనట్టిది. నిత్యసంక్షుభితమైన మహాసముద్రాలను అవలీలగా అధిగమించడానికీ, మేరుపర్వతం సైతం కదిపివేయడానికీ సహాయపడేది విశ్వాసబలమే," అని ఆయన హితోపదేశం చేశాడు. ఇంత గాఢమైన నమ్మకంకలవాడు కాబట్టే గాంధిజీ తన అనుచరవర్గంలో సైతం ఇదే మాదిరి అభిప్రాయాన్ని కలిగించగలిగాడు; బ్రిటిష్ సామ్రాజ్యాధిపత్యంలాంటి దాన్ని భారతదేశంనుంచి తరలింపజేయగలిగాడు.

కోటాను కోట్లమంది భారతీయుల అపార ప్రేమగౌరవాలకు పాత్రుడైన పూజ్య బాపుజీ స్వర్గధామాన్ని అలంకరించి ఈ నెలాఖరుకు అప్పుడే రెండు సంవత్సరాలు పూర్తికాబోతున్నవి. జాతి నిత్యజీవితంలో పరిపూర్తిగా విలీనమైపోయి, మానవ సేవారంగంలో అసమానమైన పాత్రను నిర్వహించిన గాంధినేకాకుండా భారతీయులు ఈ రెండు సంవత్సరాల కాలాన్ని ఏవిధంగా గడపగలిగారన్నది ఆశ్చర్యకరమైన విషయమే.

గాంధిజీ తన ప్రజాహిత జీవితాన్ని ఏకార్యక్షేత్రంలో ప్రవేశించడంద్వారా ప్రారంభించాడో, ఆ కార్యక్షేత్రంలోనే ప్రాణార్పణచేశాడు. ఆయన తన భౌతిక దేహాన్ని జరాభారంవల్లగాని, రుగ్మత వల్లగానిగాక, అభాగ్య హిందూసోదరుని అకృత్యం ఫలితంగా మహిమాన్వితమైన మృత్యువును పొందాడు.

భౌతికదేహంతో చేయగలిగిన దాని కంటే, భౌతికదేహ విముక్తుడయే మహాత్ముడు భారతజాతికి వెయ్యిరెట్లు అధికంగా సహాయపడగలిగాడు. అమృత మయమైన ఆయన శాంతి వాక్కులు, సర్వత్రా ప్రతిధ్వనించడానికి, వీలు కలిగింది.

గాంధీ సిద్ధాంత ప్రాశస్త్యాన్ని సమస్త పీడిత ప్రపంచం ఏనాడో గ్రహించ గలిగింది. తదితర జాతులుకూడా ఈ నాడు గ్రహిస్తున్నవి.

సాధ్యమైనంతవరకు గాంధిజీ అడుగు జాడలను అనుసరించడమే స్వతంత్ర భారతదేశ ఏకైకలక్ష్యమని ప్రధాని నెహ్రూ పదేపదే ఉద్ఘాటిస్తున్నాడు. ఐతే దీన్ని క్రియారూపంలో ఇంకా కన బరచడంలేదు.

దరిద్రనారాయణుడై మహాత్ముడు తనజీవితాన్ని ముఖ్యంగా దీనజనో ద్ధరణకే అంకితంచేశాడు. గాంధిజీ ప్రబోధమే శరణ్యమంటున్న స్వతంత్ర భారతప్రభుత్వం ఈవిషయంలో ఇప్పటి వరకు ఏవిధమైన సత్ఫలితాలను సాధించ లేక పోతున్నది. దీనికి దేశంలో ధనిక వర్గాలు కలిగిస్తున్న అవరోధాలే కారణ మని స్పష్టపడుతున్నది.

మహాత్ముడు మరికొన్ని ఏళ్లు సజీవుడై వున్నట్లయితే, పేదప్రజల భాగ్యోన్నతికై తన అహింసా విధానంద్వారా ఎట్టి వజ్రాయుధాన్ని ప్రయోగించి స్వతంత్ర భారతజాతిని ఎంత అభ్యుదయ పథాన నడిపేవాడో ఎవరు చెప్పగలరు!

ఏది ఏమైనప్పటికీ కమ్యూనిష్టు ప్రజాస్వామ్య సిద్ధాంతాలమధ్య రెండు భిన్నకూటాలుగా చీలిపోయి శాశ్వత శాంతికై పరితపిస్తున్న నేటి ప్రపంచానికి ఏనాటికైనా గాంధిజీ అమోఘసిద్ధాంతమే శరణ్యమయేమాట వాస్తవం.

ప్రపంచం గాంధిసిద్ధాంతాచరణ ద్వారా శాంతిసౌఖ్యాలనే కోరుకుంటుందో అణ్వస్త్ర ప్రయోగంద్వారా సర్వవినా శాన్నే కోరుకుంటుందో చూడాలి!

# రాజ్యాంగవిధానము

భాషకు వ్యాకరణంవలె ఒకదేశపు రాజకీయ వ్యవస్థకు దాని రాజ్యాంగం జీవగర్ర.

భాషకు వర్ణక్రమవిధానం, శబ్దవ్యుత్పత్తి, ఛందస్సు మున్నగునవి వున్నట్లే రాజ్యాంగానికికూడా అనేక అంగాలు వుంటాయి.

రాజ్యాంగమనే భాషకు పౌరస్వత్వ సూత్రాలే అకారాదివర్ణసముచ్చయం. ప్రాథమిక హక్కులు దాని ఉచ్చరణ.

ఇకరాజకీయవ్యవస్థ అనే సౌధానికి రాజ్యాంగమనే పునాదినిగురించి పరికిస్తే కార్యనిర్వాహణాధికారంతో. ప్రెసిడెంట్ అధినేతగా కేంద్రకార్యనిర్వాహకవర్గం, శాసనసభలు; న్యాయపాలనకు. రాజ్యాంగవిధాన సక్రమ నిర్వహణకు ఉత్తరాధికారి అయిన సుప్రీంకోర్టు, కంప్ట్రోలర్, ఆడిటర్-జనరల్ ఒక భవనంలో అనేక అంతస్థులవలె, అనేక శిఖరాలవలె రాజ్యాంగంలో గోచరిస్తారు.

కాని, ఈ గోపురాలే రాజ్యాంగసౌధపు ప్రధాన భాగాలు కావు.

ఎత్తులో, పరిమాణంలో స్వల్ప విభేదాలున్నప్పటికీ, సమాన ప్రాముఖ్యత కలిగివుండి, సమస్తాధికారయుతమైన రాష్ట్రాలు అనే 28 అంతస్థులే రాజ్యాంగ సౌధానికి ప్రధాన భాగాలు.

ఈ రాష్ట్రాలే తమ అధికారంలో కొంత భాగాన్ని కేంద్రప్రభుత్వానికి అప్పగించాయి.

పాత పెంకుటిల్లును పడగొట్టి అనేక అంతస్థులతో కొత్తభవనాన్ని నిర్మించదలుచుకున్నపుడు పాతయింటి బాపతు వాసాలు, దూలాలు, పెంకులు, కొత్త భవనంకోసం తెచ్చిన ఇనపకడ్డీలు, బందులు, కమ్ములు ఒకేచోట వుంటాయి. పాతవాటిని పడగొట్టి కొత్తవాటిని పాతవాటినీ కలిపి, కొత్తసైజులోనికి మార్చి బిగించవలసివుంటుంది.

ఇదే విధంగా, నవభారతరాజ్యాంగ సౌధనిర్మాణంలో రాష్ట్రాలను పునర్నిర్మాణం చేయుటంలో పాతవాటిని సంస్కరించి కొత్తరూపం యివ్వడం జరగడం. నిన్నటివరకు రాష్ట్రాలని వ్యవహరింపబడినవి నేటినించి "స్టేట్స్" అని వ్యవహరింపబడుతున్నాయి.

ప్రజాస్వామికవిధానానికి ఈ స్టేట్స్ ప్రాతిపదికలు. వాటి కవసరం లేనివి, అవి నిరాకరించినవి కేంద్రం స్వీకరించింది.

అయితే, కేంద్ర, స్టేట్స్ ప్రభుత్వాలు అన్నీ కలసి ఒక్కటేనని, అన్నింటి ఆర్థికసంపత్తి ఒక్కటేనని; అన్నింటికి న్యాయశాస్త్రం ఒక్కటేనని గ్రహించాలి.

అందుచేతనే, కేంద్ర, రాష్ట్రాల అధికారాలు, వాటి అజమాయిషీకింద వుండే వివిధ శాఖలు సమ్మిళితమై వున్నవి. కాగా, కేంద్రరాష్ట్రాలను విడివిడిగా విభజించి, వేటికి వాటికి వేరుగా ఇవి కేంద్రానికి సంబంధించిన విషయాలు, ఇవి రాష్ట్రాలకు సంబంధించిన విషయాలు అని విడమర్చిచెప్పటానికి వీలులేదు.

ఈ కారణంవల్లనే నవరాజ్యాంగంలో ప్రభుత్వాధికారంకింద వుండగల

రాష్ట్రపతి, డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య

విషయాలు మూడు విభాగాలు చేయబడినవి. ఒకటి:—పూర్తిగా కేంద్రప్రభుత్వం అధికారంలో వుండేవి. రెండు:—పూర్తిగా రాష్ట్రాల (స్టేట్సు) అధికారంలో వుండేవి. మూడు: కేంద్రం (స్టేట్సు) సమిష్టిగా అధికారం కలిసివుండేవి.

పైన వివరించిన మూడు రకాలలోను మూడవ రకానికి చెందినవాటి విషయంలో శాసనాలుచేసే అధికారం కేంద్రానికి, స్టేట్సుకుకూడా సమంగా వున్నవి. అయితే, అధికారానికి సంబంధించినవాటిలో ఒక విషయాన్నిగురించి ఒకసారి కేంద్రప్రభుత్వం ఒక నిర్ణయం చేసిన పిమ్మట దాని నిర్ణయమే తుది నిర్ణయంగా పరిగణించబడాలని, దానినే స్టేట్‌కూడా అనుసరించాలని రాజ్యాంగంలో స్పష్టంగా సూచించబడింది.

కార్యనిర్వాహకవర్గం పెత్తనానికి, అనగా ఇంకొక రిపబ్లిక్ కేంద్రపర్గం పెత్తనం సాగించడానికి వీలులేకుండా సర్వస్వతంత్రంగా వ్యవహరించగల అవకాశం న్యాయశాఖకు మాంచ్చబడింది.

న్యాయమూర్తుల జీతాలనుగాని, గవర్నర్ల జీతాలనుగాని, ప్రెసిడెంట్ జీతాన్నిగాని, కంట్రోలర్ జీతాన్నిగాని ఆడిటర్ జనరల్‌జీతాన్ని తగ్గించడానికి లేదా హెచ్చించడానికి కేంద్ర, రాష్ట్రీయ (స్టేట్స్) ప్రభుత్వాలకు అధికారంలేదు. ఆవిషయమై చర్చించే అధికారం కేంద్ర, రాష్ట్రీయ శాసనసభలకుకూడా లేదు.

అందులోనూ ఆడిటర్ జనరల్‌కు బ్రిటన్‌లో ఇదే పదవికిగల సమస్తాధికారాలు, సకలావకాశాలు చేకూర్చబడినవి.

రాజ్యాంగసౌధ శిఖరాలలో ఆడిటర్ జనరల్ అనే శిఖరం ఉన్నతమైనది. కాగా, ఈ సౌధం ప్రాథమికస్వత్వాలు, పరిపాలనానిర్వహణసూచికలు అనే పునాదులపై సుస్థిరంగా నిర్మించబడింది. ప్రాథమికస్వత్వాల రక్షణకై న్యాయస్థానాలను అర్థించడానికి అవకాశం కల్పించబడింది. గాని సూచికల విషయంలో ఆ అవకాశం లేదు.

కాగా, భారతదేశంలోని 562 సంస్థానాలకు, 9 రాష్ట్రాలకు వర్తించగల నవ రాజ్యాంగ సౌధం అనేక స్వత్వాలనే పునాదులపై నిర్మించబడింది. ఈ స్వత్వాలకు ప్రమాదం వాటిల్లినపుడు వాటిని రక్షించుకోడానికి సుప్రీంకోర్టును అర్థించడానికి అవకాశంకూడా కల్పించబడింది.

ఈ రాష్ట్రాలు, సంస్థానాలుకూడా రాజ్యాంగసౌధంలో ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రాధాన్యతను కలిగివున్న వేరువేరు అంతస్థులే అయినా, ఇవి అన్నీ కలసి కేంద్రమనే భవనంలో అంతర్భాగాలే కావడంచేత, నవభారతరాజ్యాంగాన్ని సమస్తాధికారాన్ని కేంద్రానికే కట్టపెట్టిన కేంద్రీకృతరాజ్యాంగ విధానమనిగాని లేదా అన్ని స్టేట్స్‌కు అన్ని అధికారాలు అప్పగించిన ఫెడరల్ రాజ్యాంగవిధానమనిగాని అనడానికి వీలులేదు.

అందుచేత, దేశపరిస్థితులకు అనుగుణంగా ఈ రాజ్యాంగాన్ని అమలుపరచడంపైన, ఈ రాజ్యాంగానికి అనుగుణంగా దేశాన్ని నడిపించడంపైన దాని జయాపజయాలు చాలవరకు ఆధారపడి వుండగలవు.

మూడు సంవత్సరాలుగా మనం చేసిన కృషి, పడినశ్రమ సత్ఫలితాలనివ్వగలదని ఆశించవచ్చు.



# మనక్రొత్త రాజ్యాంగము

**1946** డిసంబరులో సమావేశమైన రాజ్యాంగపరిషత్తు మూడు సంవత్సరములకాలము శ్రమపడి స్వతంత్రభారత పరిపాలనమునకై రాజ్యాంగచట్టమును తయారుచేసెను. 1950, జనవరి తే26 ది నుండి ఆచట్టమునను సరించి మనదేశము యొక్క పరిపాలనము జరుగనున్నది. దీనిమూలమున క్రొత్తరాజ్యాంగవిధానమొకటి ఏర్పడెను—అందులోని క్రొత్తదనమెట్టిదో తెలుసుకొనుట అవసరము.

ఈ రాజ్యాంగముయొక్క జననమందే క్రొత్తదనముకలదు. గమనించదగిన విశేషములలో ఇదియే మొదటిది. గత రెండువందల సంవత్సరముల మధ్యన బ్రిటిష్‌వారి పరిపాలనకాలములో మనదేశమును పాలించుటకై అనేక రాజ్యాంగ చట్టముల్ను చేయబడెను. కాని వీటిని చేసినవారు పరాయివారు. మనకు ఆరువేలమైళ్ళ దూరమందుండు బ్రిటిష్ పార్లమెంటువారు నిర్మించిన విధానము ననుసరించి మనదేశ పరిపాలన జరుగుచుండెను. ఇప్పుడు ఏర్పడిన విధానము మనము ఏర్పరచుకొనిన విధానము. దీనికి కర్తలు మనమే. క్రొత్తరాజ్యాంగములోని క్రొత్తదనమిందులో కనుపించుచున్నది.

ఇంకొక విశేషముకూడ ఈ సందర్భమున గమనించవలసి ఉన్నది. దేశమును ఏవిధముగ పరిపాలించవలయునో నిర్ణయించుటకై ప్రత్యేక రాజ్యాంగపరిషత్తును సమావేశపరచు విధానము ఇదివరకు మనదేశమున ఎప్పుడుగాని ఉండినదిలేదు. హిందూచక్రవర్తుల పరిపాలనమందుగానీ మహమ్మదీయ సుల్తానుల పాలనమందుగాని ఇట్టిది జరిగినట్లు చెప్పుటకు వీలులేదు. పరిపాలనమంతయు ఆచారబద్ధమైనట్టియు సాంప్రదాయసిద్ధమైనట్టియు విధానమున జరుగుచుండెను. ఇప్పటి క్రొత్తరాజ్యాంగమిట్టిదికాదు. దేశములోని మేధావులు సుమారు మూడువందలమంది పరిషత్తులో సమావేశమై, వివిధదేశముల లోని పరిపాలన విధానములను విమర్శించి, మనదేశమునకీ కాలమున అనుగుణమైన చట్టమును నిర్మించిరి. ప్రాచీనకాలపు రాజ్యాంగమువలె నిది కాలానుసారముగ వృద్ధిగాంచినదిగాక, కొందరి బుద్ధిబలము మూలమున కల్పితమైనది.

---

మామిడిపూడి వెంకటరంగయ్య

దీనినిబట్టికూడ ఈరాజ్యాంగము క్రొత్త దని చెప్పదగియున్నది.

అన్ని రాజ్యాంగచట్టములవలె మన రాజ్యాంగచట్టముకూడ మూడు ప్రధాన విషయములను నిర్ణయించుచున్నది. ఇందులో మొదటిది మన రాజ్యాంగము యొక్క బాహ్యస్వరూపము; రెండవది రాజ్యాంగముద్వారా మనము సాధించ వలసిన పరమార్థములు; మూడవది వాటిని సాధించగల పరిపాలన సంస్థలు.

క్రొత్తరాజ్యాంగచట్టమువలన భారత దేశము సంపూర్ణస్వామ్యముగల ప్రజా రాజ్యమగుచున్నది. ఇదియే దాని బాహ్య స్వరూపము. ఇదివరకు మనకిట్టి సంపూర్ణస్వామ్యముందినదికాదు. బ్రిటిష్ వారి పాలనకు లోబడి మనము ప్రవర్తించుచుంటిమి. ఇప్పుడట్లుగాక మన ఇష్టానుసారముగ మన పరిపాలనమును నడిపించుకొనవచ్చును. ఇష్టమువచ్చిన వారితో సఖ్యమును వహించుటకుగాని విరోధము పెట్టుకొనుటకుగాని మనకు స్వాతంత్ర్యము కలదు. సంపూర్ణ స్వామ్యము (Sovereign) నకిదియే లక్షణము. ఇదిగాక ఇంతకుపూర్వము దేశ మును రాజులు చక్రవర్తులు పాలించు చుండిరి, ఏకస్వామ్యము—అనగా ఒక రాజు యొక్క సంపూర్ణాధికారము—హిందూయుగమునకును మహమ్మదీయ యుగమునకును బ్రిటిష్‌యుగమునకును ప్రధాన లక్షణముగ నుండెను. క్రొత్త రాజ్యాంగము దీనికి భిన్నమైనది. ప్రజ లెన్నుకొనిన ప్రతినిధులు దేశమునకు పరిపాలకులగుచున్నారు. పరిపాలించు వారి గుణదోషములను విమర్శించుట కును, ఒకప్పుడు పరిపాలనాధికారమం దుండు మంత్రులను అధికారమందుండి తొలగించి మరియొక మంత్రివర్గమును అధికారమందుంచుటకును ప్రజలకు హక్కు కలదు. ప్రజాస్వామ్యమున కిదియే ప్రధానలక్షణము. మనక్రొత్త రాజ్యాంగము ఇట్టి స్వామ్యము కలదిగ నున్నది. దేశములో పరిపాలనము చక్కగ జరగనియెడల దానికి ప్రజలే కారణమగుచున్నారు. పరిపాలనము లోని లోపముల కితరులెవ్వరో కారణ మనిచెప్పుటకు ప్రజలకు వీలులేదు. అన్ని విధములైన అధికారములు, బాధ్యతలు దేశములోని ప్రజల అధీనమందున్నవి. క్రొత్తరాజ్యాంగములో ఇదియొక క్రొత్త దనము.

సంపూర్ణ స్వామ్యముగల మన ప్రజా రాజ్యములో (Sovereign Democratic Repubic) ప్రభుత్వము సాధించవలసిన పరమార్ధములను మన క్రొత్తరాజ్యాంగ చట్టము నిర్ణయించియున్నది. పౌరు లందరు—స్త్రీలు, పురుషులు అనుభేదము లేక—సుఖముగ జీవించునట్లు చేయుట; సాహుకార్లు భూస్వాములు మొదలగు కొందరి లాభముకొరకేగాక ప్రజలందరి లాభముకొరకు వినియోగమగు ఆర్థిక విధానము నేర్పరచుట; అందరికి ఉద్యోగమును కల్పించుట; అందరికి చదువునేర్పుట; కష్టకాలములో అందరికి సహాయము చేయుట; ప్రపంచమందు శాంతి భద్రతలు నెలకొనుటలో సహాయ పడుట—ఇట్టి ఆదర్శములతో భావికాలపు

భారతప్రభుత్వము ప్రవర్తించవలసినట్లు క్రొత్తరాజ్యాంగము సూచించుచున్నది. దారిద్ర్యము, రోగము, అజ్ఞానము, మొదలగు వాటిమూలమున కష్టపడు జనము దేశమందెందరో ఉన్నారు. ఇట్టి వారి సంఖ్యయే దేశమందధికముగ నున్నది. వీరు అనుభవించు కష్టములను తొలగించుబాధ్యత ఇప్పటినుండి ప్రభుత్వమువారు వహించవలసియున్నది. "ఎవడికర్మవాడిది ; ఒకరికష్టమును మరి యొకరు తొలగించుట సాధ్యముకానిపని; ప్రభుత్వమువా రిట్టిపనులలో ప్రవేశించ రాదు," అనుసూత్ర మికమీదట వర్తింప జాలదు. ప్రజ లనుభవించు బాధలను నివారించు బాధ్యత ప్రభుత్వమువారిదగు చున్నది. ఇదిగాక ఈ బాధ్యతను ప్రభుత్వమువారు అందరి విషయమున వహించవలెను. దీనిని వహించుటలో కుల భేదములనుగాని, మత భేదములను గాని, స్త్రీ పురుష భేదములనుగాని ప్రభుత్వమువారు పాటించరాదు. మన క్రొత్త రాజ్యాంగచట్టము ఇట్టి ఆదర్శ ములను సూచించుచున్నది.

సాధారణముగ ఆదర్శములకును ఆచరణలకును మధ్య ఎంతో అంతర ముండును. రాజ్యాంగ చట్టములోని గుణదోషములను అందులోని ఆదర్శ ములబట్టి నిర్ణయించరాదు. ఆదర్శములు ఉన్నతములైనను, వానిని సాధించి ఆచరణలో నుంచుటకు కావలసిన అధికారసంస్థలు లేనియెడల ఆ ఆదర్శ ములు వ్యర్థమగును, గనుక మన క్రొత్త రాజ్యాంగచట్టము ఇట్టి ఆదర్శ ములను సాధించుటకు కావలసిన పరి పాలనాంగములను నిర్మించినదా అన్న విషయము విమర్శింపదగియున్నది.

మొత్తముమీద ఇట్టి పరిపాలనాంగ ములను మనరాజ్యాంగచట్టము కల్పించి యున్నదని చెప్పవచ్చును — ఈ అంగ ములు అనేకవిధములుగ నున్నవి.

ఈసందర్భమున మొదట గమనించ వలసిన విశేష మొకటికలదు. మన దేశము విస్తీర్ణమందు మిక్కిలి గొప్పది. దీనివలన పరిపాలన బాధ్యతనంతను ఒక కేంద్ర ప్రభుత్వము వహించుట సాధ్యము కానిపని-ఇదికాక ఒకరాష్ట్రములోని పరి స్థితులకును ఇంకొకరాష్ట్రములోని పరి స్థితులకును అనేక భేదములున్నవి. రాష్ట్రములోని పరిస్థితులను గమనించి, వాటికి అనుగుణముగ పరిపాలనము జరుపుట మంచిదిగాని, దేశమందంతట ఒకేవిధమైన పరిపాలనమును నిర్మించుట మంచిదికాదు. ఈవిషయమును మన రాజ్యాంగపరిషత్తువారు గ్రహించి, దాని ననుసరించి దేశములోని ప్రభుత్వము రెండు తరగతులుగ నుండునట్లు నిర్ణ యించిరి. మొదటి తరగతిలో కేంద్ర ప్రభుత్వము చేరియున్నది. రెండవ తరగతిలో రాష్ట్రప్రభుత్వములు చేరి యున్నవి. ప్రజల యోగక్షేమములు వృద్ధియగుటకు కావలసిన ఏర్పాటులలో కొన్నిటిని కేంద్రప్రభుత్వము, మరి కొన్నిటిని రాష్ట్రప్రభుత్వములు, చేయ గలవు. దేశరక్షణ, విదేశములతోటి వ్యవహారములు, ఎగుమతి దిగుమతుల నిర్ణయము, రైల్వేలు, పోస్టు, టెలిగ్రాఫ్

చెలామణి బ్యాంకీ వ్యవహారములు. ఈలాటి అంశములు సుమారు తొంభై ఏడు కేంద్రప్రభుత్వపు పరిపాలనలో నుండును. రాష్ట్రములోని శాంతి భద్రతలు, వాటికి కావలసిన పోలీసు దళము. ఆరోగ్యము, వైద్యసహాయము, విద్య, రోడ్లు, వ్యవసాయము, అడవులు, జలాధారములు, పరిశ్రమలు, దేవాదాయములు, మొదలగు అంశములు సుమారు అరవై ఆరు రాష్ట్రప్రభుత్వముల పరిపాలనయందుండును. రాచవ్యవహారములను ఈవిధముగ రెండు తరగతులుగ విభాగముచేసి, ఒక్కొకదానికి ఒక్కొక ప్రభుత్వము బాధ్యతవహించవలసినట్లు నిర్ణయించుట మన క్రొత్తరాజ్యాంగమున కొక ప్రధానలక్షణము. ఇట్టి విభజన పరిపాలన సౌకర్యమునకెంతో తోడ్పడగలదు. ఒకప్రభుత్వము భారము నంతనుమోయుట సవ్యముకాదు. ఇట్టి విభజనగల రాజ్యాంగమునకు ఇంగ్లీషు భాషలో ఫెడరల్ (Federal) రాజ్యాంగ మని పేరు. కేంద్ర ప్రభుత్వమువారు రాష్ట్రప్రభుత్వముల అధీనమందుండు వ్యవహారములలో జోక్యముకలిగించు కొనుటగాని, రాష్ట్రప్రభుత్వములు కేంద్ర ప్రభుత్వపు అధీనమందుండు వ్యవహారములలో జోక్యము కలిగించుకొనుటగాని ఫెడరల్ రాజ్యాంగములో జరుగదు. ఒక్కొక ప్రభుత్వము దానికై కల్పింపబడినహద్దును దాటుటకు వీలుండదు. గనుక మన క్రొత్తరాజ్యాంగము ఫెడరల్ (Federal) రాజ్యాంగమన్న విషయమును మనము గ్రహించవలెను.

కేంద్ర వ్యవహారములను పాలించుటకై కొన్ని పరిపాలనాంగములు కల్పింపబడియున్నవి. వీటిలో అధ్యక్షుడు (President); శాసనసభ; ఉన్నత న్యాయస్థానము ప్రధానములైనవి. బ్రిటిష్ పరిపాలనకాలమందు ఇంగ్లండును పాలించుప్రభువు మనకుకూడ ప్రభువుగ నుండెను. అందుచేత ఆతని ప్రతినిధి యొకడు వైస్రాయి లేక గవర్నరు జనరల్ అనుబిరుదుతో దేశమును పాలించుచుండెను. మనకిప్పుడు సంపూర్ణ స్వాతంత్ర్యము లభించినందున వైస్రాయిగాని గవర్నరు జనరల్‌గాని ఉండరు. వారి స్థానమున దేశమున కంతకు అధ్యక్షుడొకడుండును. ఇతడు ఎన్నికమూలమున అధికారమునకువచ్చి సాధారణముగ అయిదు సంవత్సరముల కాలము అధ్యక్షపదవిలో నుండును. కేంద్ర శాసనశాఖలోని రెండు సభల యందుండు సభ్యులు, రాష్ట్రశాసనశాఖల లోని ప్రజాసభలలో ప్రజలెన్నుకొనిన సభ్యులు కలిసి అధ్యక్షుని ఎన్నుకొనెదరు. ఒకనినే వీరు ఎన్నిపర్యాయములైన అధ్యక్షునిగ నెన్నుకొనవచ్చును. ఇతని ఉద్యోగ కాలపరిమితి అయిదు సంవత్సరములైనను, ఈమధ్య కాలమున నితనిని ఉద్యోగమునుండి తొలగించుటకు వీలుకలదు. రాజ్యాంగ చట్టమునకు విరోధముగ నితడు ప్రవర్తించినట్లు కేంద్ర శాసనశాఖలోని రెండు సభలవారు అభిప్రాయపడినప్పు డితడు ఉద్యోగమును వదలుకొనవలసిన వాడగును. అధ్యక్షునికి పేరునకు పరి

పాలనాధికారము లనేకములుకలవు. కాని మంత్రుల సలహాను అనుసరించి ఇతడు కేంద్ర వ్యవహారములను పరిపాలించ వలసియున్నాడు. మంత్రులను ధిక్కరించి, స్వతంత్రముగ నితడు వ్యవహరించుటకు వీలులేదు. అధ్యక్షుడు ఏదైన కారణముచేత సెలవులోనున్నయెడల, అతని సెలవుకాలమున ఉపాధ్యక్షు డతని పనులను నిర్వహించును. ఉపాధ్యక్షుని ఎన్నుకొనుహక్కు కేంద్ర శాసన సభ్యులకు మాత్రమే కలదు. ఇతడు కేంద్రమండలి రాష్ట్రీములసభకు అగ్రాసనాధిపతి.

దేశాధ్యక్షునికి సలహా నిచ్చుటకు మంత్రులసభయొకటి ఏర్పడియున్నది. దీనికి ప్రధానమంత్రి నాయకుడు-ఇతనిని అధ్యక్షుడు నియమించును. కాని తన కిష్టమువచ్చినవానిని ప్రధాన మంత్రిగ నియమించుటకు అధ్యక్షునికి వీలులేదు. కేంద్రమండలి ప్రజాసభయందు అధిక సంఖ్యాకులుగనుండు రాజకీయపక్షము వారి నాయకునినే ప్రధానమంత్రిగ నియమించుట అధ్యక్షుని విధి. ప్రధాన మంత్రి సూచించినవారినే అధ్యక్షుడు తక్కిన మంత్రి పదవులలో నియమించ వలసియున్నాడు. గనుక మంత్రులను ఉద్యోగమందు నియమించుటయు, ఉద్యోగమునుండి వారిని తొలగించుటయు అధ్యక్షుడు చేయుపనియైనను, ఈ పనినతడు స్వతంత్రించి ఇష్టమువచ్చినట్లు చేయుటకు వీలులేదు. ప్రజాసభలోని అధికసంఖ్యాకుల ఆమోదమును పొందినవారే మంత్రులు కాగలరు—మంత్రుల ఉద్యోగమునకు కాలపరిమితి లేదు. ఎంతకాలమువారికిప్రజాసభయొక్క ఆమోదముండునో అంతకాలము వారు ఉద్యోగమందుండుటయు, ఆ ఆమోదము కోల్పోయినపుడు వారు ఉద్యోగమును మానుకొనుటయు తప్పదు. గనుక మంత్రుల నియమించుటకును తొలగించుటకును కావలసిన అధికారము ప్రజాసభకు కలదు - మంత్రులు ఆ సభకు బాధ్యులై ప్రవర్తించవలసియున్నది. అందుచేత ఇట్టి పరిపాలనకు బాధ్యతాయుత పరిపాలన యనుపేరు చెల్లుచున్నది-మరియొక విశేషముకూడ ఇందు కనబడుచున్నది. ప్రజాసభలోని సభ్యులను దేశములోని ప్రజలు ఎన్నుకొనుచున్నారు. ఎన్నిక కాలమందు ఏ పక్షమువారు అధిక సంఖ్యాకులుగ గెలుచునది నిర్ణయించువారు ప్రజలే అట్టి పక్షపు నాయకుడు ప్రధానమంత్రి అగుటయు, అందులోని ఇతరప్రముఖులు సాధారణమంత్రులగుటయు జరుగుటచేత మంత్రివర్గమును నిర్ణయించువారు ప్రజలగుచున్నారు. ఇందుచేతనే ఇట్టివిధానమునకు ప్రజాస్వామ్యమనుపేరు తగియున్నది. దేశాధ్యక్షుడు మంత్రివర్గము కలసి కార్యనిర్వాహకశాఖగ నేర్పడుచున్నారు.

పరిపాలనము జరుగుటకు క్రొత్త చట్టముల చేయుట, క్రొత్తపన్నులను విధించుట, పన్నుల మూలమున లభించిన ద్రవ్యమును చక్కగ వినియోగించుట అవసరమగుచున్నది. ఈపనుల నన్నిటిని చేయుటకే శాసనశాఖ ఏర్పడి

యున్నది. కేంద్రశాసనశాఖలో రెండు సభలున్నవి. అందులో ఒకదానికి ప్రజా సభయనియు, రెండవదానికి రాష్ట్రముల సభయనియు పేరు. ప్రజాసభలో అయిదు వందల సభ్యులుండవచ్చును. దేశము లోని వయోజనులు వీరినెన్నుకొనెదరు. ఇందుకై ఏర్పడు నియోజక వర్గములు సమిష్టిగ (Joint) నుండవలెనేగాని, బ్రిటిష్‌పాలనములో నున్నట్లు కులాను సారముగ నుండరాదు. సామాన్యముగ అయిదు సంవత్సరముల కొకపర్యాయ మీ ఎన్నికలు జరుగును. రాష్ట్రముల సభలోని సభ్యులలో పండ్రెండుగురుని మాత్రము దేశాధ్యక్షుడు నియమించును. తక్కిన రెండువందల ముప్పైఎనిమిది మంది వివిధరాష్ట్రములలో ఒక్కొక దానికి ఇందరని కేటాయింపబడి యున్నారు. అట్లు కేటాయింపబడిన వారిని ఆయారాష్ట్రములలోని ప్రజాసభ యందలి ప్రజాప్రతినిధులు ఎన్నుకొనె దరు. ఈసభలోని సభ్యుల ఉద్యోగ కాలము ఆరుసంవత్సరములు —కాని సభ్యులందరు ఒక పర్యాయము ఎన్ను కొనబడరు. రెండుసంవత్సరములకొక పర్యాయము మూడవవంతు సభ్యుల ఎన్నిక జరుగును. కేంద్రశాసనశాఖలో ఇట్లేర్పడిన సభలు రెండుఉన్నను, వీటిలో రాష్ట్రముల సభకంటె ప్రజా సభకు ఎక్కువ అధికారమున్నది. పన్నుల విధించుటకును ఖర్చుపెట్టుట కును దానికి అధికారముకలదు. మంత్రు లకు కావలసినది దాని ఆమోదమే. తక్కినచట్టముల నిర్మించుటలో మాత్రము రెండుసభలకు సమానాధికారము కలదు.

కార్యనిర్వాహక శాసన నిర్మాణశాఖ లేగాక కేంద్రమందు ఉన్నత న్యాయ స్థానమొకటికలదు. ఇందు ప్రస్తుతమొక ప్రధానన్యాయాధీశుడు, ఏడుగురు సాధా రణ న్యాయాధీశులు ఉండవచ్చును. మంత్రుల సలహాతోడ వీరిని దేశాధ్య క్షుడు నియమించుచున్నాడు. సివిల్ క్రిమినల్ వ్యవహారముల పరిష్కరించు టకు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వముల మధ్యనుగాని, రాష్ట్రములమధ్యనుగాని ఏర్పడు వివాదములను పరిష్కరించు టకును, ప్రభుత్వములు వాటివాటిహద్దుల నతిక్రమించి చట్టముల గావింపకుండ చేయుటకును దీనికధికారము కలదు. న్యాయాధీశులు అరవై అయిదు సంవత్స రముల వయస్సువచ్చువరకు ఉద్యోగ మందుండవచ్చును. వారు నిర్భయము గను స్వతంత్రముగను వివాదములు పరిష్కరించుటకు కావలసిన అవకాశము లన్నియు కలవు.

రాష్ట్రప్రభుత్వముల నిర్మాణము చాల వరకు కేంద్రప్రభుత్వ నిర్మాణమును పోలియున్నది. ప్రతిరాష్ట్రమునకు ఒక గవర్నరు కలడు. ఇతనిని దేశాధ్య క్షుడు నియమించును. ఇతని ఉద్యోగ కాలము అయిదు సంవత్సరములు. ఇతడుకూడ పరిపాలనము నంతను రాష్ట్రశాసనసభలోని ప్రజాశాఖయొక్క ఆమోదమును పొందిన బాధ్యతాయుత మంత్రివర్గమువారి సలహా ననుసరించి జరుపవలసియున్నాడు. ప్రతిరాష్ట్రములో శాసనశాఖయున్నది. కొన్ని రాష్ట్రము

లలో దీనియందు రెండుసభలు, మరి కొన్నిటిలో ఒకేసభయు ఉన్నవి. వీటిలో ప్రజాసభను వయోజనులు ఎన్నుకొనెదరు. రెండవసభలోని సభ్యులలో కొందరిని ప్రజాసభవారు, కొందరిని రాష్ట్రములోని పట్టభద్రులు మరికొందరిని ఉపాధ్యాయవర్గమువారు, కొందరిని స్థానికసంస్థలసభ్యులు, ఎన్నుకొనెదరు. వీరిలో మూడవవంతు రెండుసంవత్సరములకొకపర్యాయము మారెదరు. రెండుసభలుగల రాష్ట్రములలో ప్రజాసభకు రెండవసభకంటె ఎక్కువ అధికారము కలదు. ప్రతిరాష్ట్రమందును హైకోర్టుఒకటియు, దానికి లోబడిన క్రిందికోర్టులు కొన్నియు ఉండును. హైకోర్టున్యాయాధీశులను దేశాధ్యక్షుడు నియమించును. వారిపై రాష్ట్రగవర్నరుకు గాని మంత్రివర్గమునకుగాని ఎట్టి అధికారములేదు.

కేంద్రమందును రాష్ట్రములందును ఉన్నతోద్యోగుల వారివారి అర్హతలను పరీక్షించి నియమించుటకు పబ్లిక్ సర్వీసు కమీషన్లుకూడ ఏర్పడియున్నవి. ఇవిగాక హరిజనులయొక్కయు ఇతర అల్పసంఖ్యాక వర్గముల యొక్కయు యోగక్షేమముల వృద్ధిచేయుటకు ప్రత్యేక అధికారులున్నారు,

గనుక పరిపాలన క్రమముగ జరుగుటకు కావలసిన అంగములన్నిటితో కూడిన విధానమును క్రొత్త రాజ్యాంగ చట్టము నిర్మించియున్నది. ఇది మనము ఏర్పరచుకొనిన రాజ్యాంగము. దీనికి ప్రజాస్వామ్యము ఆధారము. అధ్యక్షుడు శాసనసభ్యులు ప్రజలచే ప్రత్యక్షముగనో పరోక్షముగనో ఎన్నుకొనబడినవారు. ఈ రాజ్యాంగము ప్రజలందరి సౌభాగ్యమును సమానముగ వృద్ధిచేయుటకై ఉద్దేశింపబడినది. దీనిని నిర్వహించువారు సమర్థులుగను దేశాభిమాన పూరితులుగను ప్రజల సౌఖ్యమును వాంఛించువారుగను ఉన్నయెడల ఈ ఉద్దేశము నెరవేరుట సులభసాధ్యమగును. రాజ్యాంగ మొకబండివంటిది. బండికి మంచిచక్రములు, నొగ, పరము కాడిమొదలైన అంగములున్నగాని అది నడవజాలదు. కాని అది గమ్యస్థానము చేరుటకీ అంగములు మాత్రము చాలవు. బండినితోలువాడు సమర్థుడుగను నేర్పుగలవాడుగను ఉండవలెను. అదేవిధముగ రాజ్యాంగమను బండిద్వారా ప్రజాసౌఖ్యమను గమ్యస్థానముచేరుటకు సమర్థులును ప్రజాసేవాతత్పరులును అగువారు అధికార స్థానములకువచ్చి దానిని నడపవలెను. ప్రజలు అట్టివారినే ఎన్నుకొనవలెను. ఇది జరిగినప్పుడే మనము కృతార్థులు కాగలము. ప్రస్తుతము మన రాజ్యాంగ పరిషత్తువారు పూర్తిచేసినది బండిని తయారుచేయుటయే.







నెహ్రూ ప్రధాని



రాష్ట్రపతి పట్టాభి



శ్రీ చ. రాజగోపాలచారి
తుది గవర్నర్ జనరల్



శ్రీ సర్దార్ పటేల్
ఉప ప్రధాని

# భారత రాజ్యాంగ చరిత్రము

## .........కొన్ని ముఖ్యలక్షణములు

జనవరి 26 న ప్రారంభం కానున్న నూతన భారతరాజ్యాంగం అనేక విధాల అపూర్వమైనది. దాని ముఖ్య లక్షణ మేమంటే అది పదహారణాల జాతీయత గలది. అదివరలో మన రాజ్యాంగాలన్నీ లండనులో బ్రిటిషు పార్లమెంటువారు తయారు చేశారు. 1935 రాజ్యాంగం రచించకపూర్వం భారతీయులురౌండుటేబిలుసమావేశంలో పాల్గొన్నప్పటికీ ఆ రాజ్యాంగాల నిర్మాణంలో భారతీయులు పాల్గొని ఉండ లేదు. ఈ రాజ్యాంగాన్ని భారతదేశంలో భారతీయులు భారతీయులకొరకు రచించి ఉండటం మనకు చాలా గొప్పవిషయం. ఈ రాజ్యాంగరచనలో ఇతరరాజ్యాంగాల, ముఖ్యంగా బ్రిటిషు అమెరికను రాజ్యాంగాల, తాలూకు మంచి అంశాలను సాధించడానికి కృషి జరిగింది. ఈ అంశాలు ఇండియాకూ, ఇండియా అవసరాలకూ అనుకూలంగా ఉపయోగించుకోబడ్డాయి. ఈ రాజ్యాంగం ప్రస్తుత పరిస్థితులకూ, దేశావసరాలకూ అనుకూలంగా ఉండడం రెండవ ప్రధాన లక్షణం.

రాజ్యాంగంయొక్క ఆశయం ఇండియాను సర్వస్వతంత్ర ప్రజాస్వామిక రాజ్యంగా చెయ్యటమే. ఈ మూడు మాటలకూ ప్రత్యేకప్రాముఖ్యం ఉన్నది. దేశంమీదపైవారికెవరికీ ఎట్టిఅధికారమూ లేదు కనక ఈ రాజ్యాంగం స్వతంత్రమైనది. మన ఉన్నత శాసనసభ లేక పార్లమెంటును దేశంలోని వయోజను లందరూ కలిసి ఎన్నుకొంటారు కనుక ఇది ప్రజాతంత్రంతో కూడుకున్నది.

* * *

ఈ రాజ్యాంగం అమెరికాలోని ఫెడరలు విధానాన్ని అనుసరించిఉంది. ఇందులో ఫెడరలు కేంద్రప్రభుత్వమూ, అర్ధ స్వతంత్ర రాష్ట్ర ప్రభుత్వాలూ ఉంటాయి. శాసనాధికారాలు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు కేటాయించబడతాయి. ఈ అధికారాలు నిర్వచించే

---

చావలి వెంకట హనుమంతరావు

ప్రత్యేక జాబితాలు రాజ్యాంగంలో ఉంటాయి. రాష్ట్రాల స్వాతంత్ర్యం కేంద్రాధికారానికి కట్టుబడిఉండి, తీవ్ర పరిస్థితి ఏర్పడినప్పుడు అధ్యక్షుడు రాష్ట్రాధికారాలను నిలుపుచేయటానికీ, వాటిని తానే స్వయంగా నిర్వహించటానికీ, లేక కేంద్రంచేసే నిర్ణయాలను పాలించమని ఆదేశించటానికీ అధికారం కలిగిఉంటాడు. అందుచేత, సాధారణంగా ఫెడరలువిధానాన్ని అనుసరించే భారత రాజ్యాంగం తీవ్రపరిస్థితిలో కేంద్రీకృత విధానం అవలంబిస్తుంది.

. రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక హక్కులూ, రాజకీయ విధానాలను శాసించే సూత్రాలూ ఉన్నాయి. ప్రాథమికహక్కులు న్యాయబద్ధమై, కోర్టు ద్వారా అమలు జరుపుకోదగినవి. వాటి ద్వారా ప్రజలు వాక్, రచనా, సమావేశ స్వాతంత్ర్యాలూ, సాంఘిక ఒత్తిడినుంచి విముక్తీ, అవకాశస్వాతంత్ర్యమూ మొదలైనవి అనుభవించగలుగుతారు. వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రాతిపదికలైన ఈ స్వాతంత్ర్యాలు అమెరికా రాజ్యాంగం నుంచి తీసుకోబడ్డాయి. అమెరికా రాజ్యాంగంలోలాగ మనకు పత్రికా స్వాతంత్ర్యం లేదుగాని, వాక్, రచనా స్వాతంత్ర్యాలు కలసి పత్రికాస్వాతంత్ర్యమవుతుందని వివరించబడింది. రాజకీయవిధానాలను శాసించే సూత్రాల ప్రకారం భావి ప్రభుత్వాలు సమగ్ర సాంఘిక ప్రజాస్వామ్యంకొరకు కృషి చేసి, ఆర్థికవ్యత్యాసాలకూ, అభివృద్ధి అవకాశాలలో వ్యత్యాసాలకూ తావు లేకుండాచేసి, అందరికీ ఔచితిగల జీవనప్రమాణం ఉండేలాగు చూడాలి. ఈ ఆశయాలు సఫలమయేదీ లేనిదీ ప్రజలపైనా, వారు ఎన్నుకొనే ప్రభుత్వాలపైనా ఆధారపడిఉంటుంది. వియోజకవర్గాలకు తెలివితేటలుండి, ప్రజలు విద్యావంతులూ, వివేకవంతులూ, తమ హక్కులూ, బాధ్యతలూ గుర్తెరిగిన వారూ అయిఉంటే ప్రభుత్వం ఈ విధానాలను అమలుజరపటానికి ఆక్షేపణ ఉండదు.

పాలన నిర్వహించే ప్రభుత్వానికి సంబంధించిన నిబంధనలను మనం బ్రిటను, అమెరికాలనుండి అనుకరించాం. బాధ్యతాయుతప్రభుత్వం బ్రిటిషు రాజ్యాంగానికి చెందినది. అంటే కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఉండే మంత్రివర్గాలు పార్లమెంటుకూ, రాష్ట్రశాసనసభలకూ జవాబుదారీగా ఉంటాయి. ఇది చాలా కాలంగా మనకు ఆచారంగా వస్తున్నదీ, అలవాటైఉన్నదీనూ. అయినప్పటికీ

అమెరికావలెనే రిపబ్లికు, అమెరికాకు ఎన్నుకోబడిన అధ్యక్షుడున్నట్టే మనకూ అధ్యక్షుడు అగ్రపాలనాధికారిగా ఉంటాడు. అయితే అమెరికాలోవలె మనకు అధ్యక్షపరిపాలన ఉండదు. ఎందుచేతనంటే మన మంత్రివర్గాలు శాసనసభకు జవాబుదారీగా ఉంటాయి. అదీకాక మన అధ్యక్షుడు అమెరికాలో వలె నేరుగా ఎన్నుకోబడక పార్లమెంటులోని ఉభయశాసనసభలచేత ఎన్నుకోబడతాడు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించాడన్న నేరంమీద విచారించి తప్ప అధ్యక్షుణ్ణి తొలగించటానికి వీలులేదు. ఈవిధంగా బ్రిటిషు, అమెరికను రాజ్యాంగాలలోని లక్షణాలు మన రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడికూడా మనకు ఆచారంగా వచ్చే బాధ్యతాయుత ప్రభుత్వంకూడా ఉంచబడింది.

ప్రస్తుతం మనదేశానికి కావలసినది స్థిరత్వమూ, దక్షతాగల ప్రభుత్వం కనుక రాజ్యాంగం ఈవిధంగా ఉండటం మంచిదే. వయోజన వోటింగు విధానం ప్రకారం ప్రజలచేత నేరుగా ఎన్నుకోబడి ప్రజలకు జవాబుదారీ కలిగిఉండే ప్రతినిధులు ఏర్పరచే ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఏమీ చేయజాలదు. అయితే ప్రమాదస్థితి ఏర్పడ్డ సమయంలో రాజ్యాధిపతి (అధ్యక్షుడు) దేశక్షేమాన్ని కాపాడటానికీ, దేశంలో గాని బయటగాని అల్లరిలేకుండాచూడటానికీ, పరిపాలన సమర్థంగా సాగించటానికీ తగిన అధికారాలుకలిగిఉంటాడు. అంతర్విప్లవంగాని యుద్ధంగాని కలిగినప్పుడు అధ్యక్షుడు ఆర్డినెన్సులు ప్రయోగించీ, ప్రమాదస్థితిప్రకటించీ కేంద్రానికి సర్వాధికారాలూ కల్పించగలడు. ఈవిధంగా చెయ్యటంవల్ల, ప్రజాస్వామిక ప్రభుత్వాలు సాధారణంగా ఆపత్కర పరిస్థితులలో ప్రదర్శించే దౌర్బల్యానికి అవకాశం లేకుండాపోతుంది. రాష్ట్ర ప్రభుత్వాధికారాలు అధ్యక్షుడు తనవశం చేసుకొన్నప్పుడుకూడా ఆయన తన మంత్రివర్గంయొక్క సలహాలను పాటించవలసిఉంటుంది కనుకా, ఆమంత్రివర్గం పార్లమెంటుకు జవాబుదారీ కలిగి ఉంటుంది కనుకా అధికార దుర్వినియోగానికి సావకాశం ఉండదు.

* * *

న్యాయశాఖను నియమించేది అధ్యక్షుడే అయినప్పటికీ, దానికి పాలనశాఖయొక్క అజమాయిషీ ఉండదు. సుప్రీంకోర్టు దేశానికంతటికీ ఉన్నతన్యాయస్థానంగా ఉండటమేకాక, రాజ్యాంగంలోని నిబం

ధనలుగురించి అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు భాష్యంచెప్పటానికీ, రాజ్యాంగంలో ఉదహరించబడిన ప్రాథమిక హక్కులు రక్షించటానికీ అధికారం కలిగిఉంటుంది. న్యాయశాఖను స్వతంత్రంగానూ, ఉన్నతంగానూ ఉంచటం బ్రిటిషు, అమెరికను రాజ్యాంగాలు రెంటినుంచీ మనం అందిపుచ్చుకున్నాం. ద్విపరిపాలనా వ్యవస్థగల ఫెడరలు రాజ్యాంగాలలో ఇది అత్యవసరం. ఫెడరలు ప్రభుత్వానికీ, కేంద్రీకృత ప్రభుత్వానికీకూడా అవకాశాలుగల మన దేశంలో స్వతంత్రమైన న్యాయశాఖ రాష్ట్రాల హక్కులను కాపాడటమేకాక అధ్యక్షుడు నిరంకుశుడు కాకుండాకూడా చూడకలుగుతుంది.

ఏవిధంగాచూసినా మొత్తంమీద మన రాజ్యాంగం తృప్తికరమైనదే. అది మార్చటానికి వీలుగా ఉండికూడా బిగువు గలిగి ఉన్నది. ఫెడరలు ప్రభుత్వంతో కూడా అవసరం వచ్చినప్పుడు కేంద్రీకృత ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నది. అమెరికాలో అధ్యక్ష పరిపాలనకున్న బలం కలిగికూడా బ్రిటిషు పార్లమెంటు విధానంద్వారా లభ్యమయే సులభ పరివర్తనలకు వీలుకలిగిస్తున్నది. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ, అవసరమైన సాంఘిక ఆర్థికమార్పులకు అడ్డం రాకుండా ఉంటుంది. ఇంతకూ, ఒక ప్రసిద్ధ అమెరికను రాజకీయవేత్త చెప్పినట్టు, ప్రజలు తమ అర్హమైన ప్రభుత్వాన్నే సంపాదిస్తారు. భారతీయులు తెలివిగలవారూ, వివేకవంతులూ, అభ్యుదయకాదులూ అయితే అభ్యుదయకరమైన విధానాలు అవలంబించినవారిని ఎన్నుకొని అభ్యుదయకరమైన ప్రభుత్వం ఏర్పరచుకోగలుగుతారు. వారా పని చేయలేనిపక్షాన అభ్యుదయ నిరోధకమైన ప్రభుత్వం ఏర్పడి నిరంకుశంగా పరిణమించవచ్చు. అందుచేత ఈనూతన రాజ్యాంగాన్ని విజయవంతమయేటట్టు చేసేభారం భారతీయులపై ఉన్నది.



# శాసనసభలు - కాంగ్రెస్ కార్యక్రమం

ఇప్పటి కాంగ్రెస్ కార్యక్రమం శాసనసభలకు మాత్రమే సంబంధించియున్న దనటం నిర్వివాదం, సర్వవిదితం. వెనకటివలె జనసామాన్యంతో నిత్యనిరంతరమైన సంసర్గకాని, నిర్మాణశీలమైన కృషిగాని, త్యాగవిధానముకాని కాంగ్రెసుకు లేవు. అందుకు హేతువు ఏమైనప్పటికి, దాని పర్యవసానమేమైనప్పటికి శాసనసభాకార్యక్రమంతప్ప మరేదీ కాంగ్రెసుకు ప్రకృతంలో లేదు.

ఒక విధంగా ఇది సమంజసమే ననిపించవచ్చును. స్వాతంత్ర్యసంపాదనకు శాసనసభాకార్యక్రమం నిరర్థకమని, స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత తద్భిన్న కార్యక్రమం కూడదని—కనుక ఇప్పుడు శాసనసభాకార్యక్రమమే సర్వస్వమూ ననిపించటం యుక్తమే కావచ్చును.

కాంగ్రెస్ జన్మించినపుడున్నూ శాసనసభాకార్యక్రమమే జపించింది. శాసనధిక్కారం చేయవలసియుంటుందనికాని, ప్రజలకి త్యాగదీక్ష ఇవ్వవలసి ఉంటుందనికాని మొదట్లో కాంగ్రెస్ భావించనేలేదు. బ్రిటిష్ దుష్పరిపాలనవల్ల భారతప్రజానీకం రుసరుసలాడిపోతూఉన్న సంగతి గ్రహించి, 1857 అనుభవం తలుచుకొని, ప్రజల ఈ అసంతృప్తి మళ్ళీ విప్లవమార్గం పట్టకుండా వారించదలచి, అందుకు 'చిమ్నీగొట్టం'గా పనికివస్తుందని కాంగ్రెస్ ప్రతిష్ఠాపనను బ్రిటిష్ ప్రభువులే సంకల్పించి ప్రోత్సహించిన సంగతి సర్వులకు తెలిసిందే. 1885 డిసెంబరు 27 న కాంగ్రెస్ ఓంప్రథమంగా బొంబైలో సమావేశమైచేసినప్పటి తీర్మానాలు శాసనసభలకు సంబంధించినవే. అయితే ఆనాటి శాసనసభలు ప్రజాప్రతినిధిసభలుకావు, అవి ప్రభుత్వనియుక్తసభలు. అట్టివాటిని పూర్తిగా ప్రజాప్రతినిధిమయంచేసినది కాంగ్రెసే ననటానికి ఏమీ సందేహించనక్కరలేదు.

1919 లో సత్యాగ్రహమనే కొత్తరకమైన పోరాటపద్ధతి నుపక్రమించేవరకూ కాంగ్రెస్‌కు శాసనసభల సంస్కరణయున్నూ, బాధ్య-ప్రభుత్వ విధానమున్నూ

'ఆనందదాస'

లక్ష్యముగ ఉండేవి. కాంగ్రెస్ చేసిన ఆందోళనా ప్రచారములవల్ల కొంతవరకు ఈ ఆశయం నెరవేరింది.

కాని ఇంతలో దేశస్థితి చాలామారింది. ప్రభుత్వపు నిరంకుశ విధానమువల్లనే ప్రజలు తీవ్రకార్యక్రమం అవలంబించవలసి వచ్చింది.

1920 లో సహాయ నిరాకరణ కార్యక్రమం వచ్చింది. 1909 మార్లే-మింటో శాసనసభా సంస్కరణలను నిరాకరించని కాంగ్రెసు 1919 మాంట్ ఫర్డ్ సంస్కరణలను తిరస్కరించింది. అయితే శాసనసభా కార్యక్రమానికి అనుకూలమైన పక్షమొకటి కాంగ్రెసులో అప్పటికే ఉంది. ఉన్నప్పటికి తొలుత సహాయ నిరాకరణ కార్యక్రమం స్థిరపడినపుడు ఆ కార్యక్రమాన్ని వ్యతిరేకించటానికి శక్తి చాలకపోయింది. గయా కాంగ్రెసు 1922 లో జరిగేప్పటికి గాంధీగారి ఆరేళ్ళ జైలుశిక్షలోను ఎన్నోనెల్లు గడవలేదు. అప్పటికే కలకత్తా ఏ. ఐ. సి. సి. సమావేశంలో శాసనసభా—అనుకూల ప్రతికూల వర్గాలకు ఘర్షణవచ్చినప్పటికి అది తాత్కాలికంగ నిలిచి గయాకు వాయిదా పడింది. అపూర్వమైన పోరాటపు పద్ధతి ఒకటి సంకల్పించి ఉద్యమించిన గాంధీ మహాత్ముడు జైలులో పడగానే ఆ ఉద్యమం అనాథమైపోయి జంకింది. ఆయన సిద్ధాంతంలో విశ్వాసంకన్న ఆయనమీద భక్తే ఎక్కువగలిగి ఆయన చెప్పిన నిర్మాణ కార్యక్రమం నచ్చని వారికి ఇపుడు వైఫల్యంతోచి అప్పటికి వర్జించిన శాసనసభలే శరణ్యంగా తోచినవి. శాసనసభలను కాదని వాటి వెలుపలినుంచే కాక శాసనసభల లోపల నుంచికూడా ప్రభుత్వంతో పోరాడవచ్చునని, పోరాటమునకు అదిన్నీ ఒక మార్గమని గట్టి అభిప్రాయం ఏర్పడింది. అయినప్పటికీ గయా కాంగ్రెసులో ఈ అభిప్రాయం నెగ్గలేదు.

ఈ అభిప్రాయంగల పెద్దలు సి. ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ, విఠల్ భాయ్ పటేల్. తరువాత తరువాత దేశంలో వచ్చిన మార్పులవల్ల వీరికే బలంకలిగి వీరు స్వరాజ్ పార్టీని—శాసనసభల లోపలనుంచి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ధిక్కరించే వుద్దేశముతో ఏర్పరచడం క్రమేపీ కాంగ్రెసే స్వరాజ్ పార్టీయొక్క శాసనసభా కార్యక్రమాన్ని అవలంబించి నిర్వహించడం, శాసనసభల్లో తొలుత కార్యక్రమం చురుకుగా సాగినప్పటికీ చివర చివరకు దెబ్బతినటం, ఇంతలో 1929—30 లో మళ్ళీ పోరాట - పద్ధతికి బలంవచ్చి ఉప్పు సత్యాగ్రహం రావటం - ఇవన్నీ కాంగ్రెస్ చరిత్రాంతర్గతమైనవే.

* * *

1930 జనవరి 26 న రావీ నదీతీరాన భారతజాతిచేసిన పూర్ణస్వరాజ్యప్రతిజ్ఞ చాలవరకు 1947 ఆగస్టు 15 న నెరవేరి, ఈ 1950 జనవరి 26 న, 20 సంవత్స రాల అనంతరం సంపూర్ణంగా చెల్లుతున్నది. ఈ సందర్భంలో శాసనసభా లేక పార్లమెంటరీ కార్యక్రమాన్నిగూర్చి విచారించుకొనడం మంచిది.

ఈ పైన వ్రాసినదాన్నిబట్టి కాంగ్రెస్ నక్షాలో మూడు పంథాలు కనిపిస్తున్నవి—ఒకటి ప్రభుత్వంతో తలపడి సత్యాగ్రహమార్గాన శాసనధిక్కారం చేయడం; రెండవది అందుకుతగ్గ శక్తిని చేకూర్చుకొనే నిమిత్తము ప్రజలు ప్రభుత్వానికి సాయపడకుండా ఉంటూ స్వయంశక్తిపై ఆధారపడుకొని నిర్మాణ కార్యక్రమం చెయ్యటం; మూడవది అదే ప్రతిఘటనధ్యాసతో శాసనసభలకు ఎన్నికై ఆసభలలోనుంచే ఎక్కువ అధికారంకోసము పాటుబడటం. పోరాటం జరగని సమయంలో, పోరాటానికీ పోరాటానికీ మధ్యాంతరంలో నిర్మాణకార్యక్రమంచేసేవారు అది చేయటమూ, శాసనసభల్లో పనిచేసేవారు అలా చేయటమూ రివాజైంది. ఇదే మనకి కొద్దిగా 1929 కి ముందున్నూ హెచ్చుగా 1930, 32 ఉద్యమాల అనంతరమున్నూ కనిపిస్తుంది.

అయితే అప్పటికి కాంగ్రెసుకు నిర్ణీతమైన శాసనసభా కార్యక్రమం అంటూ ఒకటి ఉందని చెప్పలేము. ప్రజల మొర బల్లగుద్దిచెప్పటం, ప్రభుత్వాన్ని ప్రతిఘటించటంకన్న ఆ కాలంలో వేరేకార్యక్రమంలేదు. కాని అంతకన్న స్పష్టమైన ప్రజానుయుక్తమైన కార్యక్రమం ఉండవలసిన అవసరం 1931 కరాచీ కాంగ్రెస్‌నాటికి బాగా కనబడిఉంది. కాంగ్రెస్‌దృష్ట్యా స్వరాజ్యము అనే మాటకు అర్థతాత్పర్యాదులు ఏమిటో, కాంగ్రెస్ రాజ్యానికివస్తే ఏమిచేస్తానంటుందో, ప్రజలకి ఏ కష్టాలుతొలగిపోయి, ఏ సుఖాలు ఒరగగలవో వివరిస్తూ ఖచితమైన కార్యక్రమం ఒకటి ఏర్పాటైంది. అదిమొదలు కాంగ్రెస్‌యొక్క శాసనసభా కార్యక్రమానికేమి మొత్తంమీద వ్యవహారానికేమి అదేమూలకందంగా వుంటూ వచ్చింది.

1937 లోను 1946 లోను జరిగిన మొత్తం ఎన్నికలల్లో కాంగ్రెస్ పాల్గొన్నప్పుడు ఆయా ఎన్నికల ప్రణాళికలకున్ను పైనచెప్పిన కరాచీ పథకమే ఆధారభూతమైంది. 1937 ఎన్నికల్లో తొలుత 11 ఇంట 6 రాష్ట్రాల్లో మెజారిటీ పార్టీగా గెలిచినమీదటనే తన పార్లమెంటరీ పథకాన్ని అమలుపరిచే అవకాశం కాంగ్రెసుకు లభించింది. ఆపైన రెండూ మూడు రాష్ట్రాలలో మిశ్ర మంత్రివర్గాలు ఏర్పరచి 1939 లో యుద్ధహేతువుచే కాంగ్రెస్ కాడి కిందపడేసేనాటికి ప్రబల

మైనస్థితిలోవుంది. రెండేళ్లు పైచిల్కు రాజ్యం చేసినంతలో ప్రజలకు ఉపకారమైన పనులనేకం వీలైనంతవరకు కాంగ్రెస్ చేయగలిగింది.

1946 ఎన్నికల్లో పాల్గొనికూడా కాంగ్రెస్ 9 రాష్ట్రాల్లో మెజారిటీ పార్టీగా గెలిచింది. తరువాత 1947 లో ఖండమై స్వతంత్రమైన నేటి భరతఖండములోని కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వములు, మంత్రివర్గ పరిపాలితములైయున్న సంస్థానప్రభుత్వములు అన్నీ కాంగ్రెస్ పరమై నడుస్తున్నవి.

ఈ నాడు ఈ విధంగా పరమప్రబలమై కనబడుతున్నది కాంగ్రెసు. ఈ బలం ముఖ్యంగా మంత్రివర్గాల్లోను శాసనసభల్లోనుమాత్రమే కనిపిస్తున్నది. ఆ కైవారానికి బయట వెనకటికివలె ప్రజలను కదల్చగలశక్తి ఓరుపోకుండా ఇంకా కాంగ్రెసులో నిలిచిఉందనటం సత్యదూరమే అవుతుంది. స్వాతంత్ర్యోద్యమం జయప్రదంగా నడుపుతున్నందుకు ప్రజలు కాంగ్రెసంటే ఉన్న అనురక్తిచే పోయిన ఎన్నికల్లో కాంగ్రెసుకు రాజ్యం కట్టబెట్టారు. నిరాఘాటంగా దుర్వారమైన రీతిగా తన కార్యక్రమమును అమలుపరిచే మహావకాశం సుదుర్లభమైనది కాంగ్రెసుకు లభించినది. ఇంతటి సుకృతాన్ని కాంగ్రెస్ ఎలా వినియోగించినదో తర్కించే ముందు పూర్వచరిత్ర కొంచెం ఉటంకించడం మంచిది.

1937 లో కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పడినపుడు సదరు మంత్రివర్గాలమీద కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డుకు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి మంచి అదుపు అజమాయిషీ ఉండేవి. అప్పట్లో కాంగ్రెస్ పెద్దలకు వేరేపనిభారం లేనందుననూ అప్పటి కాంగ్రెస్ మంత్రివర్గాల సత్ప్రవర్తనపై కాంగ్రెస్ పరువూ ప్రతిష్ఠలు దేశవిదేశాల్లో ఆధారపడియున్నందుననూ వారు ఆ మంత్రివర్గాల నడవడిని కాంగ్రెస్ గాడి తప్పకుండా సవిమర్శగా చూచేవారు. ఇందుకు దృష్టాంతాలు అనేకం చూపవచ్చును. కాని 1946 నుంచీ కాంగ్రెస్ పెద్దనాయకులే కేంద్ర మంత్రివర్గానికి స్తంభాలవటంవల్ల కాంగ్రెస్ సంస్థా విధానం తారుమారైంది. ఇంతవరకూ, మళ్ళీ పాటునబడక ఇంచుమించు స్తంభీభూతమైంది. కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాల్లోను సంస్థానాల్లోను వ్యవహరిస్తున్నట్టి కాంగ్రెస్ మంత్రివర్గాలను, పార్టీలను ఓరకంటైనా కనిపెట్టలేకుండా ఉన్నారు. పార్లమెంటరీబోర్డు ఎన్నికల్లోను, ఉపయెన్నికల్లోను కాంగ్రెస్ అభ్యర్థులను నిర్ణయించటం తప్ప మరేవీ చేయనేరని స్థితిలో కాంగ్రెస్ కార్యసంఘం సాధారణ కాంగ్రెస్‌సంస్థనే చక్కదిద్దలేకుండాఉంది. అగ్రనాయకులు అటు ప్రభుత్వ యజమానులూ ఇటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పెద్దలు, పార్లమెంటరీబోర్డు వ్యవహర్తలూ - అన్నీ వారే కావటంతో వారు ఏఒక్కటీ సుష్టుగా చేయలేక పోవటమేకాక తద్దీత్యా కేంద్ర శాసనసభా కాంగ్రెస్ పార్టీని, మొత్తంమీద కాంగ్రెస్ సంస్థను నిర్వీర్య


పరచిన వారౌతున్నారు. ఈనాడు దేశంలో ఉన్నది, కాంగ్రెస్ 'రాజు'లుగాని వర్కర్లు కాదని, ఇది రామరాజ్యంకాదు 'కామ'రాజ్-యం అని లోకోక్తిగా ఉన్నమాట తోసెయ్యటం కష్టం - ఇందుకు హేతువు మంత్రివర్గాల నేర్పరచినట్టి సంస్థయొక్క యాజమాన్యం క్షీణించి మంత్రివర్గాలు అనియతం కావటమే అందువల్ల మంత్రివర్గాల చర్యలను, విధానాలను కాంగ్రెస్ సంస్థ సగర్వంగా సమర్థించుకోలేని దుస్థితికూడా త్వరలోనే రాగలదు. ఈ విధంగా కాంగ్రెస్‌లో జజ్జుతనం వచ్చింది. ఇంతేకాక కాంగ్రెస్‌కు మరొక సంకటంవచ్చింది. అదేమనగా పూర్వ విరోధులను కలుపుకొని స్వంతవారిని ఉపేక్షించటం. అవసరానుగుణ్యంగా ఒకనాటి శత్రువులను చేర్చుకోవలసి వచ్చిందే అనుకున్నా స్వంత వారిని ఉపేక్షించకుండా ఉండవలసింది. కాంగ్రెస్ సంస్థా ప్రవర్తకులైన వారికే నేడు కాంగ్రెసులోనే గణ్యతలేకపోవటం చింత్యం. ఆయా మొదలైన కారణాలన్నిటి వల్లనూ నేడు కాంగ్రెస్ కట్టుదిట్టమైన పార్టీవలె కాక ఉత్సవ మండపంవలె వ్యవహరిస్తున్నది. సంస్థపై పెత్తనమంతా ముగ్గురి నలుగురి హస్తగతమై కేంద్రీకృతమై తదితరులకేమీ ప్రమేయములేని సంగతి గమనార్హము.

ఈ పరిస్థితిలో ఇకముందు దేశానికి పార్లమెంటరీ కార్యక్రమమే రాజకీయార్థిక సాంఘిక క్షేత్రాలలో ప్రధానమైనప్పుడు పోకడ ఎలాఉంటుంది? ఎన్నికల ముగ్గే ఈసారి పూర్తిగా మారుతుంది. ఇంతవరకు స్వాతంత్ర్యోద్యమం మొదలైనవాటి ప్రభావం అలాఉండగా ఓటర్ల బాహుళ్యము, నియోజకవర్గాల విస్తృతీ కాంగ్రెసుకు అనుకూలించినవి. ఈసారి వయస్థులందరికీ ఓటురావటంతో నియోజకవర్గం జనాభా 75 వేలకు లక్షకూ మధ్యఉంటుంది (ఇది రాష్ట్రాలమాట.) ఈ జనాభాలో సగంమంది ఓటర్లవుతారు. దీనికితోడు ఈ పదేళ్ళలోను ముఖ్యంగా యుద్ధానంతరము ప్రజలలో విలసిల్లిన చైతన్యము గమనించవలెను. కొత్త రాజకీయపార్టీ లనేక ఏర్పడగలవు. ఆయాపార్టీలన్నీ నిర్దిష్టమైన పార్లమెంటరీ కార్యక్రమంతో ప్రజలను అనునయించగలవు. అపుడు కాంగ్రెస్‌పని ఎలాగ ఉంటుంది? మిగిలినపార్టీలకు లేని సౌకర్యం కొంత కాంగ్రెసుకు వుంటుంది. అది పూర్వప్రతిష్ఠ. స్వాతంత్ర్యోద్యమం నడిపినకీర్తి, మహాత్ముడు మలచిన సంస్థ అనేపేరు, ఎన్నికలప్పుడుకూడా దేశమంతటా రాజ్యంచేస్తూవున్న ఘనత, వీటన్నిటి ప్రభావాన్ని కాదన వీల్లేదు. కాని కార్యక్రమంమాట ఏమిటి? యావద్భారత - పార్లమెంటు ఎన్నికల్లోను, కొంతవరకు ప్రాంతీయ ఎన్నికల్లోను కొత్తరాజ్యాంగమే కాంగ్రెసుకు ఒకవిధంగా ఎన్నికలప్రణాళిక కాగలదు. స్వతంత్రరాజ్యాంగము స్థిరపరచి ప్రజలకి సమర్పిస్తున్నది కాంగ్రెసేకదా. రాజ్యాంగాన్ని, అందలి జనక్షేమసూత్రాలను అమలుపరిచే అధికారం ఇమ్మని కాంగ్రెస్ అడుగుతుంది. సాధారణంగా పార్టీల ఎన్నికల

ప్రణాళికలలో వుండవలసిన అంశాలు చాలావరకు సూత్రప్రాయంగా రాజ్యాంగంలో ఇమడ్చబడటం ఇతరపార్టీలకన్న కాంగ్రెస్ కే అనుకూలం కావచ్చును. పెద్ద పార్లమెంటు ఇంచుమించుగా కాంగ్రెస్‌మయము కాగలదు. రాష్ట్రాల్లో ఇతర పార్టీలకు ఎక్కువ అవకాశమున్నా రెండు మూడు ప్రాంతాల్లోతప్ప ఇతరత్రా కాంగ్రెస్‌కు తీవ్రప్రతిఘటన వుండదు. ఆ రెండు మూడుచోట్లకూడా కాంగ్రెస్ పదభ్రష్టమై తీరుతుందని చెప్పటం సాహసం. కాని రంగంలోకి కొత్తపార్టీలు ప్రవేశించి నిలబడగల అవకాశం అంత దుర్లభంకాదు.

అయితే ఇంతకూ ఇట్టి పార్టీల బలాబలాలమీద ఆధారపడే శాసనసభలు ఎంతవరకు ప్రజాప్రతినిధి సభలౌను అంటే సరిగా సమాధానం చెప్పటం కష్టం. అవి పార్టీప్రతినిధి సభలవటం నిశ్చయం. పార్టీలు ఎంతవరకు ప్రజల అక్కరలకు కోర్కెలకు ఫలకము లౌను అంటే అది ప్రజలనుబట్టే ఉంటుంది. ప్రజలు దేశవ్యవహారాల్లో కలగజేసుకుంటూ ఉంటే పార్టీలు మెలుకువగానే నడుచుకోగలవు. లేకపోయినట్లయితే క్రిందటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురులేదు, కాంగ్రెస్ ముద్రవేసి పూచికపుల్లలనైనా గెలిపించగలమనిచెప్పి వాస్తవంగా పూచికపుల్లలనే పెట్టి గెలిపించినట్లే మళ్ళీ జరుగుతుంది. రాజ్యచక్రం నడపవచ్చేసరికి ఆ పూచికపుల్లలన్నిటినీ కట్టకట్టినా చాలకపోవటం వాటిలో చాలా పుచ్చటం విరగటం దేశానికి అనుభవమే కదా. కనుకనే నిత్యం ప్రజల జాగరూకత అవసరం. మొత్తంమీద కాంగ్రెసే మళ్ళీ రాజ్యానికిరాగలదనితోస్తే దాన్ని 'అధికారమత్తులకు అర్థదృష్టులకు' వదిలివేయకుండా ప్రజలు దాన్ని తమ సంస్థగాచేసికోటమూ అవసరమే. అనగా బుద్ధిమంతులు, విద్యావంతులు, ప్రజాహితైకజీవులు నిమ్మకు నీరెత్తినట్లు అప్రవర్తకులై కూర్చొనక కాంగ్రెసును చేపట్టవలెను. కాంగ్రెస్ చేసే అభ్యర్థి నిర్ణయాలు ఎక్కడనో నాలుగు గోడల నడుమను, పైవారి ఇష్టానుసారంగా కాక స్థానికప్రజలలో పలుకుబడిగల కాంగ్రెస్‌వాదులను గమనించి చేయునట్లు చూచుట ప్రజలవిధి. తదనుగుణ్యంగా నిబంధనలు నియమములు సవరించుకొనుట కాంగ్రెసుకును దూరదృష్ట్యా అవసరము. ఇందుకు కాంగ్రెస్ నాయకత్వముయొక్క మనస్తత్వములో మార్పురావలెను. లేకపోయిన రేపు కాకున్న ఎల్లుండైనను ముప్పుతప్పదు.

ఈ 65 సంవత్సరములలో ఎన్నోసార్లు కాంగ్రెసు సందర్భానుకూలముగ మారుచు వర్ధిల్లినది. ఈ నూత్న సందర్భములో కాంగ్రెస్ తత్వము మారి కొత్తదారి తొక్కగలదని ఇంకను ఆశించవచ్చును.



# పంచాయితీ ప్రభుత్వం

మహాత్మాగాంధి ప్రబోధించిన రాజకీయ, ఆర్థిక తత్వముల మూల సూత్రము వికేంద్రీకరణ. ప్రజాస్వామిక దేశాల్లోగాని, నియంతృత్వ రాజ్యాల్లోగాని ప్రభుత్వాధికారము, ఆర్థికశక్తి కేంద్రీకృతమై వ్యక్తిస్వాతంత్ర్యానికి తీవ్ర ప్రతిబంధకములుగాను, సామాజిక అభివృద్ధికి ప్రబల శత్రువులుగాను పరిణమించినవి. సుస్థిరప్రపంచ శాంతిస్థాపన, సంరక్షణకు ఈ ప్రతిబంధకములను తొలగించి, ఈ శత్రువులను నిర్మూలించడం అవసరమని శాశ్వత ప్రపంచశాంతిని ఆకాంక్షించు ప్రజాస్వామ్యవాదులు అందరు అంగీకరించారు. ఈ కార్యమును సాధించడానికి గాంధిజీ వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని సూచించారు. ఆ సిద్ధాంతాన్ని అమలుపరచడానికి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. గ్రామ పరిశ్రమల పునరుద్ధరణ, ప్రోత్సాహం ద్వారా ఆర్థికశక్తి ఏఒకవర్గంలోనూ, ఏఒక ప్రాంతంలోనూ కేంద్రీకృతంకాకుండా చేయడానికి మార్గంచూపించారు. ఏనాడు గ్రామాలు ఆర్థికంగా స్వయంపోషకము, స్వయంసమృద్ధము అవుతవో ఆనాటి నుంచీ రాజకీయాధికారంకూడా ఏఒకవర్గపరమూ కాకుండా దేశజనాభాలో నూటికి తొంభైమందిగా ఉన్న గ్రామీణులపరమౌతుంది. యదార్థమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడుతుంది. కనుకనే రాజకీయంగా, ఆర్థికంగా గ్రామాలు అభివృద్ధి చెందితేగాని కాంగ్రెస్ కలలు కన్న కార్మిక, కర్షక ప్రజారాజ్యస్థాపన సాధ్యం గాదని మహాత్ముడు నిరంతరం హెచ్చరించుతూ వచ్చారు.

భారత రాజ్యాంగానికి గ్రామపంచాయితీ ప్రాతిపదికగా ఉండాలని రాజ్యాంగ పరిషత్తులో సభ్యులు సూచించితే రాజ్యాంగరచనాసంఘ అధ్యక్షుడు డాక్టర్ అంబేడ్కర్ పంచాయితీపాలనను తీవ్రంగా విమర్శించారు. భారత దేశపరిస్థితులకు గ్రామప్రభుత్వం పనికిరాదన్నారు. దీనిమీద పరిషత్తులో బ్రహ్మాండమైన దుమారం రేగింది. తరువాత డాక్టర్ అంబేడ్కర్ తమ అభిప్రాయాన్ని మార్చుకోవలసివచ్చింది. పంచాయితీప్రభుత్వాన్ని పరిగణించక తప్పిందిగాదు.

భారతదేశంప్రధానంగా వ్యావసాయిక దేశంఅనీ, మొత్తంజనాభాలో నూటికి తొంభైమంది పల్లీయులుఅనీ అంగీక

రించినపుడు గ్రామాలను రాజకీయంగా గాని, ఆర్థికంగా గాని అలక్ష్యంచేయడం సాధ్యంగాదు. ప్రజాస్వామ్యం జయప్రదంకావాలన్నా, ప్రజాస్వామికవిధానం ఫలప్రదంకావాలన్నా ప్రజలకు రాజకీయార్థిక వ్యవహారాల నిర్వహణలో శిక్షణ ఇవ్వడం అవసరం. నూతన రాజ్యాంగంప్రకారం వయోజనులందరికీ వోటుహక్కు లభించింది. ఆ సిద్ధాంతాన్ని ఆధారంచేసుకొనే మన స్థానిక స్వపరిపాలనామంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు పంచాయితీరాజ్యాన్ని స్థాపించడానికి పూనుకున్నారు. ఈ కొత్తశాసనాన్ని అనుసరించి స్థానిక సంస్థలకు — అంటే పంచాయితీలనే భావించాలి—యదార్థమైన స్వపరిపాలన లభించుతుంది. ఏ గ్రామానికి ఆగ్రామం ఒక ప్రభుత్వంగా ఏర్పడుతుంది. పంచాయితీలు ఈవిధంగా అభివృద్ధి చెందినప్పుడు ఇప్పటి జిల్లాబోర్డులు నిరర్థకమౌతవి. ప్రతితాలూకాకు ఒకపంచాయితీ కౌన్సిలూ, ప్రతిజిల్లాకు ఒక కేంద్ర పంచాయితీ కౌన్సిలూ ఏర్పాటై మొత్తం జిల్లా అవసరాలను విచారించి వాటిని తీర్చడానికి పనిచేయవచ్చును. ఈ తాలూకా, జిల్లాపంచాయితీలకు సభ్యుల ఎన్నికలు వెనుకటి తాలూకాబోర్డులకూ, ఇప్పటి జిల్లాబోర్డులకూ జరిగినట్లుగాక పంచాయితీలనుండే జరగడం మంచిది. జిల్లాపంచాయితీసంఘాల్లో పురపాలక సంఘాలకూ ప్రాతినిధ్యం ఉండాలి. ఈవిధంగా పరిపాలనాధికారం ఒక రాష్ట్రప్రభుత్వంలోనే కేంద్రీకృతమై ఉండక సామాన్య ప్రజాసంఘాలకూ పంపకమై భారతీయపౌరులు యావన్మందికీ పరిపాలనానుభవం కలగడమే గాక, స్వతంత్ర భారత పౌరుల హక్కులతోబాటు బాధ్యతలు, విధులుకూడా గ్రహింపుకు వస్తవి. గ్రామంలో ఒక పాఠశాలపెట్టుకోవాలన్నా ఒక చికిత్సాలయాన్ని స్థాపించుకోవాలన్నా రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆధారపడిఉండవలసిన దుస్థితిపోయి తమ గ్రామావసరాలను తామే తీర్చుకోకలుగుతారు.

గ్రామ రిపబ్లిక్‌లు మనదేశానికి కొత్తగాదు. కారల్‌మార్క్సు, బెడన్‌పవల్ ప్రభృతులు ఈ ప్రాచీనభారత సాంఘిక వ్యవస్థను ఎంతగానో ప్రశంసించారు. ఆ సాంఘిక వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా వర్గరహిత ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపనకు ప్రాతిపదిక వేయవచ్చు. ఈ స్థానిక స్వపరిపాలనా సంస్థల విషయంలో ఎక్కువ పరిశోధనలు చేసిన డాక్టర్ రాధా కుముద్‌ముఖర్జీ, భారతసంస్కృతి వ్యక్తిత్వాన్నీ, స్వాతంత్ర్యాన్నీ నిలబెట్టడానికి ఈ స్థానిక సంస్థలు ప్రాచీన

కాలంలో ఎంతగానో ఉపయోగపడినవని ఋజువుచేశారు. ప్రాచీన భారతీయ సంస్కృతిని పునరుద్ధరించడానికి ప్రబలంగా ప్రయత్నాలు జరుగుతూన్న ఈ రోజుల్లో ఆ స్థానిక స్వపరిపాలనా సంస్థలను తిరిగి ఏర్పాటుచేయడం ఎంత అవసరమో ప్రత్యేకం విచారింప నవసరం లేదు.

ప్రిన్సిపాల్ శ్రీమాన్ నారాయణ్ అగర్వాల్ స్వతంత్రభారతానికి గాంధీయ రాజ్యాంగాన్ని తయారుచేశారు. భారత రాజ్యాంగానికి గ్రామపంచాయితీలే పునాదిగా ఉండాలని వారివాదన. ఈ పంచాయితీలు ఎన్ని ఆర్థికసంక్షోభాలనో ఎదుర్కొని నిలబడకల్గినవి. ఎన్నిరాజకీయ వెల్లువలనో తట్టుకొని నిలబడినవి. 1908 వ సంవత్సరంలో గాంధిమహాత్ముడు తయారుచేసిన 'హింద్ స్వరాజ్' పంచాయితీపరిపాలనా పద్ధతినే సమర్థించింది. డాక్టర్ అనీబెసెంట్ కూడా భారత దేశ భవిష్యద్రాజ్యాంగానికి గ్రామపంచాయితీపద్ధతే ప్రాతిపదికగా ఉండాలని సూచించింది.

గాంధిమహాత్ముడు వాంఛించినంతగా నూత్నరాజ్యాంగాన్ని అనుసరించి రాజకీయ, ఆర్థికఅధికార వికేంద్రీకరణ జరక్కపోయినా ఆ లక్ష్యసిద్ధికి ఈనాడు అమలుకువచ్చిన భారతరాజ్యాంగం ఒక సాధనగా ఉపయోగపడుతుంది.

అలాగని నేటి మనరాజ్యాంగం అన్నివిధాలా ఆదర్శప్రాయంగా ఉన్నదని ఎవ్వరూ చెప్పజాలరు. రాజ్యాంగం ఎలా ఉన్నా, ఆ రాజ్యాంగాన్ని అమలుచేసేవారు భారతప్రజానీకపు క్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని పరిపాలించకపోతే ప్రయోజనం ఏమీ ఉండదు. వయోజన వోటింగ్‌పద్ధతివల్ల ఏర్పడే ప్రభుత్వం వాస్తవమైన ప్రజాప్రభుత్వం కాకపోతే అందుకు ప్రజలే బాధ్యత వహింపవలసి ఉంటుంది. నిరక్షరాస్యత పూర్తిగా నిర్మూలనమై ప్రజలు తమ విధులను, సంఘంయెడ తమ బాధ్యతలనూ గ్రహించకపోతే నవయుగం కూడా పాతయుగంలాగానే ఉంటుంది. ఈ ప్రమాదాన్ని పంచాయితీలే నివారింపగలవు. సమర్థమైన, లోపరహితమైన పంచాయితీలను స్థాపించితే భారతరాజ్యాంగంలో ఎన్నిలోపాలున్నా ప్రభుత్వం సక్రమంగా ఉంటుంది. కనుక పంచాయితీ ప్రభుత్వస్థాపనే మన అందరి కర్తవ్యం.





# భారత రిపబ్లికు ప్రభుత్వ చిహ్నము

నేటివరకు ప్రభుత్వ భవనాల సామగ్రులమీద "కిరీట" ముద్రిక ప్రభుత్వ చిహ్నంగా ఉంటున్నది. కాని, 1950 జనవరి 26 నుండి సారనాధునందలి సింహతలాటముద్రికా ప్రతిరూపమే మన రిపబ్లికు ప్రభుత్వ చిహ్నముగా వుంటుంది.

ఈ ప్రభుత్వ ముద్రిక భారతదేశ ప్రాచీన విజ్ఞాన సంస్కృతికి చిహ్నమై వుంది.

ఇప్పటికి ఆ స్తంభముమీద సింహముల శిరస్సులు చూడవచ్చు. ఆ స్తంభశిఖర ప్రతిరూపమే నేటి మన ప్రభుత్వ ముద్రిక.

ఈ శిఖరమున మూడు సింహముల తలలు ఉన్నాయి. ఈ మూడునూ ఒక దిమ్మ పైభాగంగా చెక్కబడినవి. ఆ దిమ్మపై మధ్యలో వుంది ధర్మచక్రం. ఆ చక్రమునకు కుడివైపు ఒక ఎద్దుతల ఎడమవైపు గుర్రపుతలయున్ను కలవు. ఆ స్తంభశిఖరంమీద దిమ్మక్రింద ఘంటాకృతిగా చెక్కబడిన పద్మము మన రిపబ్లికువదలివేసింది. 'సత్యమేవజయతి' అను వాక్యం సింహతల మకుటముక్రింద ఏర్పరచారు. ముండకోపనిషత్తులోనుండి ఉద్ధృతమైన గాంధీమహాత్ముని ముఖ్య ధర్మసూత్రములలో నిదియొకటి. ఇది

సర్వమతాంగీకార యోగ్యమైనది. సారనాథుని ఈ స్తంభము క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దమునుండి కలదు. భారత చరిత్రలోనే గాక ప్రపంచ చరిత్రలో సైతమూ అఖండవిఖ్యాతి గాంచిన యశోమూర్తి అశోక చక్రవర్తితో సంబంధంకల్గినది. ప్రపంచచరిత్రలో ఉదహరింపబడిన వేలాది రాజులలో రాజపరమేశ్వరులలో విష్ణ్వంశ సంభూతులలో చక్రవర్తులలో అరివీరభయంకరులలో అశోకుని పేరు దేదీప్యమానమగు దివ్యతారలా వెలుగొందుచున్నదని హెచ్. జి. వెల్సు వ్రాశారు.


అశోకుని పరిపాలనాకాలము భారతదేశ చరిత్రలో ప్రపంచవిఖ్యాతిగలది. "ఆ కాలములో భారత రాయబారులు సామ్రాజ్య ప్రతిష్ఠాపనకు గాని, సామ్రాజ్యకాంక్షతో గాని ఇతర దేశాలకు పోలేదు. శాంతిదూతలుగా, భారత విజ్ఞాన ప్రచారకులుగా, సద్భావ ప్రబోధకులుగా వెళ్ళిరి," అంటూ పండిత నెహ్రూ తన ప్రపంచచరిత్రలో వ్రాశారు.


బుద్ధుడు మొట్టమొదట అహింసా సూత్రమును దయాధర్మమును ప్రపంచమున నలుముఖముల వ్యాపింప బోధించిన పవిత్రప్రదేశ మిదేయని సూచించుటకు యీ సింహాముఖముల స్తంభము ప్రతిష్ఠింపబడిందిట.

అఖిల ప్రపంచశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వము భారతదేశపు మహోత్కృష్ట లక్ష్యములని భారత రిపబ్లికు ప్రభుత్వ ముద్రికగా యీ సారనాథ సింహాముఖ స్తంభ చిహ్నము స్వీకరింపబడినది. భారతీయ ప్రాచీన ప్రాభవమును, సహనభావమును, గాంధిమహాత్ముని ఉపదేశములను శిరసావహించుటకు భారతదేశము కృతనిశ్చయమైనది. ఈ స్థిరసంకల్పమునకీ ముద్రిక అనుగుణముగానున్నది.

ఆ స్తంభాగ్ర పీఠమున వున్న ధర్మచక్రం న్యాయపరిపాలనా చిహ్నం. ధర్మము రాజులను శాసించెడి రాజు - చక్రవర్తులైనను దానికి తలయొగ్గవలెను.

ఈ ధర్మచక్రము భారతజాతీయ పతాకముమీదకూడా కన్పించును.




ఇండియన్ రిపబ్లిక్ - స్వరూపం
కాశ్మీరు
టిబెట్
నేపాలు
భూటాన్
అస్సామ్
రాజస్థానం
వింధ్యప్రదేశం
బీహారు
పాకిస్థానం
కలకతా
మధ్యపరగణాలు
బీరారు
ఒరిస్సా
హైదరాబాదు
మైసూరు
కొచ్చిన్
సౌరాష్ట్రము
అరేబియా సముద్రము
వంగాళాఖాతము
సింహళం

# నవభారతం - సంస్థానాలు

స్వతంత్ర భారతప్రభుత్వం, అధినివేశస్థాయిలో వుండగా సాధించిన విషయాలలో మహత్తరమైనది సంస్థానాల విలీనీకరణమేనని చెప్పాలి. గత రెండున్నర సంవత్సరాలలోను భారతప్రభుత్వ సంస్థానశాఖ పనిచేసినంత చురుకుగా, ఫలప్రదముగా ఇతరశాఖలుగూడ పనిచేసివున్నచో ఈనాడు భారతదేశమెంతో సౌభాగ్యవంతముగ నుండెడిదనుట నిస్సంశయము. 1947 ఆగస్టు 15వ తేదీకి పూర్వము లీలగా సూచించుటకుకూడ అసాధ్యములుగ కన్పట్టిన విప్లవాత్మక మార్పులు, ఒకదానివెనుక నొకటి త్వరత్వరగ సాధ్యమై, భారతదేశ చరిత్రలో ఇదివరకెన్నడు కని, విని ఎరుగనంతటి సంఘటన, ఐక్యత చేకూరినవి.

బ్రిటిష్ పాలన కాలములో భారతరాజకీయాలలో స్వదేశ సంస్థానాలు ఎప్పుడూ కృత్రిమ ప్రాధాన్యత వహిస్తూ, బ్రిటిష్‌వారి మనుగడకు, దోపిడీ విధానానికి సహాయపడుతుండేవి. భారతజాతిలో స్వాతంత్ర్యేచ్ఛ వ్యాపించి, ప్రబలినకొద్దీ ఆ జాతీయభావాలను అణగద్రొక్కటానికి బ్రిటిష్‌ప్రభుత్వంకన్న సంస్థానాధీశ్వరులే ఎక్కువ కఠినంగా ప్రవర్తిస్తుండేవారు. బ్రిటిష్ ఉద్యోగుల అడుగులకు మడుగులొత్తకపోతే తమ నరేంద్రత్వంకు స్వస్తిచెప్పబడుతుందనే భయంతో కొంతకాలమూ, బ్రిటిష్‌వారుపైదొలగితే తమ మనుగడకే ముప్పువాటిల్లుతుందనే భయంతో కొంతకాలమూ. సంస్థానాధీశ్వరులు బ్రిటిష్‌సామ్రాజ్య నిరంకుశత్వాన్ని పెట్టనిగోడలవలె రక్షించారు. బ్రిటిష్ ప్రభుత్వంకూడ సంస్థానాధీశ్వరులను అనేకవిధాలుగా రక్షిస్తూ, ఉపయోగించుకుంటూండేది. మొత్తంమీద, భారతదేశ రాజకీయ పురోభివృద్ధికి, బ్రిటిష్‌కాలంలో, సంస్థానాధీశ్వరులు వీలైనన్ని ఆటంకాలు కలిగిస్తుండేవారు.

కాలపరిస్థితులవల్ల రవి అస్తమించని బ్రిటిష్‌సామ్రాజ్యం అస్తమించటం ప్రారంభించింది. భారతదేశం స్వతంత్రమైతే సంస్థానాలస్థాయి, సంస్థానాధీశ్వరుల

సీతంరా[illegible] సుబ్రహ్మణ్యశర్మ

హోదా ఏమిటన్నే ప్రశ్న జనించింది. తమను నమ్ముకునివున్న సంస్థానాధీశ్వరులను నిస్సహాయులను చేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యప్రదానం జరగగానే, సంస్థానాలపై తమ సార్వభౌమత్వం అంతరిస్తుందని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. అంతటితో భారతదేశం ఇండియా, పాకిస్థాన్‌లుగా రెండుగా గాక దాదాపు 600 ముక్కలుగా విభాగమై, విచ్ఛిన్నమైపోగల ప్రమాదం ఏర్పడింది. కాని భారతదేశం ఇంతగా విచ్ఛిన్నమైపోవటంగాని, అవిచ్ఛితికి కారకులని తాము నిందమోయటంగాని బ్రిటిష్‌వారికి ఇష్టంలేకపోయి, భారత సంస్థానాలు సూత్రప్రాయంగా సర్వస్వతంత్రములైనా వాటి స్వాతంత్ర్యాన్ని తాము గుర్తించమనీ, ఇండియా, పాకిస్థాన్‌లలో భౌగోళిక పరిస్థితుల ననుసరించి, సంస్థానాలన్నీ జేరిపోవలసిందేనని ఆదేశించారు. సంస్థానాధీశ్వరులుకూడ మార్పు జెందిన పరిస్థితుల నవగాహన చేసుకుని, తమ మనుగడ తమ ప్రజలపైన, నూతనంగా స్వాతంత్ర్యాన్ని పొందుతున్న అధినివేశాలపైన ఆధారపడివున్నదని గ్రహించుకుని, భౌగోళికంగా సంశ్లిష్ట రాష్ట్రాలలోజేరి, అధికారదత్తత పత్రికలపై సంతకాలు చేశారు. భౌగోళిక పరిస్థితుల నెదిరించిన జునాగఢ్ నవాబు, కులప్రభావాన్ని విస్మరించిన నిజాంనవాబు, బ్రిటిష్‌ప్రభుత్వ సూత్రప్రాయ ప్రకటనవల్ల మోసపోయిన తిరువాన్కూరుప్రభువు, ఉభయులను మోసగించి తాను లాభం పొందవచ్చునని పన్నాగం పన్నిన కాశ్మీర్‌మహారాజ, త్వరలోనే తమతప్పు తాము తెలుసుకుని, ముందుజాగ్రత్త పడివుండటమే మంచిదైనదని ఇతర సంస్థానాధీశ్వరులకు సంతృప్తికలిగించారు.

1947 ఆగస్టు 15 వ తేదీన, ఇండియా, పాకిస్థాన్‌లు స్వతంత్రమైననాటికి, జునాగఢ్, హైదరాబాద్, కాశ్మీరులు మాత్రమే ప్రశ్నార్థకాలుగా వున్నవి. జునాగఢ్ అటు తర్వాత పాకిస్థాన్‌లో జేరినఉపాఖ్యానము, మహాఘనత వహించి, సర్వస్వతంత్రుడైన నిజాం కడుంగడు వెతజెంది పశ్చాత్తప్తుడైన ఆశ్వాసము, మతోన్మాదానికీ, స్వేచ్ఛా, జాతీయభావాలకు కాశ్మీర్ పర్వతాలలో జరుగుతున్న ముష్టాముష్టి యుద్ధపర్వము నవభారతము నెట్లు రక్తికట్టించినది భవిష్యత్తులో చరిత్రకారులు నిర్ణయించగలరు.

ఇండియా, పాకిస్థాన్ అధినివేశాలలో జేరేటప్పుడు దఖలుపరచిన రక్షణ, రాకపోకలు, విదేశ వ్యవహారములనెడు మూడు అధికారములే గాక, సార్వభౌ

మహాధికారము క్రింద బ్రిటిష్‌వారు చలాయించిన అధికారములన్నీ చలాయించు టకు వీలుగా, ఆయా సంస్థానాలు, ఆయా ప్రభుత్వాలతో ప్రత్యేక 'యధాతథపు' ఒడంబడికలు చేసుకున్నవి. అందువలన, బ్రిటిష్ ప్రభుత్వం వైదొలగి, భారతదేశం స్వతంత్రమైన తర్వాత సంస్థానాల స్థాయిలో ఎట్టిమార్పు రానేలేదు; సంస్థానాలను గురించి మొదట్లో కలిగిన భయము అనవుసరమని తేలిపోయింది.

భారతదేశంలో సర్వస్వతంత్ర ప్రజాప్రభుత్వం ఏర్పడటం సంస్థానాల ప్రజలపై ఎక్కువ ప్రభావాన్ని ప్రసరింపజేసింది. సంస్థానాధీశ్వరుల నిరంకుశ పరిపాలన అంతమొదించి, తాముకూడ ప్రజాప్రభుత్వా లేర్పరచుకోవాలని, వీలైనచో 'సంస్థాన' ప్రాంతమనే కృత్రిమ విభేదాన్నే అంతమొందించాలని, సంస్థానాల ప్రజలలో తీవ్రమైన సంచలనం ప్రారంభమైంది. మైసూర్ సంస్థానంలో బాధ్యతా యుత ప్రజాప్రభుత్వ స్థాపనకొరకు సత్యాగ్రహం జరిగి, ప్రజలు జయంపొందారు; కొన్ని ఒరిస్సా సంస్థానాలలో, ముఖ్యంగా నీలగిరి సంస్థానంలో, సంస్థానాధీశ్వరులు ప్రజాఉద్యమ ధాటికి తాళలేక పారిపోవలసివచ్చింది. 1947 డిశెంబరు లోగానే సంస్థానాధీశ్వరులలో అత్యద్భుత మానసిక పరివర్తన జరిగింది. పెద్దపెద్ద సంస్థా నాధీశ్వరులందరు తమ సంస్థానాలలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వా లేర్పరచి, తమ మనుగడను స్థిరమొనర్చుకున్నారు. చిన్నచిన్న సంస్థానాల ప్రభువులు తమ భవిష్యత్తునుగురించి మిక్కిలి భయపడటం ప్రారంభించారు. ఒరిస్సా, సి. పి. సంస్థానాలు ఒక కూటమిగా ఏర్పడి, శాంతిభద్రతల రక్షణకొరకు కృషిచేయాలని ప్రయత్నించాయిగాని ఆ కూటమికూడా ప్రజాఉద్యమాల ధాటికి తాళదని అప్పుడే తెలిసిపోయింది. ఇక గత్యంతరంలేక, ఏ విధంగానైనా తమ స్వంత ఆస్తులు, హక్కులు, బిరుదులు, హోదాలు రక్షించుకుంటే చాలునని గ్రహించి, సంస్థానాల పరిపాలనను భారతప్రభుత్వానికి, తద్వారా ప్రజలకు వప్పగించటానికి, చిన్నచిన్న సంస్థానాల ప్రభువులు సిద్ధపడ్డారు. తలవని తలంపుగా లభించిన ఈ అవకాశాన్ని భారతప్రభుత్వం సంతోషపూర్వకంగా స్వీకరించి పూర్తిగా వినియోగించుకున్నది. సంస్థానాల ఏకీకరణ ప్రారంభమైంది.

ముందుగా ఆలోచించి నిర్ణయించిన ప్లాను లేకుండానే సంస్థాన ఏకీకరణ జరగకపోయినా, ఈ ఏకీకరణ రెండుమార్గాల ననుసరించి జరిగిందని చెప్పవచ్చును. చుట్టూ రాష్ట్రభూభాగంచేత ఆవృతమైవుండి, అన్నివిధాల సంశ్లిష్టరాష్ట్రంతో

సంబంధాలుకలిగివున్న చిన్నచిన్న సంస్థానాలు, ఆయాసంశ్లిష్టరాష్ట్రాలతో కలిపి వేశారు. వీటి ప్రభుత్వాధికారం, నామమాత్రంగా, కేంద్రప్రభుత్వం వప్పజెప్పుకుని, అటుతర్వాత ఆ అధికారాన్ని రాష్ట్రాలకు వప్పగించింది. ఈవిధంగా, రాష్ట్రాల మధ్యవున్న సంస్థానాలు ఆయారాష్ట్రాలతో లీనమైపోవటంవల్ల రాష్ట్రాల అభివృద్ధి పథకాలు పూర్ణరూపంలో తయారుచేయటానికి వీలవటమేగాకుండా, ఒరిస్సాలాంటి చిన్నరాష్ట్రాల భూభాగం చాలపెరిగి, వీటి ఆర్థిక పటుత్వాన్ని వృద్ధిచేసింది. మొత్తం 229 సంస్థానాలు అన్నిరాష్ట్రాలలోను లీనమైపోయాయి. కొల్హాపూర్, బరోడాలలాంటి పెద్దసంస్థానాలుకూడా ఇదేవిధంగా సంశ్లిష్టరాష్ట్రాలలో కలిశాయి.

రాష్ట్రభూభాగంచేత ఆవృతంకాకుండా, ఒకదానిప్రక్క నొకటిగావున్న సంస్థానాలను చేర్చి, సంస్థానయూనియన్‌లుగా ఏర్పరచటముకూడా జరిగింది. ఇటువంటి సంస్థానయూనియన్‌లు మామూలు రాష్ట్రములంత విస్తీర్ణము, జనాభా, ఆదాయము కలిగివుండి, పరిపాలనాసౌలభ్యము, అభివృద్ధికి దోహదకరములుగా వుండును. సామాన్యముగా చిన్నసంస్థానముల ఆదాయములో ఎక్కువభాగము ప్రభుభరణము, పరిపాలనలక్రిందనే ఖర్చయిపోవును. ప్రభువులభరణము నిర్ణయించి అనేకసంస్థానముల నేకపరిపాలనక్రిందకు తెచ్చుటవలన, పరిపాలనావ్యయము తగ్గి, అభివృద్ధికార్యములకు సొమ్ము మిగులుటకు వీలుకలిగినది. దేశమందలి ప్రాంతీయ ప్రభుత్వముల సంఖ్య తగ్గుటవలన రక్షణ, అభివృద్ధికార్యములు చురుకుగ సమన్వాయపరచి, జరపించుటకు, కేంద్రప్రభుత్వము ఫలప్రదముగ అజమాయిషీచేయుటకు వీలుకలిగినది. ఈవిధముగ 298 సంస్థానములు కలిసి ఆరు సంస్థానయూనియన్‌లుగ ఏర్పడినవి. మత్స్యయూనియన్‌ను తదుపరి చీలదీసి, రెండు సంస్థానములను రాజస్థాన్‌లోను, రెండు సంస్థానములను యు. పి. రాష్ట్రములోను కలిపి వేసిరి. (చూ. పట్టిక 1.) జోద్‌పూర్, జైపూర్, తిరువాన్కూర్‌లవంటి పెద్దసంస్థానములు కూడ తమ ప్రత్యేక అస్తిత్వమును విడనాడి సంస్థానయూనియన్‌ల స్థాపనకు దోహదముచేసినవి. కీలకస్థానమునందుండుటవలన, ఇతర ప్రత్యేకకారణములుండుటవలన కచ్, హిమాచలప్రదేశ్, భోపాల్ మొదలగు కొన్నిసంస్థానములు నేరుగా కేంద్రప్రభుత్వాధిపత్యముక్రిందనే తీసుకొనబడి, చీఫ్-కమిషనర్ రాష్ట్రములుగా పాలించబడుతున్నవి.

సంస్థాన ఏకీకరణ ఒక ప్లానుప్రకారము జరగలేదు. ఏకీకరణకు ఏర్పాట్లు ముందుగా ఆలోచించి, సక్రమముగ జరిగివుండలేదు. ఒకమూల, ఒకమారు ప్రారంభమైన ఈ ఏకీకరణోద్యమము తుఫానువలె దేశమునంతను త్రుటికాలములో ముంచెత్తినది. అందువలన ఏకీకరణ కార్యముకన్న దాని అనంతరపరిస్థితుల చక్కబరచి, ఏకీకరణను స్థిరము, సౌభాగ్యవంతము, సుఖప్రదముజేయుట ముఖ్యకార్యమైనది. సంస్థాన ఏకీకరణవలన అనేక ముఖ్యసమస్య లుత్పన్నమైనవి. వీనిని జయప్రదముగ పరిష్కరించుట నెమ్మదిగ జరుగగల పని. మరికొన్ని ఏండ్లవరకు సంస్థానశాఖ ఇప్పుడు సాధించిన ఏకీకరణ విజయమును స్థిరపరచి, పదిలమొనర్చుకొనుటయందే నిమగ్నమైయుండవలసివచ్చును.

ఆదిలో, భారతయూనియన్‌లో జేరినప్పుడు సంస్థానములన్నియు రక్షణ, రాకపోకలు, విదేశ వ్యవహారములనెడు మూడువిషయములపై అధికారమునే వీరు కేంద్రప్రభుత్వమునకు దఖలుపరచినవి. కొన్ని సంస్థానములుసంశ్లిష్ట రాష్ట్రములలో కలసిపోవుటవలన,అవి రాష్ట్రప్రభుత్వముల భూభాగములై పోయినవి. వానిపైకేంద్రప్రభుత్వమునకు సర్వాధికారములు లభించెను. సంస్థాన యూనియన్‌లుగాఏర్పడిన సంస్థానములు మాత్రము పైమూడు అధికారములను మాత్రమే కేంద్రప్రభుత్వమునకు దఖలుపరచుటవలన, వానిస్థాయికి, రాష్ట్రములస్థాయికి ఎక్కువ తేడావుండి కేంద్రప్రభుత్వము రాష్ట్రములపై చలాయించుచున్నంతటి యధికారము సంస్థాన యూనియన్‌లపై చలాయించుటకు వీలులేకపోయినది. కేంద్రప్రభుత్వచట్టములు కొన్ని కొన్నిప్రాంతములలో అమలుజరగనే జరగనిస్థితి ఏర్పడినది. ఈపరిస్థితి తొలగించి, దేశమంతటిపైన కేంద్రప్రభుత్వమునకు ఒకేమోస్తరు అధికారముండునట్లు చేయుట అవుసరమని గుర్తించినవెంటనే, సంస్థాన యూనియన్‌లుకూడ, ఒక పన్నువిధింపు విషయమునతప్ప, రాష్ట్రములస్థాయికి రావలెనని నిర్ణయించిరి. ఈనిర్ణయము ప్రకారము సంస్థాన యూనియన్‌లు కేంద్రప్రభుత్వమునకు ఎక్కువ అధికారమును దఖలుపరచి, తమ అధికారములను సంకుచితపరచుకొనవలసియున్నది. తొలిగా రాజాస్థాన్ యూనియన్ ఇందుకు అంగీకరించినది. అటుతర్వాత ఏర్పడిన యూనియన్‌లు, అంతకుముందేర్పడిన యూనియన్‌లుకూడ క్రమేణా దారికివచ్చి, కేంద్రప్రభుత్వ శాసనములు దేశమంతట ఒకేవిధముగ నమలు జరుగుటకు వీలుకలుగజేసినవి.

భారతయూనియన్‌లో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వమేర్పడగానే, పెద్ద సంస్థానములన్నిటిలోను ప్రజాప్రభుత్వము లేర్పరుచుటకు, సంస్థానాధీశ్వరులే అంగీకరించిరి. చిన్నసంస్థానములు రాష్ట్రీములలో కలిసిపోయినప్పుడు వాటి పరిపాలన ప్రజాప్రతినిధుల చేతులలోనికే వచ్చెను. ఇక మిగిలివున్నది సంస్థాన యూనియన్‌లు. సంస్థానయూనియన్‌లు ఏర్పడునప్పుడు, వాటి పరిపాలన బాధ్యతాయుత ప్రజాప్రతినిధులే నిర్వహించవలెనని, ఐక్యమగుచున్న సంస్థానముల అధీశ్వరులు తమలోతాము ఒక రాజప్రముఖ్‌ను, ఉపరాజప్రముఖ్‌ను ఎన్నుకొనవలెనని, వారి అధికారములు దాదాపు రాష్ట్రీ గవర్నర్‌ల అధికారములను పోలియుండవలెనని, సంస్థానయూనియన్‌ల రాజ్యాంగచట్టములను తయారుచేయుటకు ప్రత్యేక రాజ్యాంగపరిషత్తులు ఏర్పరచవలెనని కేంద్రప్రభుత్వము షరతులుపెట్టి అంగీకరింపజేసెను. అందువలన సంస్థానములన్నిటిలోను అధికారము ప్రజాపరమైనది. రాజులు నామమాత్రులైరి. సంస్థాన రాజ్యాంగ చట్టమును రచించుటకు మైసూర్ సంస్థానమందొక రాజ్యాంగ పరిషత్తుకూడ ఏర్పడినది. భారతరాజ్యాంగ పరిషత్తు కార్యకలాపమునే ఈ రాజ్యాంగపరిషత్తు తిరిగి జరుపవలసివచ్చునని వెంటనే గుర్తించిరి. ఈవిధముగ ప్రతిపెద్ద సంస్థానమునకు, సంస్థాన యూనియన్‌కు రాజ్యాంగపరిషత్తు నేర్పడిన వాటికగు వ్యయమధికమగుటయేగాక అవి క్రొత్తగా చేయగల్గినపని శూన్యమేనని తేలిపోయినది. పైగా సంస్థానములన్నీ రాష్ట్రీల స్థాయికే వచ్చినప్పుడు వాటి రాజ్యాంగచట్టము కేంద్రరాజ్యాంగపరిషత్తు నిర్ణయించుట సమంజసము. లాభదాయకము కూడాను. కాబట్టి రాష్ట్రీ రాజ్యాంగముతోపాటు, నమూనా సంస్థాన రాజ్యాంగమునుకూడ రాజ్యాంగపరిషత్తు రచించవచ్చునని, దానిని అన్ని పెద్దసంస్థానములు, సంస్థాన యూనియన్‌లు ఆమోదించవచ్చునని నిర్ణయించి, ప్రత్యేక రాజ్యాంగపరిషత్తులు ఏర్పాటుచేయడం మానివేశారు. ఈనాడు అమలులోకివచ్చిన రిపబ్లికన్ రాజ్యాంగచట్టములో సంస్థాన రాజ్యాంగముకూడ ఒకభాగమైవుండి, కేంద్రప్రభుత్వ, సంస్థానప్రభుత్వముల నిర్ణయించుచున్నది.

సంస్థానాధీశ్వరుల పరిపాలనావిధానము నిరంకుశత్వమునకు నిర్వచనముగా వుండేది. ఏవోకొన్ని పెద్దసంస్థానములలో తప్ప ఇతర సంస్థానాలలో పరిపాలనాయంత్రమనేది వుండేదికాదు; వున్నా అది లోపభూయిష్టము, అసమర్థమునై వుండేది. సంస్థాన ఏకీకరణసందర్భంలో ఆ కాస్తపరిపాలనాయంత్రంకూడ భగ్నమైపోయింది. కొన్ని సంస్థానయూనియన్‌లలో కొన్నినెలలవరకు యూనియన్ నామమాత్రం

గానే వుండిపోయింది; పరిపాలనాయంత్రం లేకపోవటంవల్ల తన ప్రాంతమంతటిపై అది అధికారం చలాయించలేకపోయేది. సంస్థానయూనియన్‌లు ఒక ప్లానుప్రకారం ఏర్పరచబడినట్లయితే, ఆయా యూనియన్‌ల పరిపాలనకు తగిన వుద్యోగులను ముందుగానే తర్ఫీదుచేసివుంచుకుని, ఆదినుంచి యూనియన్ పరిపాలన సక్రమంగా జరిగించటానికి వీలుండేది. కాని ఏకీకరణకార్యక్రమం ఒక్కమారుగా, పెద్దపెట్టున జరగటంవలన ఇటువంటిదేమీ సాధ్యపడలేదు. సంస్థాన యూనియన్‌ల అనుభవ శూన్య నూతనప్రజామంత్రివర్గములకు సలహా నిచ్చుటకు, పరిపాలనా యంత్రము నేర్పరచి, పరిపాలనా విధానమును, పద్ధతులను సక్రమమొనర్చుటకు భారతప్రభుత్వోద్యోగులు మొదట్లో సలహాదార్లుగా నియమింపబడిరి గాని వీరి సలహాలు కొత్తగా స్వేచ్ఛ, అధికారములుపొందిన మంత్రులకు నచ్చకపోవుటచే ఈ పద్ధతి మానివేయ వలసివచ్చెను. ఇప్పటికికూడ సంస్థాన యూనియన్‌ల ప్రభుత్వయంత్రములు సరిగా ఏర్పడి, పనిచేయుటలేదు. ఈ యూనియన్‌లలో అవినీతి, దుష్పరిపాలన హెచ్చుగ నుండి, ఏకీకరణ సత్ఫలితములు లభింపకుండజేయుచున్నవి. దీనికితోడు నూతన మంత్రులకు ఆయాప్రాంత కాంగ్రెస్‌సంఘములకు సంబంధము లన్యోన్యముగనుండక, ఈ నూతనప్రజాస్వామ్యము లాభదాయకముకన్న అనర్థదాయక మెక్కుడుగనైనది. ఈ పరిస్థితి చక్కబరచుట భారతప్రభుత్వ మొక ముఖ్యకార్యముగ పరిగణింప వలసియున్నది.

సంస్థానములలో కొన్నింటికి స్వంతసైన్యం వుండేది. ఈ సైన్యంకొరకు ఎక్కువ ఆదాయం ఖర్చయి, అభివృద్ధికార్యాలకు తగినంతసొమ్ము లభిస్తుండేదికాదు. భారతదేశంలో బలిష్టమైన కేంద్రప్రభుత్వం వుండాలంటే సంస్థానాలకు ప్రత్యేకసైన్యాలు అనవుసరమేగాక అనర్థకముకూడా. అందువల్ల సంస్థాన సైన్యాలను భారత సైన్యాలతో కలిపివేయటం అవుసరం. ఈ విషయమై సూచనలుచేయటానికి భారతప్రభుత్వం ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించింది. సంస్థాన సైన్యాలను అన్నివిధాల భారత సైన్యాలవలె తయారుచేసి, నడిపి, ఖర్చుభరించేబాధ్యత కేంద్రప్రభుత్వానికే వుండాలనిచెప్పి, ఆ సైన్యాలలో కొంతభాగం సంస్థాన యూనియన్‌ల రాజప్రముఖుల నామమాత్రపు టధికారంలో వుండాలని ఈ సంఘం సూచించింది. ఇది కేవలం అనవుసరం. రాజప్రముఖులు గవర్నర్‌లతో సమానమైనప్పుడు సైన్యంపైన నామమాత్రపుటధికారం వారికి ఎందుకు? ప్రతిష్టకా? ఈ లోటును త్వరలోనే భారతప్రభుత్వం సవరిస్తుందని ఆశిద్దాము.

సంస్థానాలు విడివిడిగా వున్నప్పుడు వాటిమధ్యా, వాటికి, బ్రిటిష్ భారత భూభాగానికిమధ్యా సుంకపు పన్నులు విధిస్తూ, సంస్థానాలు ఎక్కువ ఆదాయాన్ని

సంపాదిస్తుంటేవి. సంస్థాన యూనియన్‌లు ఏర్పడటము, కొన్ని సంస్థానాలు రాష్ట్రాలలో కలిసిపోవటముతో ఈ సుంకాలవసూలుపద్ధతి రద్దయిపోయి సంస్థాన యూనియన్‌ల ఆదాయం తగ్గిపోయింది. సంస్థానాలలో ఆదాయపుపన్ను, అమ్మకపు పన్ను మొదలైన కొన్ని పన్నులు అసలు లేనేలేవు. పన్నుల వసూలువిధానము, పన్నుల విధింపువిధానముకూడ ఆయా సంస్థానాలలో భిన్న భిన్నముగా వుండెను. ఈ పద్ధతులన్నింటిని సమీకరించి, మార్పుజేసి, సంస్థానయూనియన్‌లలోను, రాష్ట్రాలలోను కేంద్రప్రభుత్వ పన్నులు ఒకేవిధానము ననుసరించి విధించుటకు, వసూలుచేయుటకు, సంస్థాన యూనియన్‌ల పన్నులవిధానములను సంస్కరించి, వాటికి ఆర్థిక దక్షత నాపాదించగల పన్నుల విధానములను సూచించుటకు, శ్రీ టి. టి. కృష్ణమాచారిగారి అధ్యక్షతన ఒక ప్రత్యేకసంఘము నియమించిరి. ఈ సంఘము తన కర్తవ్యమును జయప్రదముగ నిర్వహించినది. వీరిసూచనలు పూర్తిగ అమలుజరుగునప్పటికి పన్నులవిషయములతోసహా అన్నివిషయములలోను సంస్థానాలు రాష్ట్రాలస్థాయికి వచ్చును. ఇప్పుడు కొన్ని సంస్థానములలోవున్న ప్రత్యేక తపాలా, చలామణీవిధానములు త్వరలోనే రద్దయిపోవును.

సంస్థానాలను వశపరచుకొనునప్పుడు, యూనియన్‌లుగా ఏర్పరచునప్పుడు జరిగిన ఒడంబడికలలో భారతప్రభుత్వము ఆయా సంస్థానాధీశ్వరులకు వంశపారంపర్యము, బిరుదులు, హోదాలు, స్వంత ఆస్తి మొదలగునవి రక్షించుటయేగాక ప్రతిఏటా కొంత రుణమునుకూడ ఇచ్చుటకు అంగీకరించెను. ఆయాసంస్థానాల ఆదాయమునుబట్టి సంస్థానాధీశ్వరుల భరణము రూ. 5 లక్షలనుండి, రూ. 3 వేల వరకు నిర్ణయింపబడెను. ఇంతపెద్ద మొత్తము భరణము వారికిచ్చుట తగదని కొందరిమతము. ఇంతవరకు సంస్థానముల ఆదాయమునందధికభాగము సంస్థానాధీశ్వరులు దుర్వినియోగపరచిరి; సంస్థాన అభివృద్ధి చాల వెనుకబడివున్నది. ఎంతో స్వంత ఆస్తి వెనుకవేసుకుని వున్నవారికి ఏటేటా ఇంత భరణమిచ్చిన ఇకముందు మాత్రము సంస్థానముల ఆర్థికాభ్యున్నతికి సొమ్మెట్లు లభించును? ఈవాదము యుక్తియుక్తమైనదే. కాని శాంతియుత, సమంజసపద్ధతులలో ఏకీకరణ జరుగవలెనన్న ఇంత కనీసమొత్తమైనను సంస్థానాధీశ్వరులకు భరణమివ్వవలసియుండును.

సంస్థానప్రజలలో వ్యాపించుచున్న స్వాతంత్ర్యకాంక్షకు మరికొంతకాలములో సంస్థానాధీశ్వరులు బలియైయుండెడివారేనని, ఇప్పుడీ ఏకీకరణద్వారా భారత ప్రభుత్వము వారిని రక్షించి, బాధ్యతారహితులనుజేసికూడ పోషించుట జరుగుచున్నదని, ఈ ఏకీకరణ అన్నివిధముల సంస్థానాధీశ్వరులకుమాత్రమే లాభకరమని కొందరు వాదింతురు. ఇది కొంతవరకు అతివాదము. సంస్థానాధీశ్వరులు బలియై

పోవునంతటి విప్లవాత్మక మార్పులు జరుగునప్పటికి భారతదేశమంతట ఆ మార్పుల ప్రభావము ప్రసరించి, అట్టిమార్పులే ప్రారంభమై, ఇప్పటి వ్యవస్థ తారుమారగుట తథ్యము. అట్టిమార్పులకు స్వాతంత్ర్యము లభించినతర్వాత ఇంతత్వరలో మనము పూనుకొనరాదని ప్రస్తుత పాలకవర్గ అభిప్రాయమై యుండవచ్చునని వారి కార్య విధానమువల్ల తెలియుచున్నది. సంస్థానాధీశ్వరులను బలిమిమై, హింసాయుతముగ తొలగించుట ఇప్పటిప్రభుత్వ విధానమూకాదు; వాంఛనీయమూకాదు. సంస్థాన ఏకీకరణ శాంతియుతపద్ధతులపై జరుగవలెనన్న ఇప్పుడు జరిగిన పద్ధతికన్న వేరొకటి ఏదియు లేదు.

ఇప్పుడేర్పడిన సంస్థానయూనియన్‌లు అన్నియు ఆర్థికదక్షతగలవికావు. రాజాస్థాన్ యూనియన్ మనదేశములో మిక్కిలి పెద్దదగు రాష్ట్రముగ ఏర్పడినది. కాని వింధ్యప్రదేశ్, మధ్యభారత్ మొదలైన కొన్ని యూనియన్‌లు రెండు, మూడు జిల్లాలంత విస్తీర్ణమేవుండి, పరిపాలనాసౌలభ్యమునకు తగిన రాష్ట్రములుగ లేవు. సంస్థానాలు రాష్ట్రాలలో లీనమైపోవటంవల్ల ఒరిస్సావంటి చిన్నరాష్ట్రం సరిసమానమైన విస్తీర్ణం లభించి, లాభదాయకమైంది కాని ఇప్పటికే పెద్దవిగావున్న బొంబాయివంటి రాష్ట్రాలు మరింతపెద్దవై పరిపాలనా వ్యవహారములు గందరగోళముగా పరిణమించుచున్నవి. ఈ పరిస్థితిని, వెంటనేగాకున్న ఆసన్న భవిష్యత్తులోనైన గుర్తించి, దేశమునంతను—ఇప్పటి రాష్ట్రములను, సంస్థాన యూనియన్‌లను--భాషా, సంస్కృతి, ఆర్థికదక్షతల దృష్ట్యా 10, 12 రాష్ట్రములుగ పునర్విభజించి, సక్రమపరిపాలనకు దోహదము చేయవలసియున్నది. ఈలోపుగా సంస్థాన యూనియన్‌లలో సుపరిపాలనా యంత్రము నేర్పరచుట, ఆర్థికాభ్యున్నతికార్యక్రమము నిర్వహించుచుండుట మొదలగు అవుసరకార్యక్రమమును సాగించుచుండవచ్చును. దేశము ఆర్థికముగ సౌభాగ్యవంతమై పరిపాలనా వ్యవహారములందిప్పటి అసమర్థత, అవినీతి తొలగిపోయి, సుపరిపాలన ఏర్పడి, దేశమంతయు ఏకబలిష్ట కేంద్రప్రభుత్వాధిపత్యమున సక్రమపద్ధతులపై సౌష్టవమైన రాష్ట్రములుగ విభజింపబడి, ప్రజారంజకముగ పాలనసాగినప్పుడే స్వాతంత్ర్యమువలని సత్ఫలములు మన మనుభవింపగలము. సంస్థాన ఏకీకరణ భారతప్రభుత్వమున కొక మహావిజయము; ఆ విజయమునుయొక్క ఫలితములు కేవలము దానిపైననేగాక, దాని నుపయోగించుకొని సాధించినదానిపైకూడ ఆధారపడియుండును. సంస్థాన ఏకీకరణము సాధించినంతటి చురుకుగా, అంతటిదీక్షతో అనంతరకార్యక్రమముకూడ జయప్రదముగ నిర్వహింపబడగలదని మన మాశించెదము.

## పట్టిక 1.

## సంస్థానకూటముల వివరాలు

| | చేరిన సంస్థానాల సంఖ్య | విస్తీర్ణము | జనాభా |
|---|---|---|---|
| 1. సౌరాష్ట్ర | 217 | 31,885 | 35.22 |
| 2. మత్స్య | 4 | 7,536 | 18.38 |
| 3. వింధ్యప్రదేశ్ | 35 | 24,610 | 35.69 |
| 4. మధ్యభారత్ | 20 | 46,273 | 71.50 |
| 5. పాటియాలా, తూర్పు పంజాబ్ | 8 | 10,119 | 34.24 |
| 6. తిరువాన్కూర్-కొచ్చిన్ | 2 | 9,155 | 74 93 |
| 7. రాజస్థాన్ | 14 | 120,668 | 121.00 |

## పట్టిక 2.

## కేంద్రప్రభుత్వపాలన క్రిందకు తీసుకోబడిన సంస్థానాల వివరాలు

| పేరు | సంస్థానాల సంఖ్య | విస్తీర్ణము | జనాభా |
|---|---|---|---|
| హిమాచలప్రదేశ్ | 21 | 10,600 | 9.36 |
| కచ్ | 1 | 8,461 | 5.01 |
| భోపాల్ | 1 | 6,921 | 7.85 |

## పట్టిక 3

## సంశ్లిష్టరాష్ట్రిలలో కలిసిన సంస్థానాల వివరాలు

| రాష్ట్రము | చేరిన సంస్థానాల సంఖ్య | విస్తీర్ణము | జనాభా |
|---|---|---|---|
| 1. ఒరిస్సా | 24 | 27,671 | 50.37 |
| 2. సి. పి. | 15 | 31,749 | 28.34 |
| 3. బీహార్ | 2 | 623 | 2.08 |
| 4. మద్రాస్ | 3 | 1,602 | 4.99 |
| 5. తూర్పు పంజాబ్ | 3 | 370 | .80 |
| 6. బొంబాయి | 176 | 38,405 | 83.14 |
| 7. యు. పి. | 3 | 6,276 | 13.25 |
| 8. బెంగాల్ | 1 | 1,318 | 6.40 |

# నవభారతం - అధినివేశపర్వం

భారతదేశచరిత్రలో 1947 ఆగస్టు 15 వ తేదీ, 1950 జనవరి 26 వ తేదీ అతిప్రముఖమైన సంఘటనలు జరిగిన పర్వదినములుగా కొన్ని శతాబ్దముల వరకు పరిగణింపబడుచుండగలవు. దాదాపు 12 శతాబ్దాలతర్వాత భారతపుత్రులు తమ దేశములో తమ పరిపాలన ఏర్పరచుకున్న పర్వదినమూ, పరదేశదాస్యబంధపు కట్టకడపటి చిహ్నమును త్రెంచివేసి, తమదేశములో భారతపుత్రులు సర్వస్వతంత్ర ప్రజారాజ్యము నేర్పరచుకున్న పర్వదినమూ కండ్లారగాంచిన మనము వాటి ప్రాముఖ్యతను పూర్తిగా అవగాహనచేసికొన్నను, ఆ సంఘటనల మహత్తరతను గుర్తింపలేకుండుట సహజము కావచ్చునుగాని భవిష్యత్తులో తరతరములవారు వాని కాపాదించగల మహత్తరతను ఊహించుట కష్టముకాదు. కోట్లకొలది సంవత్సరములనుండి నడచుచున్న భారతచరిత్రలో భారతదేశ మిప్పుడు తొలి పర్యాయము ప్రజారాజ్యమగుచున్నది. ఇది భారతచరిత్రలో ఒక నూతన మహా యుగమునకు నాంది.

భారతదేశములో బ్రిటిష్ పరిపాలనాచరిత్ర, భారతస్వాతంత్ర్యసంపాదనకు జాతీయకాంగ్రెస్ జరిపిన స్వాతంత్ర్య పోరాటచరిత్ర పరిశీలించిన భారతదేశము సర్వస్వతంత్ర మైనపుడు రిపబ్లికన్ రాజ్యాంగముతప్ప వేరొకటి ఏర్పరుపబడుటకు అవకాశములేదని గుర్తింపగలరు. ఆధునిక రాజ్యములన్నియు ప్రజాస్వామ్యపద్ధతి నంగీకరించినవే; ప్రజాస్వామ్యములందు సర్వస్వతంత్రత (Sovereignity) సామాన్యముగ సర్వప్రజాసముదాయమునకే చెందుట పరిపాటి; బ్రిటన్‌వంటి కొన్ని దేశములలో మాత్రము సర్వస్వతంత్రత నామమాత్రముగ ఏకవ్యక్తియందు—రాజునందు—కేంద్రీకరింపబడినను, ఆచరణలో అక్కడకూడ ప్రజలే ఆ యధికారమును చలాయించుచున్నారు. భారతదేశమునకు పరాయిదేశస్థుడు రాజుగా నుండుట తగునని ఎవ్వరూ చెప్పలేరు; ఇండియా-బ్రిటన్‌ల గతసంబంధమును జ్ఞప్తికి యుంచుకున్న బ్రిటిష్‌రాజును నామమాత్రముగనైన భారతదేశ మంగీకరించుట అసంబద్ధమని అంగీకరింపవలెను. కాబట్టి భారతదేశము రిపబ్లికన్ రాజ్యాంగమునే అనువర్తింపజేసుకొనునని ఎల్లరు గుర్తించియుండిరి. ఆ సంఘటనయే ఈనాటి శుభముహూర్తమున జరుగుచున్నది.

భారతదేశము స్వతంత్రమై ఇప్పటికి దాదాపు రెండున్నరఏండ్లు గడచినవి. ఇప్పుడు తొలిపర్యాయముగ ఈ దేశము సర్వస్వతంత్ర ప్రజారాజ్యమగుచున్నది. ఈ ఆనందసమయమున గత రెండున్నరసంవత్సరములలో వివిధరంగములలో మనకు కల్గిన కష్టసుఖములు, మనము పొందిన లాభనష్టములు, వివిధసమయము లందు మనకార్యపరత, అసమర్థతలు, మనకు లభించిన జయాపజయములు ఒక్క మారు జ్ఞప్తికి తెచ్చుకొనుట అసందర్భము కాకపోగా మన భవిష్యత్ కార్యక్రమ నిర్ణయమున కత్యవసరమేమో !

గడచిన రెండున్నర ఏండ్లుగా స్వతంత్రభారతదేశము బ్రిటిష్ కామన్వెల్త్‌లో అధినివేశస్థాయియందుండి, బ్రిటిష్ రాజును నామమాత్రపు రాజుగ నంగీకరించు చున్నది. ఇది భారతజాతీయ కాంగ్రెస్ ఆశయములకు విరుద్ధము. ఆదినుండియు కాంగ్రెస్ భారతదేశము రిపబ్లిక్‌గా ఏర్పడవలెననే ఉద్ఘాటిస్తున్నది. ఈ పట్టుదల, ప్రతిష్ఠవిషయమున తప్ప మరే ఇతరవిషయమున రిపబ్లిక్‌కు అధినివేశమునకు చెప్పదగిన తేడా ఏమీలేదు. అధినివేశత్వము బంధించని బంధము. కామన్వెల్త్‌లో అధినివేశముగా వున్నంతమాత్రాన రాజకీయంగాగాని, ఆర్థికంగాగాని బ్రిటన్‌కు గాని, ఇతర అధినివేశాలకుగాని ఎట్టి సౌకర్యాలు, పక్షపాతము చూపించవలసిన అవసరంలేదు. అధినివేశాలు కాకపోయినా ఆర్థికంగా, రాజకీయంగా బ్రిటన్‌పై ఆధారపడివున్న దేశాలు చాలావున్నాయి; అధినివేశాలుగా వుండి బ్రిటిన్ అనుస రిస్తున్న విధానాలకు వ్యతిరేకవిధానాలు అనుసరిస్తున్నదేశాలు వున్నవి. కాబట్టి అధినివేశంగా వుండకుండా రిపబ్లిక్ ఏర్పడటంవల్ల ఇండియా, తదితరదేశాల సంబంధాలలోగాని, ఆంతరంగిక వ్యవహారాలలో ఇప్పుడు ఇండియాప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలలోగాని ఎట్టిమార్పులు రానక్కరలేదు; రాబోవటంలేదు కూడాను. పైగా, ఇండియా రిపబ్లిక్‌గా ఏర్పడినా, బ్రిటిష్ కామన్వెల్త్‌లో నామమాత్రపు సంబంధం వుంచుకుంటూనేవుంది! ఒక రిపబ్లికన్‌దేశానికి, సామ్రాజ్యవాద రాచరికపుకూటమిలో స్థానం వుండగలదా, వుండటం సహజము, సంబద్ధము, సమంజసము అగునా అనేవిషయాలు ఇప్పుడు చర్చించ నక్కరలేదు.

గత రెండున్నర సంవత్సరాలలోను స్వతంత్రభారత ప్రజాప్రభుత్వం వివిధ రంగాలలో నిర్వహించిన కార్యక్రమం సంక్షిప్తంగానైనా ఇక్కడ సమీక్షించలేము. వివిధరంగాలలో భారతప్రభుత్వ వ్యవహారధోరణి ఏవిధంగావున్నదీ, వాటివల్ల ఎటువంటిఫలితాలు కలుగుతున్నదీమాత్రమే ఇక్కడస్థూలంగా పరిశీలిద్దాము.

రాజకీయంగా, ముఖ్యంగా విదేశాలలో, ఈకాలంలో భారతదేశ గౌరవం ఇనుమడించింది. ఇదివరకు విదేశాల ప్రభుత్వాలతో భారతీయులకు ఎట్టిసంబంధము

వుండేదికాదు. భారతప్రభుత్వ విదేశాంగ వ్యవహారాలు బ్రిటిష్‌ప్రభుత్వమే నిర్వహిస్తూ, అజమాయిషి చేస్తూవుండేది. మనదేశం స్వతంత్రంకాగానే మనం సంతోషంతో, గర్వంతో స్వీకరించిన బాధ్యతలలో విదేశాంగ వ్యవహారనిర్వహణ ముఖ్యమైనది. ఈ రెండున్నర ఏండ్లలోను భారతప్రభుత్వం ఇతర ప్రభుత్వాలతో రాజకీయ రాయబారసంబంధాలు ఏర్పరచుకొని, చాలదేశాలలో మన రాయబారులను, ప్రతినిధులను నియమించి, మన ప్రతినిధివర్గాలను అంతర్జాతీయ సమావేశాలకు పంపించి, ఇతరదేశాలు మనదేశ సమస్యలను, మన దృక్పథాన్ని, మననాగరికతను అవగాహనచేసుకుని, గౌరవించటానికి దోహదంచేస్తున్నది. అక్కడక్కడా కొన్ని లోపాలున్నా, మన రాయబారులు తమ కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ సభలలో ఆసియా ప్రజావాణిగా భారతవాణి పరిగణింప బడుతున్నది. ఆసియా రాజ్యాలు, ప్రజానీకము తమకు ఏ సహాయం కావలసివచ్చినా భారతదేశంవైపు చూస్తున్నారు. భారతప్రభుత్వం అంతర్జాతీయ వ్యవహారాలలో అనుసరిస్తున్నపంథా, వివిధ అంతర్జాతీయ సమావేశాలలో చర్చకు వస్తున్న వివిధ సమస్యలపట్ల భారతప్రభుత్వవైఖరి, దృక్పథము ప్రపంచమంతటా ఆదరణకాకపోయినా మన్ననపొందుతున్నాయి. ఇది గర్వించదగినవిషయం. భారతదేశం సైనికంగాను, ఆర్థికంగాను ఇతర ముఖ్యదేశాలస్థాయికి రాగల్గితే, భారత ప్రభుత్వవిధానాలు మన్ననయేగాక ఆదరణ, అనుసరణ, ఆచరణకూడ పొంద గలవని ఇందువల్ల రుజువౌతున్నది.

ఆంతరంగికంగా దేశంలో రాజకీయ పరిస్థితులు ఏమంత సంతోషదాయకంగా లేవు. ఈకాలంలో రాజకీయంగాను, ఆర్థికంగాను అనేక చిక్కుసమస్యలు ఉత్పన్నమై దేశ ఆర్థిక, రాజకీయ పురోభివృద్ధికి ఆటంకం కలిగించాయి. ఎప్పటికప్పుడు ఉత్పన్నమవుతున్న నూతన సమస్యలపట్ల భారతప్రభుత్వవిధానము ప్రజలలో, ముఖ్యముగ విద్యార్థులలో, చాలమందికి ప్రభుత్వముపై అవిశ్వాసము, అసంతృప్తి కలిగిస్తున్నది.

భారతదేశమిప్పుడొక ప్రజాస్వామ్యరాజ్యము. కాని దేశవిభజనవిషయములో గాని, స్వతంత్ర ప్రజాప్రభుత్వనిర్మాణము విషయములోగాని ప్రజల అభిమతమునకు తావులేకపోయింది. సామాన్యముగ ప్రజాస్వామ్యరాజ్యము లన్నిటిలోను ముఖ్యమైన నిర్ణయములు జరుగవలసివచ్చినప్పుడు ఆ ప్రాతిపదికపై ఎన్నికలు జరిగి, విజయమందిన పక్షదృక్పథము చలామణి అవుతుంది. భారతదేశములో, రాష్ట్రశాసనసభలకు ఎన్నికలు జరిగి చాలకాలమైనది; ఆ ఎన్నికలు జరిగినప్పటి సమస్యలకు, ప్రశ్నలకు ఇప్పటివానికి ఎట్టిసంబంధము లేదు; ఇంత త్వరలో స్వాతంత్ర్యము

లభించుననిగాని, దేశవిభజన జరుగునని ఎన్నికలసమయమున ఊహించుటకుకూడ అవకాశము లేకుండెను. ప్రజానీకపు అభిమతము తెలుసుకొనకుండానే, అతి ముఖ్యమైన ఈ నిర్ణయాలు జరిగిపోయినవి. దేశవిభజనానంతరమైన వెంటనే ఎన్నికలు జరిగి, ప్రజలకు బాధ్యులైనవారు అధికారము స్వీకరించిన బాగుండెడిది. కాని నూతనరాజ్యాంగము ప్రకారము ఎన్నికలు జరుపుట మంచిదని చెప్పి ఇంతవరకు ఎన్నికలు జరపనేలేదు. నూతనరాజ్యాంగము ఇప్పుడు అమలులోనికి వచ్చినది కాబట్టి, బహుశః ఈ సంవత్సరాంతములోగా ఎన్నికలు జరిగి, నిజమైన ప్రజాస్వామ్యప్రభుత్వములు రాష్ట్రములలోను, కేంద్రములోను అధికారము వహించునని ఆశించవచ్చును.

నూతనరాజ్యాంగము ప్రకారము ఎన్నికలసంగతి అటుంచి, నూతనరాజ్యాంగమే చాలమందికి నచ్చలేదు. ప్రస్తుత రాజ్యాంగపరిషత్తు నేరుగా ప్రజలెన్నుకొన్నది కాదు; అత్యధికసంఖ్యాకులు కాంగ్రెస్‌వాదులున్న రాష్ట్రశాసనసభలచే ఎన్నుకొనబడినది. రాజ్యాంగనిర్మాణము పక్షపాతరహితముగ జరుగవలెనన్న ఇట్టి ఏకపక్ష ప్రాబల్యము పనికిరాదు. కాంగ్రెస్‌పక్షముచే తయారుచేయించబడిన ఈ రాజ్యాంగము ఇతరపక్షములకు నచ్చకపోవుటవలన, భవిష్యత్తులో ఇతరపక్షమేదైనా అధికారములోనికివచ్చిన, వెంటనే రాజ్యాంగచట్టమును పూర్తిగాగాని, కొంతవరకుగాని సంస్కరించవచ్చును. ఇట్టి సంస్కరణలు తరచు జరుగుట శ్రేయస్కరము కాకపోయినను, పై కారణమువలన తప్పనిసరియగును.

మనదేశములో నూతనరాజ్యాంగముగాని, ప్రజాస్వామ్యముగాని ఫలప్రదముగా పనిచేయుటకు వలసిన ప్రజాస్వామ్య వాతావరణము ప్రస్తుతములేదు. ఇట్టి వాతావరణ మేర్పరచటం రాజకీయపక్షాల కర్తవ్యం. కాని మన దేశస్వాతంత్ర్యసముపార్జననే లక్ష్యముగా పెట్టుకుని, అన్నివర్గాలవారు ఆదినుండి కాంగ్రెస్ నే బలపరుస్తూ వచ్చారు; అందువల్ల దేశంలో ఇతర రాజకీయపక్షాలు ఏర్పడి, బలపడి, ప్రచారంలోకి వచ్చి ప్రజాస్వామ్య వాతావరణం వ్యాపింపజేయటానికి అవకాశం లేకపోయింది. దేశం స్వతంత్రంకాగానే, వ్యాపించీ వ్యాపించని ఈ ప్రజాస్వామ్య వాతావరణంలో, అనుభవశూన్యులగు వ్యక్తులు అధికారంవహించటంవల్లనూ, కాంగ్రెస్‌పక్షానికి పూర్వకాలంలో సంపాదించుకున్న పలుకుబడి పెట్టని గోడగా వుండి, కాంగ్రెస్ వ్యతిరేకపక్షాల స్థాపనకు, వ్యాప్తికి అడ్డంకుగా వుండటంవల్లనూ, కాంగ్రెస్ వ్యతిరేకపక్షాలలో ముఖ్యమైనదైన కమ్యూనిస్టుపక్షం హింసాయుత, దౌర్జన్యపద్ధతుల నవలంబించి దేశ ఆంతరంగికశాంతిరక్షణనే ఒక సమస్యగా చేయటంవల్లనూ, గత రెండున్నర సంవత్సరాలలో ప్రజాస్వామ్యవాతా

వరణం మనదేశంలో వలసినంతగా వ్యాప్తిచెందలేదు. ప్రజలలో ప్రజాస్వామ్య భావాలు బాగుగా వ్యాప్తిజెందనిదే ప్రజాస్వామ్యప్రభుత్వాలు సరిగా పనిచేయలేవు. అందువల్ల ఈనాడు మనదేశం ప్రజాస్వామ్యంగానే వుండి, అందువలని లాభాలుగాక, నష్టాలు, కష్టాలు మాత్రమే మనం పొందగల్గుతున్నాము. దేశంలో ప్రజాస్వామ్యవాతావరణం బాగా వ్యాపించనంతకాలము ఇట్టి సంకటము తప్పదు.

మనదేశంలో చెప్పుకోతగిన రాజకీయ పక్షాలలో ముఖ్యమైనది కాంగ్రెస్. దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన సంస్థగా కాంగ్రెస్‌కు దేశంలోను, విదేశాలలోను అఖండమైన ప్రఖ్యాతి ప్రతిష్ట వున్నవి. స్వాతంత్ర్య సముపార్జన తర్వాత కాంగ్రెస్ రద్దయిపోయి నూతన రాజకీయపక్షాలు ఏర్పడటానికి తావివ్వాలెనని ఆదిలో భావించారుగాని, రాజకీయ స్వాతంత్ర్యం సముపార్జించిన కాంగ్రెసే ఆర్థిక స్వాతంత్ర్యం, సమత, సౌభాగ్యముకూడ చేకూర్చిన బాగుంటుందనీ, ప్రస్తుత పరిస్థితులలో దేశాన్ని ఏకత్రాటిమీద నడుపుతూ, పరిపాలనా వ్యవహారాలను కట్టుదిట్టంగా నిర్వహించటానికి బలిష్టమైన ఒకేరాజకీయపక్షం వుండటం అవుసరమనీ, అందుకు తగినసంస్థ కాంగ్రెసేనని భావించి, కాంగ్రెస్‌ను రద్దుచేయకుండా వుండటానికే పెద్దలు నిశ్చయించారు. కాంగ్రెస్ లక్ష్యములు పునర్నిర్వచించి, నిబంధనావళిని సవరించారు. కేంద్రంలోను, అన్నిరాష్ట్రాలలోను, సంస్థానాలలోను కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారం నిర్వహిస్తున్నవి. కాని ఈరెండున్నర ఏండ్లుగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమం ఏమాత్రము సంతృప్తికరంగా లేదు. ప్రస్తుతం ఈదేశంలో తమనుకాదని, ఓడించి అధికారంలోనికి రాగల రాజకీయపార్టీ ఏదీలేదని గ్రహించటంతో కాంగ్రెస్‌వాదుల నైతికప్రవర్తన ఆందోళనజనకంగా పడిపోయింది. ప్రభుత్వయంత్రం బలపడి, సుపరిపాలన ఏర్పడటానికి బదులు పరిపాలనాయంత్రం కూడ ఆనాటికానాడు చెడిపోతున్నది. కాంగ్రెస్ సంస్థలోని వ్యక్తిగతద్వేషాలు పరిపాలనా వ్యవహారాలకుకూడా వ్యాపించి, భవిష్యత్తులో ప్రమాదకరమైన చిక్కులు తటస్థించగలవని సూచిస్తున్నవి. దేశభక్తులందరు తీవ్రంగా ఆలోచించి వెంటనే ఏదోఒకవిధంగా పరిష్కరించవలసిన ముఖ్యసమస్యలలో ఇది ఒకటి.

గాంధీజీ హత్యానంతరం మతైక రాజకీయపక్షాలైన ముస్లింలీగ్, హిందూమహాసభలు నామమాత్రాలై పోయినవి. హిందూమహాసభ తిరిగి తలఎత్తటానికి ఇప్పుడిప్పుడే ప్రయత్నం చేస్తున్నదిగాని ఆ ప్రయత్నాలు జయప్రదమయ్యే సూచనలు కనపడటంలేదు. కమ్యూనిస్టులు దౌర్జన్యవాదులుగా మారిపోయి, ఆత్మహత్య చేసుకున్నారు; క్రితం ఎన్నికలనాటికి కమ్యూనిస్టులకువున్న పలుకుబడిలో అవంత

భాగమైనా వారికి ఈనాడులేదు. విధ్వంసాత్మక, దౌర్జన్యచర్యలు ప్రారంభించి, దేశశాంతికి ముప్పుతెచ్చి, దేశంలో ప్రశాంతంగా, ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడటానికి కమ్యూనిస్టులు అవరోధం కలిగించారు. ఇది దేశానికి తీరనినష్టం కలిగించింది. సోషలిస్టులు కాంగ్రెస్‌నుంచి విడిపోయి ప్రత్యేక రాజకీయపక్షంగా ఏర్పడినా ఆపార్టీ ఇంతవరకు చెప్పుకోదగిన ప్రచారంలోకి రాలేదు; దాని పలుకుబడి బొంబాయి మొదలైన కొన్నిపట్టణాలలో మాత్రమే వృద్ధిచెందు తున్నది. ఈపార్టీయంత్రము, ప్రచారము ఎంతో ఎక్కువగా అభివృద్ధిచెందవలిసి వున్నది. ఈపార్టీ త్వరత్వరగా అభివృద్ధిచెంది, బలపడితేగాని దేశంలో బలిష్ట మైన రెండవ రాజకీయపక్షం ఏర్పడి, సరియైన రాజకీయ ప్రచారము, ప్రజా స్వామ్యభావాలు వ్యాపించవు.

భారతస్వాతంత్ర్యంతోపాటు దేశవిభజన, పాకిస్థాన్ అవతరణ అంగీకరించ వలసివచ్చింది. పాకిస్థాన్ స్వతంత్ర్యరాజ్యంగా ఏర్పడినప్పటినుండీ పాకిస్థాన్ ప్రభుత్వ వ్యవహారధోరణి మనపట్ల విపరీతముగానే నడుస్తున్నది. ముస్లింలీగ్ ఎప్పుడూ కాంగ్రెస్‌కు వ్యతిరేకపక్షమే. కాంగ్రెస్ దేశవిభజనకు అంగీకరించి ముస్లింలీగ్ కోరినట్లు పాకిస్థాన్ ఏర్పడుటకు అంగీకరించినతర్వాతకూడా, అక్కడ ఏర్పడిన ముస్లింలీగ్ ప్రభుత్వ వైఖరి ఏమీ మారలేదు. ఏవిధముగానైనా కాంగ్రెస్‌ను, భారతదేశాన్ని ఇరకాటంలోపెట్టి, ఇబ్బందిపెట్టటమే పాకిస్థాన్ ప్రభుత్వలక్ష్యముగా కనిపిస్తున్నది. రాజకీయ వ్యవహారాలలో, కాందిశీకులవిష యంలో, సంస్థానాలవిషయంలో, వర్తకవ్యాపారాలసందర్భంలో, ఇండియా పాకిస్థాన్‌లకు సంబంధాలు అవుసరమైన ప్రతివిషయంలో ఇదే పాకిస్థాన్ వైఖరి. పాకిస్థాన్ ప్రభుత్వంపట్ల సౌమనస్యం ప్రదర్శించటానికి ఎప్పటికప్పుడు భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు అదనపుసౌకర్యాలు కలిగించటము, అది అదనుగా తీసుకుని పాకిస్థాన్ మరి కొంచెం బిర్రబిగుస్తుండటము జరుగుతున్నది.

ఇండియా పాకిస్థాన్‌లు తొలుదొల్త ఎదుర్కొనవలసివచ్చిన ముఖ్యసమస్య కాందిశీకసమస్య. దేశవిభజనానంతరం తూర్పు, పశ్చిమపంజాబ్‌లలో, సరిహద్దు, సింధురాష్ట్రాలలో చెలరేగిన మతోద్రేకంవల్ల లక్షలాదిప్రజలు తమతమ ఇండ్లు, ఆస్థులు వదలివేసి, ప్రాణాలు అరచేతపెట్టుకుని, కాందిశీకులుగా ప్రస్థానం చేయవలసివచ్చింది. పాకిస్థాన్‌నుంచి ఇండియా వచ్చివేసిన ముస్లిమేతర కాందిశీకుల సంఖ్య దాదాపు 55 లక్షలని అంచనావేశారు. ఇండియానుంచి తరలిపోయిన వారిసంఖ్య దాదాపు 35 లక్షలని చెప్పవచ్చును. ఇండియానుంచి వెళ్ళిపోయిన వారు ఇక్కడ వదలివేసిన ఆస్థులకంటె, ఇక్కడకు వచ్చినవారు వదలివచ్చిన

ఆస్థి చాల రెట్లు ఎక్కువ. మతకలహాలసమయంలో పశ్చిమపాకిస్థాన్‌లో మరణించినవారిసంఖ్య దాదాపు మూడులక్ష లుండవచ్చును. అపహృత స్త్రీలసంఖ్య ఎంతో చెప్పలేము. వీరినిపట్టుకొని, తిరిగి వారిబంధువులకు వప్పజెప్పేవిషయంలో భారతప్రభుత్వం చూపుతున్నశ్రద్ధలో అణుమాత్రమైనా పాకిస్థాన్ చూపటంలేదు. భారతదేశానికి తరలివచ్చిన కాందిశీకులకు తాత్కాలిక సౌకర్యాలు చేయటంలోను, శాశ్వతపునరావాసపు ఏర్పాట్లుచేయటంలోను భారతప్రభుత్వం తగుశ్రద్ధ చూపింది. కాందిశీకులకు తాత్కాలిక సౌకర్యాలు కలిగించటానికి రూ. 16 కోట్లకు పైగా ఖర్చయింది. ఈదేశం తరలివచ్చినవారిలో 13 లక్షలమంది పట్నవాసులు, 42 లక్షలమంది గ్రామీణులునని అంచనావేసి, పునరావాసపుఏర్పాట్లకు పథకాలు తయారుచేశారు. ప్రతిరాష్ట్రము, సంస్థానము ఎంతమంది కాందిశీకులకు పునరావాసపు ఏర్పాట్లుచేయాలో నిర్ణయించి, ఆ పథకం చురుకుగా అమలుజరిగేటట్లు భారతప్రభుత్వం కృషిచేసింది. పట్నవాసస్థులగు కాందిశీకులు వ్యాపారంలోను, పరిశ్రమలలోను తిరిగి ప్రవేశించటానికి ధనసహాయంచేయటానికి సలహాలు ఇవ్వటానికి ప్రత్యేకసంస్థలు ఏర్పరచారు. ఈ ఏర్పాట్లు ఇంకా పూర్తికాలేదుగాని త్వరలోనే కాందిశీకసమస్య సంతృప్తికరంగా పరిష్కారమౌతుందని ఆశించవచ్చును.

దేశవిభజనానంతరం ఉత్పన్నమైన ప్రమాదకరమైన సమస్య సంస్థానాల సమస్య. భారతదేశం స్వతంత్రంకాగానే సంస్థానాలన్నీ సూత్రప్రాయంగానైనా స్వతంత్రం కావచ్చునని బ్రిటిష్‌ప్రభుత్వం ప్రకటించటంతో సంస్థానాలవిషయంలో ఒకపెద్ద రగడ ప్రారంభమైంది. ఏ సంస్థానమూ స్వతంత్రంగా వుండరాదనీ, ఏదోఒక అధినివేశంలో కలిసితీరాలిసిందేనని కాంగ్రెస్, ఏ సంస్థానమైనా స్వతంత్రంగా వుండవచ్చుననీ, అధినివేశంలో చేరితీరాలని బలవంతపెట్టరాదని ముస్లింలీగ్ వాదించాయి. స్వతంత్రంగా వుండాలని తిరువాన్కూర్ సంస్థానం మొదట్లో ప్రయత్నించి విఫలమైంది. దానితో సంస్థానాలన్నీ భారత యూనియన్‌లో జేరటం మొదలుపెట్టాయి. జూనాగఢ్ సంస్థానం భారతభూభాగం మధ్యవున్న పాకిస్థాన్‌లోజేరి, ప్రజావిప్లవానికి కారణమై, తిరిగి భారతదేశంలో జేరింది. హైదరాబాద్ సంస్థానం సర్వస్వతంత్రత ప్రకటించుకుని, దుష్టపరిపాలన కాలవాలమై, 'పోలీసుచర్య'కు దారితీసి, తిరిగి భారత యూనియన్‌లోజేరి, ప్రజాస్వామ్యపాలనకు అవకాశమేర్పరచుచున్నది. ఈ సంస్థానములో త్వరలోనే ప్రజాపరిషత్తు ఏర్పడి, సంస్థాన భవిష్యత్తు, నిజాంభవిష్యత్తు తేల్చగలదు. ఈ సంస్థానం విచ్ఛిన్నమై, భాషారాష్ట్రాలు ఏర్పడటానికి దోహదంచేస్తుందని ఆశించవచ్చును.

కాశ్మీర్ సంస్థానం ఇండియా, పాకిస్థాన్, చైనా, రష్యా, ఆఫ్ఘనిస్థాన్, టిబెట్‌లకు సరిహద్దునవుండి, ప్రపంచంలో అతికీలకస్థానం ఆక్రమిస్తున్నది. ఈ సంస్థానాన్ని ఏవిధంగానైనా తనదేశంలో జేర్చుకోవాలని పాకిస్థాన్ ప్రభుత్వం కుట్రపన్ని, సరిహద్దు కొండజాతులపేర దాడిచేసి, సంస్థానం వెంటనే భారత దేశంలో జేరటానికి దోహదంచేసింది. అప్పటినుంచి కాశ్మీర్ పర్వతాలలో ఇండియా పాకిస్థాన్‌లకు అప్రకటిత యుద్ధం ప్రారంభమైంది. సామరస్యంగా, పాకిస్థాన్ ప్రభుత్వంతో సంప్రదింపులుజరిపి ఈ సమస్య పరిష్కరించటానికి భారతప్రభుత్వం ప్రయత్నించి, విఫలమై, చివరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి పాకిస్థాన్‌పై ఫిర్యాదుచేసింది. భద్రతామండలి ఈ వివాదాన్ని చాల కాలం పరిశీలించి దీన్ని పరిష్కరించటానికి ఒక ప్రత్యేక ఉపసంఘాన్ని ఇక్కడకు పంపింది. ఈ ఉపసంఘసూచనలు తనకు వ్యతిరేకంగా వున్నవి తిరస్కరిస్తూ, ఇతోధిక సౌకర్యాలు పొందటానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నది. కాశ్మీర్ జనవాక్యనిర్ధారణకు ప్లెబిస్లైట్ జరపటానికి భారతప్రభుత్వం అంగీకరించినా, పాకిస్థాన్‌వైఖరిలోని అసమంజసతను గుర్తించినా, భారతదేశానికి న్యాయం చెయ్యటానికి ఐక్యరాజ్యసమితి ముందంజవేయలేక పోతున్నది.

ఈ సుసంఘటనలవల్ల దేశం చరిత్రలో ఇదివరకెన్నడు కని, విని ఎరుగనంతటి ఐక్యత పొందినది. ఈ ఐక్యతను ఉపయోగించుకుని ఆర్థికభ్యున్నతికి కృషిచేయ వలసిన బాధ్యత భారతరిపబ్లిక్‌పై నున్నది.

భారతప్రజలను, ముఖ్యముగా దాక్షిణాత్యులను ఆందోళనపరుస్తున్నది భాషా రాష్ట్రాలపట్ల ప్రస్తుత ప్రభుత్వవైఖరి. కాంగ్రెస్ పాతికేండ్లక్రితమే భాషారాష్ట్ర సిద్ధాంతాన్ని అంగీకరించినప్పటికీ, ప్రస్తుతప్రభుత్వం ఆ సిద్ధాంతాన్ని అమలుజరప డానికి ఎప్పటికప్పుడు అంగీకరిస్తున్నప్పటికీ, ఆచరణమాత్రం ఎప్పుడూ వెనకపడు తూనేవున్నది. భాషారాష్ట్రాలు కూడదన్న ధార్‌కమిషన్ నివేదిక దేశమంతటా నిరసనపొందింది. భాషారాష్ట్రాలను ఏర్పరచటానికి భారతప్రభుత్వం అంగీకరిస్తున్నది గాని ఎప్పటికప్పుడు అత్యవసర సమస్యలు ఉత్పన్నమాతుండటంవల్ల ఆచరణ వాయిదా వేస్తున్నది. ఇందువల్ల ప్రజలలో ప్రభుత్వంపట్ల అసంతృప్తి వ్యాపిస్తున్నది. ఇప్పుడైనా భారతప్రభుత్వం భాషారాష్ట్రాల స్థాపనకు ముందంజ వేయాలి.

ఆర్థికరంగంలో భారతప్రభుత్వం గత రెండున్నరఏండ్లుగా సాధించిన కృషి, రాజకీయరంగంలో సాధించిన కృషి పొందినంత జయమైనా పొందలేదు. ఈనాడు భారతదేశ ముఖ్యసమస్య ఆర్థికసమస్య. భారతప్రభుత్వానికి ప్రజలలో పలుకుబడి లగ్గిపోతూండటానికి ముఖ్యకారణం ఆర్థికసమస్యలను ప్రభుత్వం జయప్రదంగా పరిష్కరించలేకపోవటమే. రాజకీయ స్వాతంత్ర్యం సంపాదించటంకంటె ఆర్థిక

స్వాతంత్ర్యం, సమత, సౌభాగ్యము చేకూర్చటం ఎంతముఖ్యమో అంతకష్టముకూడా నని ఇప్పుడు మనం తెలుసుకుంటున్నాము.

ఈనాడు మనదేశం ఎదుర్కొంటున్న ముఖ్యఆర్థికసమస్య ఆహారసమస్య. గత అయిదారేండ్లనుండీ ఆఏటికాఏడు ఆహారపుకొరత ఎక్కువై, విదేశాలనుంచి దిగుమతులు భారీగా జరగవలసి వస్తున్నది. విదేశాలలో ఆహారధాన్యాల ధరలు పెరుగుతుండటంవల్ల దిగుమతులకు కావలసిన సొమ్ము ప్రతిఏటా పెరుగుతూ, మనకువున్న విదేశనాణాల నిలవలన్నీ హరించివేసి, ఆర్థికాభ్యున్నతికి ముఖ్యంగా అవుసరమైన యంత్రసామగ్రి దిగుమతిచేసుకోటానికి వీలులేకపోతున్నది. ఆహారధాన్యాల దిగుమతులు 1943-44 సం. లో 2,98,000 టన్నులు; 1948-49 సంవత్సరంలో దాదాపు 4,00,00,000 టన్నులవరకు ఈసంఖ్య పెరిగింది. ఆహార సబ్సిడీలక్రింద ప్రతిఏటా 32 కోట్లరూపాయలకుపైగా కేంద్రప్రభుత్వం ఖర్చుచేస్తున్నది. 1948-49 సంవత్సరంలో విదేశాలలో ఆహారధాన్యాలు కొనటానికి రూ. 130 కోట్లు విదేశనాణాలు భారతప్రభుత్వం ఖర్చుచేసింది. మన దేశంలో జనాభా ప్రతిఏటా 50 లక్షలు పెరుగుతున్నది. ఆహార దిగుమతులక్రింద ప్రతిఏటా ఇప్పటివలె సొమ్ముఖర్చుచేస్తే, విదేశాలలో భారతప్రభుత్వ పరపతి, రూపాయివిలువ త్వరలోనే పడిపోతాయి. అందువల్ల 1951 నుంచి ఆహార దిగుమతులు పూర్తిగా తగ్గించివేయాలని భారతప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో అధికాహారోత్పత్తి జరిగితేతప్ప విదేశాలనుంచి దిగుమతులు మానివేయటానికి వీలులేదు. దేశంలో అధికాహారోత్పత్తి వీలైనంత త్వరగా జరిపించటానికి, క్రొత్తగా భూములను వ్యవసాయంచేయించటానికి, ఇప్పుడు ఆహారధాన్యాలు పండిస్తున్న భూములలో పంటలు ఇతోధికంగా పండేటట్లు చేయటానికే కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వాలు పథకాలు తయారుచేశాయి. ఆహార రంగంలో "యుద్ధం" ప్రకటించారు. కాని రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు తయారుచేసిన వివిధప్రణాళికలు పరిశీలిస్తే, 1951 సం. నాటికి ఆహారం విషయంలో మనదేశం స్వయంపోషక మయ్యేఆశ ఏమాత్రం కలగటంలేదు. ఆహారధాన్యాలేగాక, మన పరిశ్రమలకు అవుసరమైన జనపనార, ప్రత్తి, వేరుశెనగ మొదలైన ముడిధాన్యాలుకూడా మనదేశంలోనే పండించుకోవలసివున్నది. ఇన్నిపంటల విషయంలోను వీలైనంత త్వరలో మనదేశం స్వయంపోషకమవటానికి తగుప్రణాళికలు తయారుచేసి, ఆచరణలో పెట్టవలసివున్నది.

వ్యావసాయిక వస్తువులవలెనే పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తికూడా తగినంత స్థాయిలోగాని, వీలైనంత స్థాయిలోగాని జరగటంలేదు. అనేకకారణాలవల్ల పారిశ్రామిక వస్తూత్పత్తి ఆనాటికానాడు తగ్గుతున్నది. ఇందుకు పారిశ్రామిక

వేత్తలు కార్మికులను ప్రభుత్వాన్ని బాధ్యులనుచేస్తున్నారు; కార్మికులు ప్రభుత్వాన్ని, యజమానులను బాధ్యులనుచేస్తున్నారు; ప్రభుత్వం కార్మికులను, యజమానులను బాధ్యులనుచేస్తున్నది. మొత్తంమీద లోటు మూడువర్గాలలోను వున్నదని అంగీకరించాలి. పారిశ్రామిక వస్తూత్పత్తిని అధికంచేయటానికి దోహదం చేసేటందుకు కేంద్రప్రభుత్వం అనేక సభలు, సమావేశాలు జరుపుతున్నదిగాని ఆ కృషి ఫలప్రదం కావటంలేదు. కొత్తపరిశ్రమలను స్థాపించటంసంగతటుంచి, ఉన్న ఫ్యాక్టరీలలోనైనా వీలున్నంతవరకైనా ఉత్పత్తిజరగకపోతూండటం విచారింపవలసిన దుస్సంఘటన.

దీర్ఘకాలపు ఆర్థికవిధానం విషయంలో భారతప్రభుత్వవైఖరి చంచలంగాను, సందిగ్ధంగాను వున్నది. కాంగ్రెస్ ఆర్థికలక్ష్య నిర్వచనసంఘం చేసిన సూచనలు సోషలిస్టుపంథాలో నడిచినవి; భారతప్రభుత్వ ఆర్థికవిధానం 1948 ఏప్రిల్ ప్రకటింపబడేనాటికి ఈ సూచనలలోని 'తీవ్రత' చాలవరకు చల్లబడింది. భారత ప్రభుత్వ ఆర్థికవిధానం సంతృప్తికరంగావుందనీ, సత్వర పరిశ్రమాభివృద్ధికి దోహదంచేస్తున్నదనీ పారిశ్రామికవేత్తలు దానికి స్వాగతం చేసినప్పటికీ వాస్తవంగా, కార్యరూపంలో సత్ఫలితాలుఏమీ కనిపించలేదు. ఎప్పటికప్పుడు ఏవోసాకులుచెప్పి కొన్నిసౌకర్యాలు పొందుతూండటము పారిశ్రామికవేత్తలకు పరిపాటి అయింది. ఇన్‌ఫ్లేషన్ నివారణపథకంలో పారిశ్రామికవేత్తలకు చాల సౌకర్యాలు చూపించారు; కాని ఉత్పత్తి అధికంకావటంగాని, నూతనపరిశ్రమలు స్థాపించటంగాని జరగటంలేదు. పరిశ్రమలను ఇప్పుడేకాదు, ఎప్పుడూ జాతీయం చేయబోవటంలేదని ప్రకటించినా ఫలితం కనిపించటంలేదు. రెండున్నరఏండ్ల క్రితం సోషలిస్టు దృక్పథంతో ప్రారంభమైన ఆర్థికవిధానం ఈనాడు కాపిటలిస్టు విధానంగా మారిపోయింది. అయినప్పటికీ పారిశ్రామికవేత్తలు సమ్మెచేస్తూనే వున్నారు. ఎన్నిసౌకర్యాలు కల్పించినా, ఈ పారిశ్రామికవేత్తలు ఉత్పత్తి అధికంచెయ్యలేరని పదే పదే రుజువౌతున్నది; అట్టి అసమర్థులను తొలగించి పరిశ్రమలను వశపరచుకోటానికి భారతప్రభుత్వం జంకుతున్నది.

వ్యావసాయిక, పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి తగ్గిపోతూ, విదేశాలనుంచి ఆహారధాన్యాల దిగుమతులు వృద్ధిఅవుతూ ఎక్కువధనం ఖర్చవుతుండటంవల్ల 'ఇన్‌ఫ్లేషన్' ఒకసమస్యగా పరిణమించింది. దేశంలో జీవనవ్యయం మూడురెట్లు, చలామణీలోవున్న ధనం 5–6 రెట్లు 1939–48 సంవత్సరాలమధ్య పెరిగి, ప్రజానీకానికి జీవితం అసంతృప్తికరమైనది. చలామణీలోవున్న ధనం పెరుగుతూ, మార్కెట్‌లో వస్తువులు తగ్గుతూండటంవల్ల ధరలు ఇంకాపెరిగి, విప్లవానికి దారితీసేప్రమాదం ఏర్పడింది. అందువల్ల ఆర్థిక శాస్త్రవేత్తలను, పారిశ్రామిక

వేత్తలను, కార్మికుల ప్రతినిధులను సంప్రదించి 'ఇన్‌ఫ్లేషన్' నిరోధానికి భారత ప్రభుత్వం సుదీర్ఘ పథకాన్ని తయారుచేసింది. ఆ పథకం, ఇతరవిధానాలవలెనే, ఆచరణలో అసమగ్రంగాను, అసంతృప్తికరంగాను వుండి, అవకతవకగా అమలు జరుగుతూ ఏమాత్రము ప్రయోజనకారిగా లేదు.

భారతదేశం ఆర్థికంగా కొంతవరకు బ్రిటన్‌పై ఆధారపడివున్నది. పారిశ్రామికాభ్యున్నతికి కావలసిన యంత్రసామగ్రి బ్రిటన్‌నుంచే తెచ్చుకోవాలి. మన ఎగుమతి, దిగుమతులు ఎక్కువభాగం బ్రిటిష్ కామన్వెల్త్ దేశాలతోనే జరుగుతున్నవి; రూపాయి స్టర్లింగ్‌కు ముడిపెట్టబడివున్నది. మనకువున్న స్టర్లింగ్ నిలువలు ఇంకా శాశ్వతంగా పరిష్కరింపబడలేదు. మనదేశం ఆదినుంచికూడా ఆర్థికంగా బ్రిటన్‌పైననే ఆధారపడివుంది; ఆ సంబంధాలు ఒక్కమారుగా త్రెంచివేసుకోవటం కష్టం. ఆర్థికవిషయాలలో కొంతవరకు బ్రిటన్‌పై ఆధారపడివున్నంతమాత్రాన మనస్వాతంత్ర్యానికి ఏమాత్రము భంగంకలగదు. కాని వాస్తవ ఆచరణలో బ్రిటన్ చెప్పిన విధానాన్నే కామన్వెల్త్‌దేశాలు, స్టర్లింగ్ ప్రాంత దేశాలు అనుసరించవలసివస్తున్నది. అందువల్ల మన ఆర్థికవిధానం కొంతవరకు బ్రిటన్ విధానాలపై ఆధారపడివుంటున్నది. ఇది కూడదు. మనదేశం ఆర్థికంగా బలపడి, విదేశాల నాణాల నిలువలు వృద్ధిచేసుకోగలిగినప్పుడు మనం స్వతంత్ర విధానాన్ని అనుసరించగలము; మనం బలహీనంగా వున్నప్పుడు ఇతరులపైన ఆధారపడక తప్పుతుందా?

గతరెండున్నర సంవత్సరాలలోను కార్మికజనశ్రేయోభివృద్ధికి భారతప్రభుత్వం చెప్పుకోదగిన కృషిచేసింది. కార్మికులకు భీమా, వైద్యసౌకర్యాలు, గనులచట్టం, ఫ్యాక్టరీలచట్టం సవరణ మొదలైన అభ్యుదయసూచక విధానాలు ఆచరణలోకి వచ్చాయి. వీటి సత్ఫలితాలు ముందు ముందు బాగా గోచరించగలవు. దేశంలో కార్మికోద్యమం మూడు నాలుగు ముక్కలుగా చీలిపోయి, బహునాయకత్వం క్రింద నడుస్తున్నప్పటికీ, అభ్యుదయపథంలోనే వున్నదని చెప్పాలి. కమ్యూనిస్టు ప్రాబల్యంక్రిందవున్న అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నశించిపోయింది; కాంగ్రెస్‌ప్రాబల్యంక్రిందవున్న అఖిలభారత జాతీయట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, సోషలిస్టులప్రాబల్యంలోవున్న మజ్దూర్ సభ ఇప్పుడు కార్మికనాయకత్వం పోటీ పడుతున్నాయి. ఈ పోటీ భవిష్యత్తులో మరింత తీవ్రమౌతుంది.

దేశం స్వతంత్రమైనతర్వాత ఇంతవరకు మూడు బడ్జెట్‌లు ప్రకటించబడినాయి, భారతప్రభుత్వం ఆనాటికానాడు ఏవిధంగా కాపిటలిస్ట్ దృక్పథాన్ని అలవరుచుకుంటున్నదో ఈ బడ్జెట్‌లు తెలియజేస్తున్నాయి. పరిశ్రమలపైన, పారిశ్రామికవేత్తలపైన, భాగ్యవంతులపైన పన్నులు తగ్గించటము, ఎక్కువసొమ్ము ఖర్చుచేయ

టము, సామాన్యప్రజానీకంపై పన్నులు వృద్ధిచేయటము, విద్య, ఆరోగ్యము, నిర్మాణాత్మక కార్యక్రమాలు మొదలైన అభివృద్ధి కార్యక్రమాలకు తక్కువసొమ్ము ఖర్చుచేస్తుండటము ఇందుకు నిదర్శనాలు.

భారతప్రభుత్వాదాయంలో నూటికి 48.7 వంతులు దేశరక్షణకు, సైనికశాఖ క్రింద వ్యయంచేస్తున్నారు. ఇప్పుడు భారతసైన్యం పూర్తిగా భారతీయుల ఆధిపత్యాననేవున్నది. ప్రాంతీయసైన్యాలను ఏర్పరచటానికి, యువకులను సైన్యంలోనికి ఆకర్షించటానికి, మన విమాన, నౌకాదళాలు వృద్ధిచేయటానికి పథకాలు తయారుచేసి, క్రమేణా అమలుజరుపుతున్నారు. భారతసైన్యం ప్రపంచయుద్ధ రంగాలలో కీర్తి నార్జించుకున్నదిగాని కాశ్మీర్ రణరంగంలోమాత్రం ఆశించినంతగా కృషిచేయలేకపోయింది. భారతసైన్యం ఇతోధికంగా వృద్ధిపొందటం అత్యవుసరం.

అధినివేశస్థాయిలో వుండి గత రెండున్నరఏండ్లలోను భారతప్రభుత్వము, భారతప్రజలు అనేకజటిల సమస్యలకు, కష్టసమయములకు లోనైనారు. అనేక విషయాలలో భారతప్రభుత్వం ఆశించినంత జయప్రదంగా, లభ్యపరిస్థితులలో సాధ్యమైనంత జయప్రదంగా కృషిచేయలేకపోయింది. ఒక్కసామాన్యమానవుడే గాక దేశంలో అన్నివర్గాలు ఇదివరకటికన్న ఇప్పుడు ఎక్కువకష్టాలు, నష్టాలు ఓర్చుకొనవలసివస్తున్నది; ఇప్పటి పరిస్థితి ఏమాత్రము సంతృప్తికరంగాలేదు; కాని నిస్పృహచెంది, అధైర్యపడవలసిన అగత్యంకూడ ఏమీ కనిపించటంలేదు. పాలకులు ఇప్పుడిప్పుడే అనుభవం సంపాదించి, పరిపాలన చక్కబరచటానికి ప్రయత్నిస్తున్నారు. మన అధికారవర్గంలో చాలమంది, ముఖ్యంగా మన ప్రధానమంత్రి, తమ తప్పులు తాము తెలుసుకుని, సరిదిద్దుకోటానికి ప్రయత్నిస్తున్నారు. పరిస్థితులు ఇప్పటికన్న చెడిపోతే రాగల ప్రమాదం అందరూ గుర్తించారు. నవభారతం ఆనాటికానాడు తీసికట్టయిపోరాదనీ, నానాటికి బలపడి, అభ్యున్నతిజెంది ప్రపంచరాజ్యాలలో ఉత్తమస్థానం పొంది, ప్రపంచ శాంతి, సౌభాగ్యాలకు కృషి చేసి, భారతదేశప్రతిష్ట వ్యాపింపజేయాలని అందరూ కోరుతున్నారు; ఇందుకు తగిన కృషిచేయటానికి నడుంబిగించి, దీక్షాపరులవుతున్నారు. ఈ సంకల్పబలంతో మన చరిత్ర, మన నాగరికత, మన విశిష్టతలయందు విశ్వాసంతో, మనం ఉత్సాహ, ధైర్యాలతో భవిష్యత్తులోకి తొంగిచూస్తున్నాం. ఈనాడు జరుగుతున్న ఈ శుభ సంఘటన మన ధైర్యాన్ని, ఉత్సాహాన్ని, దీక్షను ద్విగుణీకృతంచేసి, మన లక్ష్య సాధనకు తోడ్పడేటట్లు ఆశీర్వదించవలసిందని స్వతంత్రభారత రిపబ్లిక్ పౌరులుగా, భగవంతుని ప్రార్థించుదాం.



# ఆంధ్ర రాష్ట్రము

వావిలాల

"తేటల్ దేరెడు కాంతిపూరముల నుద్దీపించు ముత్యాలము
ప్పేటల్ వోలె తృతీయకంఠమున శోభింపుల్ నిగారించు, చే
నాటన్ జీవనశోషణల్ గనని కృష్ణా, గౌతమీ పెన్నలన్
గాటంపుం దమి త్రావువారమిదె కాంక్షాక్షీర మాంధ్రావనీ !"

మనం ఆంధ్రులం. "ఒకభాష మాటలాడుజనులలో నొకతల్లిపాలు త్రాగువారికంటె నన్యోన్యభావము హెచ్చు. జాతీయవ్యక్తి గాఢము. ఐకమత్యము మెండు. కావున ఆంధ్ర భాష నభివృద్ధిపరచినకొలది ఆంధ్రజాతీయభావము హెచ్చసాగెను. మరియు లోకమునకే జనుల కధికారపరంపర లధికమో, స్వాతంత్ర్యము మెండో వారే బాహుబలమునందున, శౌర్య ధైర్యములయందును నధికులై సుఖసంపదలతో తులతూగగలరు. విద్యలు ప్రబలును. ఆంధ్రభాషను రాజ్యాంగభాషగ చేయుటచే భాషగౌరవ సతిశయించును. ఆంధ్రభాషమూలముగ విద్యనేర్పబడనియెడల దేశమున విద్య బాగుగవ్యాపింపదు. విద్యావ్యాపకమువలననే విజ్ఞాన ప్రచారమువలననే రాజకీయ, సాంఘిక, అభివృద్ధికలుగుట కవకాశము కలుగును. జీవితాశయము లున్నతిచెందును. మనం ముక్కోటి ఆంధ్రులం, అయినా వివిధపాలనలక్రింద ముక్కలై చెక్కలై కలుబాటులేకుండా వుండిపోయినాం.

బెంగాలు విభజనతో వందేమాతర ఉద్యమంతో భారతదేశంలో నవజాతీయచైతన్యం ప్రజ్వరిల్లింది. బెంగాలు విభజన ప్రతీకారంగా బయలుదేరిన ఉప్పెంగులో ఆంధ్రులు స్వీయరాష్ట్రవాంఛతో ముందుకువచ్చారు. భాషారాష్ట్రాల విభజన కావలెనని ఆందోళన ప్రారంభించినవా రాంధ్రులు. 1906 లో బయలుదేరిన ఆంధ్రరాష్ట్రవాంఛ జొన్నవిత్తుల గురునాధం, ఉన్నవ లక్ష్మీనారాయణ మున్నగు ఆనాటి యువకుల నవభావాలలో రూపురేఖలు దాల్చి శ్రీ చల్లా శేషగిరిరావుగారి వ్యాసంగా "దేశాభిమానిలో" 1911 లో ప్రజలలోకి వచ్చింది.

ఉద్యోగాలకాంక్షతో సాగుతున్న ఈనాటి భారతీయ రాజకీయోద్యమంవలెనే అరవలకన్నా తాము తీసిపోమని, తామూ తమ ప్రాంతాల్లో ఉద్యోగాల కర్హతకలిగియున్నామని విద్యా సంస్థలు, ప్రాజెక్టులు, పారిశ్రామికకేంద్రాలు ఆంధ్రాలోకూడా వెలయవలెనని ఆంధ్రభాష అభివృద్ధికావలెనని ప్రారంభమైన ఆందోళన 1913 లో ఆంధ్రమహాసభారూపందాల్చింది.

ప్రథమ ప్రపంచయుద్ధంలో తమకూ సేనలో ప్రవేశార్హత యివ్వవలసిందిగా కోరుతూ పూర్వాంధ్ర పౌరుషం, చరిత్ర, ప్రతిభ సంస్మరించడంతో ఆంధ్రులు కదిలారు.

గతచరిత్ర దృక్పధం ఉండేకాని ఆనాటి చిన్నాభిన్నమై అటు నైజాం, మైసూరు, బస్తరు సంస్థానంలో మిగిలిపోయినవారు ఆంధ్రులనే భావం స్మృతిలేదు. బ్రిటిషుపాలనక్రింద

ఉద్యోగాలవాంఛతో ఉద్యమం ప్రారంభమైనందున మద్రాసు రాజధానిలో ఉన్న ఆంధ్ర ప్రాంతము ఆంధ్రరాష్ట్రంగా భావించి భాషాధారకంగా ఈ ప్రాంతాలను ఒకరాష్ట్రంగా చేయవల్సినదే అందోళన సాగించబడింది. ఆంధ్రజాతి చరిత్ర సంస్మరణకే సరిపోయిందిగాని, ఆంధ్రులు విశాలప్రాంతంలో మిగిలిపోయిన భావనయే రాలేదు.

భాషా జాతీయోద్యమాలతో జాగరితమైన ఆంధ్రులు, భారతజాతిని అవమానాలపాలు చేస్తున్న పరప్రభుత్వపు బాధలను గ్రహించారు. 'పరతంత్ర జనములపాలి కష్టంబు చెప్పంగ నలవియే శివునకునైన' అన్న శ్రీనాథుని హెచ్చరిక గుర్తుకుతెచ్చుకొని భారతజాతీయోద్యమంలో లీనం కాదలంచింది.

ఇది లోకమాన్య బాలగంగాధర తిలక్ గ్రహించాడు. ఆంధ్రుల ఆందోళనా ఫలితంగా తిలక్ ప్రోత్సాహాలతో 1917 కలకత్తా కాంగ్రెస్‌లో ఆంధ్రులు ఒకరాష్ట్రంగా గుర్తింపబడ్డారు. అంటే కాంగ్రెస్ కార్యకలాపాలలో ఆంధ్రులు తమకొక ప్రాంతీయసంఘాన్ని సాధించారు. భాషా జాతీయతతో ప్రారంభమైన ఆంధ్రోద్యమం భారతజాతీయోద్యమంలో లీనమయిపోయింది. ఇందులోవున్న ఒకరు అర స్వార్థపరులు ఉద్యోగాలకై ప్రభుత్వాన్ని ప్రాధేయ పడుతూ విన్నపాలు శాసనసభాతీర్మానాలు సాగించారు. సర్ బి. యన్. శర్మగారు 1918 లో కాంగ్రెస్ శాసనసభలో తీర్మానంతెచ్చారు.

1919 లో రాజ్యాంగచట్టం యేర్పడింది. ఆంధ్రరాష్ట్రం రాలేదు. అందులో రాష్ట్ర విభజనకు 52 (ఎ) సెక్షను యేర్పడిందేగాని ఆంధ్రరాష్ట్రం యేర్పడలేదు. దీనితో ఆంధ్రులకూ అసంతృప్తికలిగింది.

అనాడు 1820 లో వచ్చిన నాన్-కోఆపరేషన్ ఉద్యమంలో పల్నాడు అడవిపుల్లరి తిరుగుబాటు, సీతానగరం పెదనందిపాడులలో పన్నుల నిరాకరణ, చీరాల ప్రజానిర్గమనంలతో ఆంధ్రులు బ్రిటిషుప్రభుత్వాన్ని ఖంగారుపరిచారు. అయినా ప్రజాసంఘటితంగా నడవనందున విఫలమయింది. ఈ విఫలత కసంతృప్తిచెందిన యువకులు తీవ్రవాదులుగాసాగారు. అట్టి వారిలో ఒకరు అల్లూరి సీతారామరాజా మన్యం ప్రజలోకిచేరి సాయుధమగు ప్రజా తిరుగుబాటు సాగించాడు. తమ ఉద్యమ విఫలతతో పెద్దలు స్వరాజ్యపార్టీగా శాసనసభలద్వారా రాజకీయ ప్రచారం సాగించారు.

మన్యం తిరుగుబాటు మాకు సంబంధంలేదని కాంగ్రెస్ నాయకత్వం అనడంతో ఆ ఉద్యమాన్ని తన బలంతో బ్రిటిషు ప్రభుత్వం హతమార్చింది. అంతవరకు జాతీయోద్యమాన్ని నడపిన నాయకత్వం శాసనసభా ప్రవేశంచేసి తమను ప్రతివిషయంలో ప్రతిఘటించుచున్నందున ఆంధ్రసమస్యను సంతృప్తి పరిచినట్లు చూపుతూ ఆంధ్రోద్యమంలో ఒకభాగమగు భాషాభివృద్ధి కవకాశం, అంటూ ఆంధ్రవిశ్వవిద్యాలయంను 1926 ఏప్రిలులో ఏర్పరచి, కేంద్ర నిర్ణయంతో ఆంధ్రులలో - ఆంధ్రోద్యమంలో చీలికలు కలుగచేయగలిగింది.

అంతటితో మరల ఆంధ్రరాష్ట్ర ఆందోళన సాగింది. 1927 లో వేమవరపు రామదాసు గారు స్టేట్‌కౌన్సిలులోనూ, వరాహగిరి జోగయ్యగారు కేంద్రశాసనసభలోనూ, పిల్లలమర్రి అంజినేలుగారు మద్రాసు శాసనసభలోను ఆంధ్రరాష్ట్రం—11 జిల్లాలతో—యేర్పాటు చేయ

వలెననే కొత్తతీర్మానాలు తెచ్చారు. ఇవినెగ్గినవి. కాని శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ప్రభుత్వపరిపాలన ప్రాంతీయభాషలో జరుగనలెనని తెచ్చిన కొత్త తీర్మానం నెగ్గలేదు. ఆంధ్రులలో మరల ఒక నూతనావేశం ప్రాదుర్భవించింది.

అటులే భారతదేశంలోనూ సైమనురాకతో నూతన రాజకీయచైతన్య ప్రజ్వరిల్లింది. యుద్ధానంతర ఆర్థిక ఒడుదుడుకులు రాజకీయ సంక్షోభం రూపందాలుస్తున్న ఆదనులో అన్నివర్గాలు కలిసి ఈ సైమనుకమిషనును బహిష్కరించినవి. ఆంధ్రులు బహిష్కరణలో దక్షిణదేశానికే నాయకత్వం వహించారు. చరిత్రను నిర్మించారు.

1928 లో అఖిలపక్షసభ జరిగింది. నెహ్రూ (మోతీలాల్) నివేదిక సమర్పించింది. ఆంధ్రరాష్ట్రం యేర్పడవలెనని సూచించింది. 1929 జనవరిలో కన్వెన్షన్‌లో ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అంగీకరింపబడింది. కాని చివరకు రాష్ట్రాలకు విశిష్టాధికారాలు (రిసిడ్యుయరీ పవర్సు) ఉండవలెనా లేదాయనే మీమాంసతో చీలిపోయింది.

1920 జనవరి 1 న భారతదేశ ఆశయం సంపూర్ణ స్వాతంత్ర్యం అని ప్రకటింపబడింది. భారతదేశాన్ని అల్లకల్లోల పరుస్తున్న సామ్రాజ్యవాద ఆర్థికనీతితో ఈ ఆర్థికసంక్షోభం తీవ్ర రాజకీయ ఉద్యమంగా 1930-31 లలో సాగింది. ప్రజల త్యాగాలతో, దీక్షతో, ఉద్యమం ప్రతిభావంతంగా పరువులెత్తింది. ప్రభుత్వం లొంగి గాంధి - ఇర్విను ఒడంబడిక చేసుకుంది. ఇదేసమయంలో సైమను నివేదిక వచ్చింది. రాష్ట్రస్వాతంత్ర్యం, పెడరేషను విధానాన్ని అమలుజరుపవలెనన్నది. ఆంధ్రుల రాష్ట్రాందోళన తీవ్రరాజకీయ రూపందాలుస్తుందని అంగీకరించికూడా తమను బిచ్చమడగలేదని సైమన్‌కమీషన్ ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని త్రోసివేసింది.

రెండవ రౌండుటేబిల్ సమావేశానికి గాంధిజీ కాంగ్రెస్ ప్రతినిధిగా వచ్చారు. ఆంధ్రులు తమకు రాష్ట్రం యేర్పరచ వలసిందిగా వాదించమని గాంధిజీని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వరాజీలు విఫలంగావడం జాతీయోద్యమాన్ని తీవ్రంగా ప్రభుత్వం అణచడం చరిత్రలో మిగిలిపోయింది. ఆంధ్రులు రాజకీయంగా ముందుంటున్నందుకు కచ్చతీర్చుకున్నట్లు ఒరిస్సా రాష్ట్రంలోకి ఆంధ్రప్రాంతాలు కలిపివేశారు.

రెండవ రౌండుటేబిల్ సభలో ఆంధ్రరాష్ట్రం కావాలెనన్న బొబ్బిలిరాజా 1934 లో మద్రాసు ప్రధానమంత్రి కాగానే ఈ చిన్నశివారు ఆంధ్రరాష్ట్రం ఎందుకన్నాడు. మళ్ళా ఆంధ్రుల్లో ఆవేశంపెరిగింది. ఇంతలో అసలు కాంగ్రెస్ ఉద్యమం హరిజనోద్యమంగా మారింది. అంతటితో చల్లబడిన రాజకీయాలలో ఆంధ్రోద్యమం తలెత్తి కొంత ఆందోళన సాగింది. 1935 అక్టోబర్ వచ్చింది. జాతీయోద్యమానికి ఎదురెత్తుగా పనికివస్తవనే చెడువుద్దేశంతోనయినా సింధు, ఒరిస్సా రాష్ట్రాలు నిర్మించి భాషారాష్ట్రాల నిర్మాణం ఆచరణలో సామ్రాజ్యవాదంకూడా అంగీకరించింది.

ఈ నూతన రాజ్యాంగాన్ని ఎదుర్కోవడమా అమలు జరపడమా అనే ఆలోచనలో కాంగ్రెస్ నాయకత్వం ఆలోచనలోపడ్డది. భారత కమ్యూనిస్టుపార్టీ నిషేధింపబడింది. రాజకీయంగా మితవాదపంథా సహించలేని యువకవర్గం సోషలిస్టు భావాలతో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీగా రూపొందింది. వామపక్షీయులందరు కలిసి ఆంధ్రలోకూడా వర్గసంఘాలు ప్రారంభించి

పనిచేయసాగారు. చివరకు శాసనసభలకు ఎన్నికలు జరుగుట, అందులో కాంగ్రెస్ అధిక సంఖ్యాకంగా ఎన్నుకోబడడం జరిగింది. విధ్వంసం చేయటానికే అమలు జరుపుతామంటూ కాంగ్రెస్ శాసనసభల్లో ప్రవేశించింది. మంత్రివర్గాలు స్వీకరించింది. కొన్నిరాష్ట్రాలల్లో కాంగ్రెస్ మరి కొన్నిరాష్ట్రాలల్లో ముస్లింలీగు మంత్రిత్వాలు సాగించినవి.

ఈ అదనులో ఆంధ్రోద్యమం ద్విముఖంసాగింది. మద్రాసులోని 11 జిల్లాలలో ఆంధ్ర రాష్ట్రాందోళన సాగుతుంటే నైజాం పాలనక్రింద నలిగిపోతున్న ఆంధ్రప్రజానీకం కనీసం తెలుగుచదువులతోనన్నా ఆంధ్రత్వాన్ని నిలుపుకుందామని హైదరాబాదునగరంలో 1922 లో ఆంధ్రజనసంఘం అంటూ శ్రీ మాడపాటి హనమంతరావుగారి నాయకత్వాన నిర్మించు కున్నారు. పల్నాటిఉద్యమాన్ని అణచివేసిన వర్నన్ కలెక్టరు ఈ పల్నాటివారు ప్రక్కన వున్న నైజాంజనంతో కలిస్తే వారి నణచడం కష్టం అవుతుంది కావున వెంటనేవచ్చుటకు వీలుగా రైలువే వేయమని ప్రభుత్వాన్ని కోరినట్టే, 1922 లో ఆంధ్రసంఘం నిర్మించిన శ్రీ మాడపాటివారిని నైజాం పోలీసుశాఖా మంత్రి కర్నల్ ట్రెంచి పిలిపించి ఈ ఆంధ్రశబ్దం మానుకోమన్నాడుట. అందుకు ఈ ఆంధ్రశబ్దం ఆంధ్రులకు తమ పూర్వచరిత్రను స్మరణకు తెచ్చి సంస్థానం వెలుపలనున్న ఆంధ్రులూ తామూ ఒకేజాతివారమనే భావన కలిగిస్తుందని ఆ భావన సంస్థానానికే ముప్పుకలిగించగలదని, అనేదేకారణమన్నాడట. ఈ ఆంధ్రజన సంఘం 1930 లో నైజాంరాష్ట్ర ఆంధ్రజనకేంద్ర సంఘంగా పరిణతిపొంది తెలంగాణా ఆంధ్రులలో ఆంధ్ర చైతన్యాన్ని కలిగించింది. ప్రజలలో నూతన చైతన్యాన్ని కలిగించ సాగింది. ఇచట మంత్రివర్గాల రాక అన్ని సంస్థానాలల్లోవలెనే, అంతకన్నా అధికంగా కూడా చైతన్యంకలిగించి నైజాం ఆంధ్రమహాసభ వృద్ధిచెంది ఆంధ్రుల రాజకీయసంస్థఅయి, చివరకు స్టేటుకాంగ్రెస్ నిర్మాణానికి పునాది అయింది.

మరల ఆంధ్రరాష్ట్రవిషయమై ఆంధ్రులలో ఆందోళన అధికమయింది. ఆంధ్రోద్యమం రజతోత్సవం మహా ఉత్సాహంగా విజయవాడలో జరిగింది. ఆంధ్రులలో ఉత్సాహంకలిగిం చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయకేంద్ర కారణంగా యేర్పడిన రాయలసీమ సర్కారు అభిప్రాయభేదాలు పోగొట్టుకొనుటకు శ్రీబాగుపాక్టు చేసుకోవడం జరిగింది.

భాషాప్రయుక్తరాష్ట్రాల సిద్ధాంతాన్ని అంగీకరించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అఖిలభారత కాంగ్రెస్ 1938 లో కలకత్తా సమావేశం భాషారాష్ట్రాలు నిర్మించవలెనని మంత్రివర్గాలకాదేశించింది. 80 మంది సభ్యులు భాషాప్రయుక్తంగా రాష్ట్రాన్ని విభజించాలె నని కోరారు. చివరకు శాసనసభ తీర్మానించింది. కాని అమలుజరుపలేదు, అందుపై కాంగ్రెస్ హైకమాండ్వద్దకు ఆంధ్రులు 1938 ఆగస్టులో రాయబారం వెళ్ళారు. స్వరాజ్యంతో స్వరాష్ట్రం వస్తుంది త్వరపడవలదన్నారు.

కేంద్రనాయకత్వపు తాచ్చారం అనరాగా, విభిన్నదృక్పధాలవారూ తలలెత్త సాగారు. ఆనాటి మంత్రివర్గాలలో రాయలసీమకు స్థానం యివ్వలేదనేది అసలు అసంతృప్తికి మూలమయింది. రాయలసీమకు వెళ్ళిన సర్కారు ఉద్యోగుల ప్రవర్తనకూడా ప్రజలలో అసంతృప్తిని కలిగించుచూ వచ్చింది, ఉద్యోగాలవిషయంలో, ఆదరణలో, పదవులలో విశ్వవిద్యాలయ కేంద్రంలో, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడియున్న రాయలసీమ ఒక

సమస్యగనే వుండిపోయింది. దీనిని కొందరు తమ ప్రయోజనాల కుపయోగించుకొని పెడదారులుపట్టించ ప్రయత్నించి రాయలసీమ అభ్యున్నతి లభించినతర్వాతనే ఆంధ్రరాష్ట్ర ప్రాప్తి అంటూ ఆంధ్రోద్యమంలో చీలికతీయ ప్రయత్నించారు.

విభజించి పాలించడం నేర్చుకున్న గవర్నరు ఆంధ్రపెద్దలను పిలిచి ఆంధ్రులుకూడా తననే ఉమ్మడి గవర్నరుగా అంగీకరించితే మద్రానునగరం ఆంధ్ర - తమిళరాష్ట్రలకు రాజధానిగా రెండురాష్ట్రలను నిర్మిస్తానని దురాశలు కల్పించాడు. శ్రీబాగ్ పాక్టులో ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని హైకోర్టులలో రాయలసీమ వారేది కోరితే ముందు వారికదియిచ్చి మిగిలినది తీసుకుంటామన్న హామీకూడా మరచి మద్రానును రాజధానిగా ఆంధ్రరాష్ట్రం నిర్మించవలెనని, 1938 లో ఆంధ్రులు తీర్మానించారు. ఇదే అవకాశంగా మద్రాను రెండు రాష్ట్రలకు జాయంటు రాజధానిగావుంటే రక్తప్రవాహాలు జరుగుతవని లండన్‌కువ్రాసి గవర్నరు ఆంధ్రరాష్ట్ర విభజన ఆశ నిరాశచేయడమేగాక, మద్రానురాష్ట్ర రాజకీయాలలో మద్రానునగర సమస్యను ఆరని అగ్గిగా తయారుచేశాడు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఫెడరేషనును అంగీకరింపజాలమని, వయోజనులచే ఎన్నుకోబడిన ప్రజాపరిషత్తుద్వారా భారతరాజ్యాంగం రచింపబడవలెనని శాసనసభల్లో 1939 లో తీర్మానించింది. స్వరాజ్యంవస్తే అందులో రాష్ట్రపునర్విభజన జరుపుకోవచ్చునని సలహాయిచ్చింది. ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం రానేవచ్చింది.

ఎందుకై యుద్ధం సాగిస్తున్నామంటున్నారో ఆ స్వయంనిర్ణయమును ఇండియాకుకూడా అమలుజరిపితే యుద్ధానికి సహాయంచేయ సిద్ధంగావున్న తమకు అధికారం యివ్వలేదంటూ కాంగ్రెస్ మంత్రులు రాజీనామా యిచ్చారు.

ఆంధ్రరాష్ట్రంలో యుద్ధ వ్యతిరేకోద్యమం తీవ్రంగా సాగింది. కాంగ్రెస్‌వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు అంతా వేలకొలది జెయిళ్ళపాలయినారు. ఆంధ్రజాతి ఆశయం 'స్వయంనిర్ణయం స్వయంజీవనం, స్వయంపోషకం' అని ఆంధ్రమహాసభ నిర్ణయించింది. అయితే తమకు ఆంధ్రరాష్ట్రంయిస్తే యుద్ధానికి సహాయంచేస్తామని 1941 లో ఆంధ్రమహాసభతరపున ప్రకటనలు జరిగినవి.

యుద్ధం ప్రపంచవ్యాప్తమయింది. రష్యా చైనాలు ఈడ్వబడినవి. పూర్వ పశ్చిమరంగాలల్లో తీవ్రరూపందాల్చినది. ఇండియాకు చైంగ్‌కైషేక్ వచ్చాడు. ఇండియా యుద్ధరంగంలోకి రావాలెనని కోరాడు. అంతర్జాతీయ దృష్ట్యా, ఇండియా కీలకస్థానం ఆక్రమించింది. అమెరికా, చైనా, రష్యా, తదితరదేశాలలో ఇండియా సమస్య ప్రధానసమస్య అయింది. జపాను ఇండియామీదకూడా బాంబులువేసింది. క్రిప్సు ఆదేసమయానికి దిగాడు. రాయబారాలు సాగించాడు. ఆంధ్రరాష్ట్రం యివ్వండి అంటే అది గడ్డుసమస్య కాదులెమన్నాడు. రాష్ట్రాలు విడిపోయేహక్కుతో, సంస్థానాలు చెక్కుచెదరకుండా ఉండేటట్లు, బ్రిటనుతో ఒడంబడిక చేసుకుండేటట్లు, రక్షణమినహా స్వరాజ్యం యుద్ధానంతరం యిస్తానన్నాడు. అనాటికిచ్చేది యేమీలేదు గావున ఇండియాలో అన్నిపార్టీలు తిరస్కరించినవి.

కమ్యూనిస్టుపార్టీ ప్రజాయుద్ధవినాదం తీసుకుంది. భారతదేశంలో భాషసంస్కృతులతో యేర్పడ్డ వివిధజాతులు విడిపోయే హక్కుతో స్వయంనిర్ణయం హక్కుండాలెనన్నది.

అయితే మతంకూడా సంస్కృతేననే విపరీతాన్వయం చేయడంలో పొరపడ్డా భాషాసంస్కృతి గల ఆంధ్రజాతికి స్వయంనిర్ణయాధికరం వుండాలెనని, విడిపోయే హక్కుకూడా వుండాలెనని ప్రచారం సాగించింది.

తమ కధికారం యివ్వలేదనీ బ్రిటిష్‌ప్రభుత్వం ప్రతీకారం తీసుకోవలెనని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇండియా ఫెడరేషనుగా వుండవలెనని, రాష్ట్రాలకు విశిష్టాధికారాలు (రిసిడ్యుయరీ హక్కులు) వుంటవని, కష్టపడేవారికే రాజ్యాధికారం చెందవలెనని 1942 ఆగస్టులో ప్రకటించి బ్రిటనుకు "క్విట్ ఇండియా" చెప్పింది. దీన్ని ప్రభుత్వం అదనుగా తీసికొని కాంగ్రెస్‌ను అణచివేయసాగింది. ఉద్రిక్తులై ప్రజలు సాహసకృత్యాలు తీవ్రంగా సాగించి బ్రిటనుపై ఆవేశాన్ని కార్యరూపంలోచూపారు.

దేశమంతటా కరువు కాటకాలు నిలయతాండవమాడినవి. విశాఖలో ప్రళయతాండవమాడి 40 వేలను బలికొన్నది. రాయలసీమలో నృత్యంసాగించింది. ప్రజాజీవితమె తారుమారవడం, తోటి ఆంధ్రప్రజలుచూచారు. రాయలసీమ ఆర్థికదౌర్బల్యం ఆంధ్రప్రజాజీవితంకే ఎంత ప్రమాదమో గుర్తించగలిగారు. ఆంధ్రులంతా తమ సోదరులకు ఆపదలో ఆదరణచూపారు. శాశ్వతపరిష్కారం కావాలెనని అందుకు ప్రాతిపదికగా తుంగభద్ర ప్రాజక్టు నిర్మించాలెనని తేల్చుకున్నారు. తుంగభద్రా ప్రాజక్టు నిర్మాణంతో రాయలసీమ సోదరులలో కొంత నిబ్బరం యేర్పడింది.

ఈ యుద్ధసమయంలో భారతరాజకీయాలల్లో, అందూ ముఖ్యంగా ఆంధ్రరాజకీయాలల్లో, కమ్యూనిష్టుపార్టీ బలపడింది. కమ్యూనిష్టు రాజకీయాలు సంస్కరణతత్వంతో పొరపాటు పంధాపట్టినా, ఆంధ్రప్రజాజీవితంలోకి తెలంగాణా సమస్యలు, హైదరాబాదు రాజకీయాలు ఆంధ్రులకందరకు సంబంధించి తెలుసుకొనితీరవలసిన సమస్యలుగా జోడించబడినవి. నైజాం సంస్థానంలోని ఆంధ్రోద్యమంతో ఈ జిల్లాలలోని ఆంధ్రోద్యమం కలిసి నడుస్తుందని, నడువవలెననే ఆశను కలిగించింది. అంతతో అంతవరకు నడుస్తున్న 11 జిల్లాల ఆంధ్రరాష్ట్ర ఆశయం విశాలాంధ్రరాష్ట్ర ఆశయంగా పరిణమించింది. విశాలాంధ్రరాష్ట్రం రానిదే ఆంధ్రజీవితం సుఖప్రదం, సంపూర్ణం కాదని తేలిపోయింది. విశాలాంధ్ర నిర్మాణానికి నైజాం నవాబు ఉనికి అడ్డుఅనే భావంకూడా ప్రబలం అయింది. ఆంధ్రులు భాషావిషయకంగాను, చారిత్రకంగాను ఒకటేభావం పెంపొంది దీనిఫలితంగా 1944 సం॥ సింగరేణి బొగ్గుగనులలో తెలంగాణా, బ్రిటిషు ఆంధ్రులు గ్రంధాలయ నివేదికపై సమావేశమై ఆంధ్రుల సంస్కృతిని సమిష్టిగా రూపురేఖలు దిద్దుకోసాగారు.

ఆంధ్రశిల్పకళకు శిరోభూషణమైన నాగార్జునకొండ శిల్ప శిధిలాలను జగ్గయ్యపేట అమరావతి, ఘంటసాల శిల్పశిధిలాలవలెనే పరప్రాంతాలకు తీసుకొని పోవుటకు 1944 లో బ్రిటిషుప్రభుత్వం పన్నిన కుటిలవ్యూహాన్ని ఆంధ్రప్రజానీకం ఐక్యంగా ముక్కోటికంఠాలతో ఆరుకోట్లచేతులతో ప్రతిఘటించి తమజాతి పూర్వసంపదను నిల్పుకుంది. అప్పటినుండిముక్కోటి ఆంధ్రులతో గూడిన విశాలాంధ్రరాష్ట్రము ఆంధ్రరాష్ట్ర రూపమనేభావం బలపడిపోయింది.

ఇంతలో యుద్ధం ముగియడం, కాంగ్రెస్‌నాయకులు విడుదలకావడం, దేశంలో యుద్ధానంతర విప్లవా లుత్తుంగతరంగాలు ప్రజలను కదిలించివేయడం, బ్రిటిషు సామ్రాజ్యపు వాదులు

కదిలిపోవడం జరిగింది. ఇండియాకు రాజకీయాధికారం యివ్వకుండా తప్పనిస్థితి బ్రిటిషు ప్రభుత్వానికి కలిగింది. ఎన్నికలు జరిగినవి. కమ్యూనిస్టుపార్టీ విశాలాంధ్ర సమస్యతో ఎన్నికలు సాగించింది. మద్రాసులో కాంగ్రెస్ మంత్రివర్గం యేర్పడింది. విశాలాంధ్రరాష్ట్ర నిర్మాణం జరుగవలెనని ప్రజలలో తీవ్రప్రబోధం సాగింది. కనీసం 11 జిల్లాలతో రాష్ట్రం అన్నా యేర్పడవలెనని ఆందోళనసాగింది.

క్రిప్సు రాయబారవర్గం మరల సంప్రదింపులకు వచ్చింది. రాజ్యాంగ నిర్మాణపరిషత్తు ఏర్పరుపబడింది. నూతన రాజ్యాంగ రచనలోనే రాష్ట్రాలుకూడా ఏర్పడుతవని కాంగ్రెస్ నాయకులేమి, ఇంగ్లాండు ప్రభుత్వమేమి, మద్రాసు ప్రధాని ప్రకాశంగారేమి ప్రకటించడం జరిగింది. ఈ అదనులో శ్రీ సర్. బి.యన్. రావు ప్రణాళిక రాజ్యాంగపరిషత్తు తరఫున ప్రకటింపబడింది. ఉత్తరమద్రాసు, దక్షిణమద్రాసు, మద్రాసునగరం అంటూ ఉపరాష్ట్రాల నిర్మాణం ఒక మద్రాసురాష్ట్రంలో ఉండేటట్లు సూచింపబడింది. దీనిని ఆంధ్రులందరూ ఖండించారు.

భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణం విషయంలో రాజ్యాంగ పరిషత్తును వత్తిడిచేయుటకు 1947 జనవరిలో డిల్లీలో అఖిలభారత భాషారాష్ట్ర మహాసభ డాక్టరు పట్టాభి అధ్యక్షతను జరిగింది. దీనిఫలితంగా ఒక ఉపసంఘాన్ని రాజ్యాంగపరిషత్తు వేసింది. ఆ నివేదిక బయటికి రానేలేదు. ఆంధ్రులకు కోపకారణం అయింది. చివరకు 1947 ఏప్రిల్‌లో ప్రత్యేకాంధ్ర మహాసభలో నూతన రాజ్యాంగచట్టంతో ప్రత్యేకాంధ్రరాష్ట్రం అమలులోకి రాకపోతే ఆంధ్రులు ఇండియన్ యూనియన్‌నుండికూడా విడిపోయి సర్వస్వతంత్ర రిపబ్లిక్ స్థాపించు కుంటామనే తీర్మానంకూడా ఉపపాదింపబడింది.

రాజ్యాంగపరిషత్తులో భాషారాష్ట్రాల విషయమై ఆంధ్ర కర్నాటక మహారాష్ట్రాల తీర్మా నాలు తెచ్చారు. అందుపై పండిత నెహ్రూ అన్నింటికన్నా సావకాశంవున్న ఆంధ్రరాష్ట్ర నిర్మాణంలో తగు ప్రయత్నాలు చేస్తామన్నాడు.

కాంగ్రెస్ రాజకీయాలలో ఆంధ్రరాష్ట్రము ముఠాల సమస్యగా అపుడపుడు పరిణ మించింది. అరవల సహాయంచేతనే తాను నాయకుణ్ణి అయినానని ప్రకాశంగారు చెప్పినారు. ప్రకాశంగారి ప్రధానిత్వాన్ని ఆంధ్ర అరవ సమస్యగా అనేకులు పెద్దలు చిత్రించసాగారు. అంతటితో ప్రజలలో అనుమానాలు సంశయాలు కలిగినవి. అధికారంలో విఫలులయిన వారి అండన మరల రాయలసీమ సమస్య తలెత్తింది. ఇదే సమయంలో హైదరాబాదు సమస్య తలెత్తింది.

ఈలోగా ఇండియాలో అధికార మార్పుదల జరిగింది. ఇండియా పాకిస్థానులుగ విభ జింపబడినవి. ఇండియాకు స్వరాజ్యం ప్రకటింపబడింది. స్వరాజ్యంతో స్వరాష్ట్రం లభి స్తుంది లెమ్మన్న కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వపీఠం అధిష్ఠించడంవల్ల మరల స్వరాజ్య సమస్య ముందుకువచ్చింది. నవరాజ్యాంగంలో యేర్పరుపబడుతుంది లెమ్మన్నారు.

చివరకు నవరాజ్యాంగంకూడా వచ్చింది. ముందు రాష్ట్రం యేర్పడితేనేగాని రాజ్యాంగం షెడ్యూలులో చేర్చుటకు వీలులేదన్నారు. ఆంధ్రులకు నిజంగా ఆవేశం ఎక్కిపోయింది. పండిత నెహ్రూ 1948 మార్చిలో విశాఖపట్నంవచ్చినపుడు తీవ్రంగా అడిగారు.

చివరకు ధార్ కమిటీ నియామకం జరిగింది. నిర్మించదగిన భాషారాష్ట్రాలను పరిశీలించమంటే, చెయవచ్చునా, చెయకూడదా తేల్చుతామంటూ ఇండియాలో భాషారాష్ట్రాలు పనికి రావని, అది జాతీయతకే ప్రమాదమని ఉపజాతీయతను ప్రోత్సహించుతుందని, అవసరమైతే పాలనరాష్ట్రాలు నిర్మించవచ్చునని, ఆ విధంగా బొంబాయి, మద్రాసులు నిర్మించవచ్చునని, అచట భాషా మైనారిటీలకు రక్షణ యివ్వవచ్చునని, అసలు భాషారాష్ట్రాలు నిర్మించడం దేశశ్రేయస్కరంకాదని త్రోసివేశారు.

ఈ అదనులో నైజాం నిరంకుశత్వంక్రింద తెలంగాణా ప్రజానీకం తీవ్రప్రతిఘటన సాగించింది. విశాలాంధ్ర దృక్పధమేకాక ఉద్యమంకూడా బలపడసాగింది. నైజాం పోతాడని విశాలాంధ్ర యేర్పడుతుందని ప్రజలు-ముఖ్యంగా ఆంధ్రులు ముక్కోటిమంది-ఎదురుచూశారు. కాని దురదృష్టవశాత్తు నైజాం బ్రతికి బయటపడ్డాడు. ఆంధ్రులు విడిగానే వున్నారు.


ఈ సమయంలో ధార్‌నివేదిక భాషారాష్ట్రాల సిద్ధాంతాన్నే త్రోసివేయడం భారతప్రజానీకం సహించలేకపోయింది. ఒక దెబ్బన గాలి దుమారం రేగింది. ప్రజావాహిని నెదుర్కోలేక, జయపూర్ కాంగ్రెస్ నాయకత్రయ సంఘాన్నివేసింది. నూతన పరిస్థితుల కనుగుణంగా భాషారాష్ట్రాల సమస్య పరిశీలించవలెనని కోరింది. 'మద్రాసు వదలుకుంచేనే ఆంధ్రరాష్ట్రం' అని రెచ్చగొట్టారు. ఆంధ్రులలో చీలికలు, పోటీలు, ముఠాలు బలపరచగలిగారు. ఆంధ్రోద్యమాన్ని చిన్నాభిన్నం చేయగలిగారు. అయినా ఎట్టకేలకు అంతవరకైనా అంగీకారమనని ఆంధ్రసంస్థలు, మద్రాసు ప్రభుత్వం, తమిళనాడు కాంగ్రెస్ సంఘాలు వివాదంలేని ప్రాంతాలతో వెంటనే ఆంధ్రరాష్ట్రం యేర్పాటు చెయవలసిందిగా కోరారు. విభజనసంఘాలు వేశారు. అన్నిపేచీలతో చివరకు నివేదిక కేంద్రానికి పంపారు. ఆంధ్రరాష్ట్రం జనవరి 26 లోగానే ఏర్పడుతుందన్నారు. పండిత నెహ్రూమాత్రం జనవరి 26 లోగా కాకపోగా ఏప్రిల్ 1 వ తేదీలోగా యేర్పడేదికూడా చెప్పలేనన్నీ అన్నారు. కేంద్రనాయకత్వపు నిజాయితీ రుజువైంది.

కాని ఆంధ్రరాష్ట్రి రాజధాని పేరా అణగిమణియున్న స్థానిక దురభిమానాలన్నీ తల యెత్తుతున్నవి. ఒకమూల వారికి అన్యాయం జరుపబడదనేటందుకు హామీగా యేర్పడిన శ్రీబాగ్ పాక్టు హేతువును సబబును త్రోసివేసి స్థానికాభిమానానికి దారితీసింది. ఏది ఎటులున్నా ఆంధ్రరాష్ట్రం వెంటనే యేర్పడనున్నదో లేదో చూడవలసివున్నది.

అసలు ఆంధ్రరాష్ట్రం అన్నపుడు మద్రాసు రాష్ట్రంనుండి విభజన చేయబడనున్నవని దలంచబడిన 11 జిల్లాలు, అటులే తెలంగాణాలోని జిల్లాలుకూడా కలుపుకోవాలె. ఇంకా దక్షిణబస్తరు, ఒరిస్సాలో మిగిలిపోయిన భాగాలు, మైసూరు సంస్థానంలో నుండిపోయిన భాగాలు, ఇంకా ద్విభాషాప్రాంతాలుగా సరిహద్దులలోవుండి వివాదగ్రస్తంగావున్న భాగాలు అంతా చేరుతవి. అయితే అవి అన్నీ నికరంగా తేలేవరకు భవిష్యన్నిర్ణయప్రకారం చేర్పులు, మార్పులకు లోబడి, ప్రక్కపేజీలో చూపిన విధంగా వుంటుంది.

## ఆంధ్రరాష్ట్రం

| జిల్లా | జనసంఖ్య | వైశాల్యం. (చ. మై.) | ఎకరాలు. |
|---|---|---|---|
| విశాఖపట్టణం | 3636900 | 14440 | 5198106 |
| తూర్పుగోదావరి | 2076830 | 5779 | 3439741 |
| పశ్చిమగోదావరి | 1465101 | 2977 | 1925887 |
| కృష్ణా | 1564684 | 3469 | 2221168 |
| గుంటూరు | 2277283 | 5795 | 3689980 |
| నెల్లూరు | 1617026 | 7942 | 5087200 |
| చిత్తూరు | 1632395 | 5951 | 3771906 |
| చెంగల్పట్టు సేలం | 400000 | 300 | — |
| మైసూరాంధ్ర | 600000 | 5000 | — |
| అనంతపురం | 1171419 | 6734 | 4311447 |
| కడప | 1056507 | 5923 | 3798169 |
| కర్నూలు | 1146250 | 7634 | 4863565 |
| బళ్ళారి (3 తా) | 345310 | 253 | 131952 |
| రాయచూరు (2 తా) | 200000 | 500 | — |
| మహబూబ్ నగర్ | 1068209 | 5326 | 4408640 |
| అత్రాప్ బల్దా | 616433 | 2651 | 1693640 |
| హైదరాబాద్ | 466504 | 53 | — |
| మెదక్ | 758220 | 3198 | 2046720 |
| నిజామాబాద్ | 647043 | 2365 | 2089600 |
| కరీంనగర్ | 1355415 | 5722 | 3662080 |
| నల్లగొండ | 1275352 | 6049 | 3871860 |
| వరంగల్ | 1321838 | 7944 | 5048160 |
| అదిలాబాద్ | 826622 | 7294 | 4668160 |
| దక్షిణబస్తర్ | 324560 | 8000 | — |
| ఒరిస్సాంధ్ర | 1000000 | 10000 | — |
| మొత్తం సుమారు | 30000000 | 150000 | — |


ఆంధ్రావని-
రాష్ట్ర స్వరూపం
I ఒరిస్సా ప్రాంతం
II మధ్యరాష్ట్రాల ,,
III తెలంగాణా ,,
IV కర్ణాటక ,,
V మైసూరు ,,
VI తమిళ ,,
1, 2, 3-వివాదగ్రస్తజిల్లాలు
ఇచ్ఛాపురం
ఒరిస్సా
ఉ.విశాఖ
ద.విశాఖ
విశాఖపట్టణం
బస్తరు
చాందా
ఆదిలాబాద్
కరీంనగర్
నిజామాబాద్
మెదక్
వరంగల్
సికింద్రాబాద్
హైదరాబాద్
నల్గొండ
మహబూబ్ నగర్
రాయచూరు
బళ్ళారి
కర్నూలు
అనంతపురం
విజయవాడ
గుంటూరు
చిత్తూరు
కోలారు
మైసూరు
ఉ.ఆర్కాటు
తడ
మద్రాసు

ఇది అంతా విజంగా అసలు ఆంధ్రరాష్ట్రం. అయితే దీన్నిసాధించటానికి మనప్రజాబలం చాలలేదు. అందుకై ఆంధ్రులంతా కేంద్రీకరించవలసివుంది. ఇది అంతా లభించేవరకు మనము ఆంధ్రరాష్ట్రం అని చెప్పుకొనుటకు అర్హతలేనివారమే. అయినా ఈనాడు మద్రాసు రాష్ట్రంలోని వివాదంలేని 11 జిల్లాలతో మొత్తం ఆంధ్రరాష్ట్రం యేర్పడుటకు అన్నిప్రయత్నములు చేయడంవల్ల, ఒకవేళ ఏర్పడినాకూడా, ఏర్పడేరాష్ట్రం యిదే. ఈ ఆంధ్రరాష్ట్రానికి సంబంధించిన వివరాలు పరికించుదాం.

## పాడిపంటలు

మనదేశం అసలు వ్యవసాయదేశం మనదేశం. పాడిపంటలు సమృద్ధి అని చెప్పుకుంటుంటాం. వ్యవసాయం పాతపద్ధతిలో నడుస్తున్నందున వ్యవసాయానికైనా, జీవనానికైనా, ప్రాణాధారానికైనా పాడి అవసరం. అందుకు పశువులు అవసరం. ఈ పాడి 'వివిధదేశాలను పోల్చుకుంటే ఎంత క్రిందవున్నామో తేలగలదు. ఇంగ్లాండులో ఆవు 50 పౌనుల పాలు యిస్తుంది. మనదేశంలో 5 నుండి 10 పౌనులు యిస్తుంది. అదే మన ఆంధ్రదేశంలో ఆవులు సగటు 6 పౌనులకన్నా అధికం యివ్వవు. పోతే గేదెలు మనకు అధికం అని తలుస్తాం. అవి 10 పౌనులకన్నా సరాసరి యి'స్తవని తలంచజాలము. ఇతరదేశస్థులుత్రాగే పాలకు మనకు సంబంధమేలేదు. మనదేశంలో పంజాబులోనే తలకు రోజుకు 19 ఔన్సులు త్రాగుతారు. సింధులో 6 ఔన్సులు. ఇక మద్రాసు రాజధానిలో సగటు 3 ఔన్సులే. ఈ అంకెలు ఆంధ్రలోకివస్తే ఇంకా తగ్గుతవనక తీరదు రాయలసీమ పశువులకు మేతలేక వందలాది గత అయిదు సంవత్సరాల్లో చనిపోయినవి. మన ఆంధ్రదేశంలో పాడికి, వ్యవసాయానికి ఉపయోగపడే పశువుల సంఖ్య ఈవిధంగావుంది.

పశువులు (వేలల్లో)

| జిల్లా | ఆవులు | గేదెలు | గొర్రెలు | మేకలు | ఎద్దులు | దున్నలు |
|---|---|---|---|---|---|---|
| విశాఖపట్నం | 295 | 187 | 626 | 380 | 431 | 241 |
| తూర్పుగోదావరి | 252 | 148 | 58 | 121 | 311 | 68 |
| పశ్చిమ గోదావరి | 172 | 165 | 106 | 100 | 220 | 66 |
| కృష్ణా | 144 | 268 | 192 | 168 | 177 | 43 |
| గుంటూరు | 121 | 362 | 518 | 176 | 203 | 72 |
| కర్నూలు | 92 | 171 | 471 | 212 | 178 | 13 |
| బళ్ళారి (9 తా) | 96 | 82 | 272 | 163 | 203 | 7 |
| అనంతపురం | 153 | 90 | 799 | 255 | 250 | 18 |
| కడప | 83 | 150 | 407 | 175 | 150 | 27 |
| నెల్లూరు | 243 | 262 | 757 | 263 | 226 | 78 |
| చిత్తూరు | 335 | 94 | 581 | 344 | 341 | 46 |

ఈ పశు సంపదతో పాడి అనుభవించడమేగాక వ్యవసాయంకూడా చేయించుకొనవలసి వచ్చుచున్నది. ఈ పశువులచే చేయింపబడిన పంటల వైశాల్యం సాగువివరాలు పరిశీలించుదాం.

## సాగుదల

(వేల ఎకరాలలో)

| జిల్లా | మొత్తం | సాగు | అడవులు |
|---|---|---|---|
| విశాఖపట్నం | 5198 | 1576 | 1340 |
| తూర్పుగోదావరి | 3439 | 1009 | 864 |
| పశ్చిమగోదావరి | 1925 | 885 | 116 |
| కృష్ణా | 2221 | 1172 | 125 |
| గుంటూరు | 3689 | 2135 | 468 |
| నెల్లూరు | 5087 | 1167 | 473 |
| కడప | 3771 | 731 | 523 |
| అనంతపురం | 4311 | 2040 | 452 |
| కర్నూలు | 4863 | 1959 | 1648 |
| బళ్ళారి (3 తా) | 1319 | 980 | 62 |

ఈ విధంగావున్న జిల్లాల్లోని వైశాల్యంలో అడవులు, బంజర్లు, అలాయతు భూములు పోను సాగుచేయబడుతున్న పై ఎకరాల పొలాలల్లో మానవుడు జీవించుట కవసరమైన ఆయాఆహార ధాన్యాల పంటల వివరం గమనిద్దాం.

## ఆహారపంటలు

(వేల ఎకరాలలో)

| జిల్లా | వరి | సజ్జజొన్న | పప్పులు |
|---|---|---|---|
| విశాఖపట్నం | 791 | 211 | 291 |
| తూర్పు గోదావరి | 698 | 116 | 158 |
| పశ్చిమ గోదావరి | 773 | 61 | 74 |
| కృష్ణా | 661 | 221 | 120 |
| గుంటూరు | 463 | 554 | 181 |
| కర్నూలు | 96 | 545 | 144 |
| బళ్ళారి (9 తా) | 32 | 823 | 187 |
| అనంతపురం | 134 | 425 | 325 |
| కడప | 121 | 342 | 61 |
| చిత్తూరు | 191 | 134 | 30 |

రాయలసీమలో వరిగె, కొర్ర అధికంగా సాగుచేస్తారు. రెండూ కలసి కర్నూలులో 509. బళ్ళారి (9 తా) 545, అనంతపురంలో 328, చిత్తూరులో 128 వేల ఎకరాలు సాగుచేయ బడుతున్నది.

ఈ పైపంటల విస్తీర్ణాన్నిబట్టి వ్యవసాయాభివృద్ధి ఎంత ప్రోత్సాహకరంగా సాగిస్తున్నదీ అవగతం అవుతున్నది. వరి, జొన్న, సజ్జ ఫలసాయం మనదేశాన్ని ఇతర దేశాలకు పోల్చుకొనిచూస్తే సగంకు తక్కువగావుంటుందని సాధారణంగా శాస్త్రజ్ఞులు వివరిస్తున్నారు. అందువలన వ్యవసాయకులు ఇతర జీవన అవసరాలకు, ఋణాలు తీర్చుకొనుటకు బీద రైతాంగమున్నూ, ధనం పోగుచేసి కూడబెట్టుకొనుటకు ధనిక రైతాంగం వ్యాపారపంటలు వేస్తున్నారు. వాటి వివరాలు—

## వ్యాపారపంటలు

(వేల ఎకరాలలో)

| జిల్లా | నూనె పంటలు | చెరుకు | పీచులు | పొగాకు |
|---|---|---|---|---|
| విశాఖ | 364 | 33 | 28 | 14 |
| తూర్పు గోదావరి | 140 | 17 | 14 | 19 |
| పశ్చిమ గోదావరి | 116 | 10 | 17 | 25 |
| కృష్ణా | 168 | 5 | 75 | 18 |
| గుంటూరు | 209 | 8 | 79 | 154 |
| కర్నూలు | 534 | 1 | 424 | 3 |
| బళ్ళారి | 406 | 17 | 82 | 28 |
| కడప | 239 | 3 | 23 | 1 |
| నెల్లూరు | 65 | 1 | 31 | 2 |
| చిత్తూరు | 201 | 26 | 0 | ¼ |

ఈ పంటలు పండినా తగినంత ఫలసాయం రావడంలేదు. అందుకు ఈ పంటలుపండుత వన్న హామీ యేవిధంగా వున్నదీ, ఈ వివిధపైరులు ఏఏ ఆధారాలక్రింద ఎంత సాగు అవుతున్నదీ, అసలుమొత్తం సాగుభూమిలో నీటిపారుదల గమనించుదాం.

## నీటిపారుదల

(వేల ఎకరాలలో)

| జిల్లా | కాల్వలు | చెరువులు | మొత్తం | శతి |
|---|---|---|---|---|
| విశాఖపట్నము | 291 | 461 | 868 | 55% |
| తూర్పుగోదావరి | 371 | 115 | 554 | 55 |
| పశ్చిమ గోదావరి | 698 | 113 | 828 | 93 |
| కృష్ణా | 570 | 66 | 682 | 58 |
| గుంటూరు | 408 | 22 | 448 | 21 |
| కర్నూలు | 35 | 58 | 115 | 6 |
| బళ్ళారి | 39 | 13 | 62 | 2 |
| అనంతపురం | 41 | 114 | 232 | 11 |
| కడప | 57 | 54 | 224 | 23 |
| నెల్లూరు | 148 | 260 | 562 | 48 |
| చిత్తూరు | 22 | 139 | 246 | 33 |

ఈ అంకెలతో పంటల నీటి ఆధారాలు ఏవిధంగావుందీ బోధపడింది. రాయలసీమలో అధికంగా చెరువులక్రింద ఆధారపడింది అవుపడుతూనేవున్నది. ఈ ఇతర ఆధారాలకు యింతవరకు ఆంధ్రదేశంలో యేర్పరచపడిన నీటివనరులు, పెద్ద పెద్ద ప్రాజక్టులు, వాటిక్రింది పారుదలప్రదేశం ఈవిధంగావుంది.

## నీటివనరులు

| సిస్టంపేరు | ప్రారంభం | వడ్డీతో పెట్టుబడి (వేలల్లో) | సాగుదల (వేల ఎకరాల్లో) |
|---|---|---|---|
| లాభసాటివి | | | |
| గోదావరిజిల్లా | 1890 | 21962 | 840 |
| పెన్నానది | 1894 | 7071 | 170 |
| కంభం చెరువు | 1896 | 86 | 60 |
| పాయనీ ఆనకట్ట | 1897 | 304 | 23 |
| కృష్ణాడెల్టా | 1898 | 22819 | 968 |
| కృష్ణా తూర్పుబ్యాంక్ కాల్వ | 1913 | 5819 | 88 |
| లంకపోలవరం | 1934 | 1704 | 17 |
| లాభసాటివికానివి | | | |
| కడప కర్నూలుకాల్వ | | 23406 | 130 |
| ఇతరబాపతు | | 15566 | 136 |

ఇక చెరువులమీద ఆధారపడే రాయలసీమ విశాఖజిల్లాలల్లో పంట ఏపాటి నమ్మకం లేకుండా పోతున్నది. నీటిపారుదల వసరులు ఈవిధంగావుంటే వ్యవసాయజీవనం మరెలా వుంటుందో గమనించండి.

ఆంధ్రజిల్లాలలో వ్యవసాయజీవనం అవలంబించుతున్న కుటుంబాలు 3400000 అన వచ్చు. వీరిలో 2900000 మందికి అనగా నూటికి 80 మందికి సగటున ఎకరన్నర పొలం కూడా ఉన్నదని తేలదు. అయితే సుమారు 2400 మందికి పట్టాదారులకు తలకు 250 ఎక రాలకు మించివున్నట్లు తేలుతుంది. వ్యవసాయకులలో—

| | |
|---|---|
| స్వంతంగా చేసేవారు | 57% |
| కౌళ్ళకిచ్చేవారు | 14% |
| స్వంతపొలంలేని కౌలుదార్లు | 14% |
| స్వంతంగా కౌలుకు చేసేవారు | 15% |

అంతేకాదు. అసలు పొలంవున్నవారి పరిస్థితి ఆలోచించితే

| | |
|---|---|
| 2 ఎకరాలల్లోవారు | 51% |
| 2-5 ఎకరాల మధ్యవారు | 31% |
| 5-10 ఎకరాలవారు | 5% |
| 10 ఎకరాలపైగా | 11% |

నూటికి 89 వంతుల వ్యవసాయజీవనులకు నూటికి 15 మంది బీదరైతులుగనూ, 14 వంతుల మంది సెంటు పొలంకూడా లేనివారుగనూ ఉంటూ కౌలుచేసి జీవనంచేస్తున్నారు. ఈ కౌలుకు చేయునతను భూభామందుకు ఈ క్రింది విధంగా కౌలు చెల్లించుకుంటున్నాడు.

## పంటలో కౌలురేటు

| జిల్లా | నూటికి | |
|---|---|---|
| విశాఖపట్నం | 50.5 నుండి | 68.6 వరకు |
| తూర్పు గోదావరి | 62 ,, | 74.5 ,, |
| పశ్చిమ గోదావరి | 60 ,, | 67 ,, |
| కృష్ణా | 60 ,, | 70 ,, |
| గుంటూరు | 67 ,, | 75 ,, |
| కర్నూలు | 50 ,, | 67 ,, |
| నెల్లూరు | 33 ,, | 50 ,, |
| అనంతపురం | 33 ,, | 67 ,, |

చిత్తూరు, బళ్ళారి అంకెలు లభించలేదు. భూఖామందులకు ఈ విధంగా చెల్లించడంతప్పక పోగా వ్యవసాయ ఖర్చుల క్రింద నూటికి 40 నుండి 45 వరకు అవుతున్నది. వీటిని పరిశీలించితే నూటికి 89 మంది వ్యవసాయకులలో తినడానికి తిండికూడా లభించడంలేదని, అందువలన స్వయంగా పొలంచేయడంగాని, చేయించడంగాని లాభసాటిగాలేదని, అందరు కౌళ్ళకేయిస్తున్నారని, మరీ మధ్య తరగతి రైతాంగంతో నిండిపోయిన గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలలో జీవనవ్యయం వ్యవసాయకులలో జీవనం పెరగడమే నేటి వ్యవసాయక సంక్షోభానికి ఉద్యమాలకు కారణం అవుతున్నదని తేలిపోతున్నది.

ఈ నూటికి 89 మందిలో 7 మందికి 5 నుండి 10 ఎకరాలవరకు వుంటుంది. 10 ఎకరాలకు పైబడిన భూస్వాములు నూటికి 11 మంది ఉన్నారు. వీరు నూటికి 11 మంది వున్నా వీరి స్వాధీనంలో నూటికి 70 వంతుల భూమి వుండిపోతున్నది. వీరు తమ జబర్దస్తీ నుపయోగించి బీద వ్యవసాయకులచేత చాకిరీ చేయించుకొని అధికధరలకు పంటలు అమ్మివేయడంతో ఆర్థిక జీవనం తారుమారవడం ఆహారసమస్య క్లిష్టంకావడం తటస్థించుచున్నది. వీరితోబాటు ఈనాందారులు, మొఖాసాదారులు, జమీందారులు సుఖజీవనానికి వ్యవసాయ ఆదాయంలో నూటికి 80 వంతులు యివ్వవలసివస్తున్నది. ఎకరాకు 20-25 వడ్ల బస్తాలవరకు కౌళ్ళకివ్వబడుతున్నవి. జీవితావసరవస్తువులు బ్లాకుమార్కెటులో అమ్మడంతో మరీ కష్టమయిపోతున్నది.

అందువలన ఋణభారం పెరిగిపోతున్నది. యుద్ధఫలితంగా ధరలు పెరిగినందున పై రైతులే లాభపడ్డారు. వ్యవసాయ జీవితంతో ఋణభారం ఏ విధంగా పెరిగిందో తగ్గిందో 1939 కు 1945 లో జరిగిన మార్పు గమనించండి.

### ఋ ణ భా రం

| తరగతి | సంఘంలో నూటికి | ఋణం |
|---|---|---|
| 25 ఎకరాలపైన | 2.9 | —39.9 |
| 25-5 ఎకరాలమధ్య | 24.6 | —24.6 |
| 5 ఎకరాలలోగా | 44.3 | —12.3 |
| కౌలుచేసేవాడు | 13.2 | + 4.1 |
| పేద వ్యవసాయకూలి | 15.0 | +45.1 |

అంటే పొలంఉన్నవానికి అప్పు తరిగిందని, కౌలుచేసేవానికి బీదవ్యవసాయ కూలీలకి పెరిగిందని తేలుతుంది. మరీ పేదకూలీకి సగానికిసగం పెరిగింది. ఇవి 1945 స్థితులు.

యుద్ధం ఆరంభంనాటికి ఈనాటికి జీవనవ్యయం మితిమీరింది. ప్రభుత్వ అంచనాలు రుజువుచేస్తున్నవి. (విశాఖ. తూ. గో. జిల్లాలకు కలిపి విశాఖపట్నంలోనూ, ప. గో. కృష్ణా గుంటూరుజిల్లాలకు ఏలూరులోనూ, రాయలసీమకు బళ్లారిలోనూ అంచనాలు కట్టుతున్నారు.)

ఇండెక్సు వివరాలు

| ప్రాంతం | 1939 | 1949 |
|---|---|---|
| విశాఖపట్నం | 100 | 366 |
| ఏలూరు | 100 | 426 |
| బళ్ళారి | 100 | 384 |

దీనినిబట్టి ఎంత ఆదాయం ధనరూపంలో వచ్చినా రోజు గడవడంలేదు. పై పెచ్చు ఈ భూమి అంతా వివిధరకాల టెన్యూరులలో ఉండిపోయింది. కొంత రైత్వారీ, మరికొంత జమీందారీ, మరికొంతఈనాందారీ (అగ్రహారం) విధానాలక్రింద విభజనజరిగింది. మైనరు ఈనాములక్రిందకూడా కొంతవుంది. ఈ మైనరు ఈనాములక్రిందవుంది కూడా మరొకరి చేతనే అధికంగా చేయబడుతున్నా జమీందారీ బిల్లుల్లో యివి చేర్చబడనందున రైత్వారీగానే భావింపబడుచున్నవి. ఆ వివరాలివి.

భూ వి వ రా లు

(వేల ఎకరాలల్లో)

| జిల్లా | రైత్వారీ | ఈనాం | జమీందారీ |
|---|---|---|---|
| విశాఖపట్నం*. | 692078 | 421109 | 2588742 |
| తూర్పుగోదావరి. | 2372 | 96 | 556 |
| పశ్చిమగోదావరి. | 9100 | 210 | 399 |
| కృష్ణా. | 1035 | 231 | 1002 |
| గుంటూరు. | 3338 | 224 | 121 |
| కర్నూలు. | 4874 | 120 | — |
| బళ్ళారి. | 3063 | — | — |
| అనంతపురం. | 4152 | 153 | — |
| కడప. | 3509 | 214 | — |
| నెల్లూరు. | 2530 | 426 | 2130 |
| చిత్తూరు. | 1834 | 594 | 1850 |

*విశాఖఏజన్సీకాక

ఈ ప్రాంతాలల్లో ఈ క్రింది జమీందారీలు ప్రముఖమైనవి.

## జమీలు (వేలల్లో)

| జమీ. | ఎకరాలు. | రెవిన్యూ. | పేష్కస్. |
|---|---|---|---|
| విజయనగరం. | 465 | 2119 | 49½ |
| బొబ్బిలి. | 77 | 639 | 83 |
| పిఠాపురం. | 206 | 804 | 262 |
| చల్లపల్లి | 117 | 275 | 78 |
| వెంకటగిరి | 1162 | 1322 | 383 |
| కార్వేటినగరం. | 441 | 464 | 173 |
| కాళహస్తి | 773 | 375 | 172 |

ఇవికాక యింకా చిన్న చిన్న జమీలుకూడా వున్నసంగతి అందరికి తెలిసిందే. అందులో విశాఖ. కృష్ణా. నెల్లూరుజిల్లాలలో ఈ జమీందారీ విధానంక్రింద. విశాఖజిల్లాలలో అగ్రహారం (ఈనాం) దారీ విధానంక్రింద వ్యవసాయం అభివృద్ధికాకుండా వెనక్కుపడిపోయింది. ఈనాడు జమీందారీ బిల్లుతెచ్చి ఈవిధానం మార్చామంటున్నారు. ఇది ఆచరణలో కనుపించి నట్లేలేదు. అభివృద్ధిప్రణాళికలకు కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకిస్తున్న 50 కోట్లు విరాళాలు ఈ నూతనసంవత్సరం బడ్జటులో అపుదలచేశాం అన్నారు. కాని జమీందారీ విధానం రద్దుచేసి జమీలు పూర్తిగా ప్రభుత్వం వశంచేసుకుందేలోగానే వాటికి చెల్లింపవలసిన నష్ట పరిహారం చెల్లించితీరాలెనంటున్నారు.

సంస్థానాధీశుల స్వంత ఆస్తిని కేంద్రప్రభుత్వంలో కలుపవలసినపుడు అందుకు పరిహారం యివ్వనవసరంలేదన్న కృష్ణమాచారి కమిటీ సూచనకు హర్షింపనివారులేరు. అటులే జమీలనుకూడా స్వాధీనపరుచుకోవాలె. అందువలన 10 కోట్లధికం ఆంధ్రప్రభుత్వానికి దక్కుతుంది. ఈ పదికోట్లతో నూతన ప్రాజక్టుల పరిశ్రమలు నిర్మించవచ్చును.

ఆంధ్రదేశ వ్యవసాయాభివృద్ధికి ఈ క్రింది ప్రాజక్టులకు పూనుకోవలసివుంది.

## ప్రాజక్టులు

| ప్రాజక్టు | సాగుదల |
|---|---|
| రామపాదసాగర్ | 2500000 |
| కృష్ణా-పెన్నా | 2500000 |
| తుంగభద్రా | 280000 |
| గండికోట | 200000 |
| బహుదా | 5000 |

ఇవి అమలుకుతెస్తే 15 లక్షల టన్నులధాన్యం పండగలదు. 17 లక్షల ఆంధ్రులకు స్వయం సమృద్ధి కొంతవరకు యేర్పడగలదు. కనీసం రేషనింగు ధాన్యపు పరిమాణంతోనైనా అందుకు ఆంధ్రరాష్ట్రప్రభుత్వం పూనుకోవాలె.

# ఆంధ్రదేశ ఖనిజసంపద

ఆంధ్రదేశం రత్నగర్భం. అనేక ఖనిజాలు లభిస్తవి

1. రాతినార—(అస్‌బెస్టాస్) అందమైన సన్నని సిల్కుమాదిరి వాటిలో లభించును. మృదువుగా ఉంటుంది. Lensile strength ఉంటుంది. కర్నూలు జిల్లాలోను, పులివెందల తాలూకాలోను లభిస్తుంది. నూలు తీయవచ్చు. దారాలకు పనికివస్తుంది. గుడ్డకు వాడవచ్చు. ఒకరకం కాగితం, చాకులకు, అట్టలకు, రంగులలోకి, కప్పులకు, ప్యాకెట్టుల కట్టడానికి పనికివస్తుంది. తీసేమిషను లభిస్తే చాలా ఉపయోగం.

సబ్బురాయి: తెల్లగా, బరువుగా, పొరలుపొరలుగా రాయిమాదిరిగా ఉంటుంది. కడప కర్నూలు జిల్లాలలో లభిస్తుంది. ఇంకా అనంతపురం నెల్లూరులలోను లభిస్తుంది. వాడుక కాగితం సాపుచేయుటకు, చీట్ల పేకకి మెరుగుయిస్తుంది. గ్లాసులలోవాడుతారు. దీనిలో జింకు కలిపితే 'లిధోపోను' తయారవుతుంది. అక్షరాలు అచ్చువేయవచ్చు. రంగులు తయారు చేయడానికి, టైర్లు మొదలగు రబ్బరు సామానులకు వాడుతారు. కొన్ని రసాయనాలు తయారుచేస్తారు. దేశం రంగులువేయుటం (పెయింటింగు) పరిశ్రమనుబట్టి ఉంటుంది. చాలా అభివృద్ధి అయ్యే అవకాశాలుంటవి.

క్రోమైట్: ఇనుము, క్రోమియం కలుస్తే తయారవుతుంది. నల్లగా బరువుగా ఉంటుంది. చిత్తూరుజిల్లాలల్లో సరిహద్దులలో లభిస్తుంది. ఉక్కు తయారుచేయడంలోగూడ ఉపయోగిస్తారు. ఇదివరలో దీనిని ఇంగ్లాండుకు ఎగుమతిచేశారు. ఆగిపోయింది. పరిశోధనచేయాలి. ఇంకా లభించగలదు.

ఇత్తడి పొరలు: సహజమైన నీలం, ఆకుపచ్చ, ఎరుపురంగులతో ఉండడం గమనింప వచ్చు. కావలివద్ద లభిస్తుంది. కొన్నాళ్ళుచేసి నష్టం పొందారు. అయినా పరిశోధనచేయాలి.

గ్రాఫైట్: సాఫీగా నల్లగా గరుకుగా ఉంటుంది. విశాఖగోదావరి జిల్లాలలో లభిస్తుంది. 1912 లో పనిచేశారు. ప్రస్తుతం ఆగిపోయింది. లోహమిశ్రమాలల్లో ఉపయోగపరుస్తారు మోటార్ డైనమాల బ్రష్షులకును పెన్సిల్, పెయింటు వగైరా పనులకు ప్రముఖంగా వాడుతారు.

కైనైట్: Aluminium silicate. బెత్తులమాదిరిగా లభిస్తుంది. నెల్లూరుజిల్లా సైలా పురం లోప్రాంతంలో లభిస్తుంది. మంచిదైతే వజ్రాలు కోయడానికి ఉపయోగిస్తారు. పోర్సి లైను వస్తువులకు మరి కొన్నింటికి ఉపయోగిస్తారు.

సున్నపురాయి: గుంటూరు కృష్ణా విశాఖజిల్లాలలో సమృద్ధిగాఉంది. సిమెంటుకుపనికి వస్తుంది. గుంటూరు, కర్నూలు, కడపజిల్లాలలో రాళ్ళు ఇపుడుపయోగపడుతున్నవి. అభివృద్ధి కవకాశంఉంది.

మాంగనీసు: విశాఖ-బళ్ళారి సరిహద్దుల్లో లభిస్తుంది. ఇది ఇప్పటికే పరిశ్రమగా ఉంది. అమెరికా ఇంగ్లాండులకు అధికంగా ఎగుమతి జరుగుతున్నది. దీంతో ఫెర్రోమాంగనీసు

తయారుచేస్తారు. ఇనపపొరల్లో ఉక్కు తయారీలో ఇది ఉపయోగిస్తారు. రష్యాతప్పితే మాంగనీసులోనే మనదేశం ప్రపంచంలో అగ్రస్థానం వహించింది. పాళ్ళుసరిగా లేనందున ఇండియాలోని ఫెర్రోమాంగనీస్ సరిలేదన్నారట.

మైకా: నెల్లూరు జిల్లాలో విరివిగా గూడూరుతాలూకాలో ఉంది. ఎగుమతిచేయడమే మనవృత్తి అయింది. దీనిని వస్తురూపంచేస్తే ఎంతో మందికి వ్యాపారం. దేశానికి ఎంతలాభం లభిస్తుంది.

Steaptite: మాంగనీసుబాపతు. నెల్లూరుజిల్లాలో ఉంది. కర్నూలు జిల్లాలో లభిస్తుంది ఇదివరలో ఈ జిల్లాలలో పనిచేశారు. ఇప్పుడు మూలబడింది. దీనిని అనుదిన వస్తుసామాగ్రికి అధికంగా వాడుతారు. తెలుపుపదార్థం లభిస్తే ఫ్రెంచిచాకు పౌడరు తయారవుతుంది. ఇపుడు విదేశాలనుండి తెప్పించుకొని వాడుతున్నాం.

ఇనుపపొరలు: గుంటూరుజిల్లా పల్నాడులో గుత్తికొండవద్ద లభిస్తున్నది. 65% లభిస్తుంది. కడపజిల్లాలో అత్యధికంగాగలదు. 30 లక్షల టన్నులు లభిస్తుందని అంచనా వేశారు. ప్రదేశాలుకూడా ఇంకా పరిశోధించవలసిఉంది. కడప, కృష్ణా, విశాఖ, నెల్లూరు, బళ్ళారులలో లభిస్తుంది.

అనంతపురం నెల్లూరు గుంటూరులలో రాగి. సీసం, వజ్రాలుకూడా లభించగలవు.

అనేక పరిశ్రమలకు అతి ముఖ్యంగా కావలసిన నేలబొగ్గుమాత్రం ఈ జిల్లాలల్లో అతి స్వల్పంగా లభిస్తుంది. అయినా తీయడంలేదు. అయితే ఈలోటు తెలంగాణాలోని విస్తారమగు కొత్తగూడెం, సింగరేణీలలో గనులలో తీరుతుంది. ఇంకా కూడా వున్నవి.

ఇన్ని అవకాశాలున్నా పారిశ్రామికంగా ఆంధ్రదేశం చాలా వెనుకబడియున్నది. పట్టుమని చెప్పుకోదగ్గ ఫ్యాక్టరీలు పరిశ్రమలులేవు. ఈనాడు ఫ్యాక్టరీలుగా పరిగణింపబడి పరిశ్రమల క్రింద పనిచేస్తున్న కూలీలసంఖ్య గమనిస్తే, పరిశ్రమలవల్ల ఎందరికి వృత్తులు కల్పింపబడినవో ఆంధ్రజాతి జీవనంలో పరిశ్రమ లే స్థానం వహించినవో బోధపడగలదు.

## కార్మికులు

| జిల్లా | సం॥ అంతా | కొలచేకాలం | మొత్తం |
|---|---|---|---|
| విశాఖపట్నం | 985 | 13170 | 14155 |
| తూర్పుగోదావరి | 377 | 7317 | 7694 |
| పశ్చిమగోదావరి | 251 | 3216 | 3567 |
| కృష్ణా | 267 | 656 | 10744 |
| నెల్లూరు | 23 | 1476 | 1507 |
| కడప | 405 | 555 | 960 |
| అనంతపురం | 906 | 2049 | 2955 |
| కర్నూలు | 824 | 1855 | 2779 |

17 లక్షలమంది జనంలో పట్టుమని ఫాక్టరీలల్లో 50000 మంది కార్మికులుకూడా లేక పోతే జాతి అభివృద్ధిమార్గంలోవున్నా ఎట్లా గమనించగలం? ఈ కార్మికులూ జీవనం నమ్మకం ఉన్నవారు కాదు. వీరుకాక చేనేత కార్మికులు ఉన్నారు. వారు ఒకరోజు వ్యవసాయజీవనం, ఒకపూట చేనేతతో జీవనం చేస్తున్నారు.

పరిశ్రమల అభివృద్ధికి విద్యుచ్ఛక్తి చాలా అవసరం. తలకు అమెరికాలో 1660, ఇంగ్లాండులో 1944, స్వీడన్‌లో 21000, నార్వేలో 4000 కెనడాలో 4000, కిలోవాట్లు గంటలో వాడితే ఇండియాలో 9 మాత్రమె. ఇండియాకన్న 29 రెట్లు అమెరికా వాడుతుంటే, సోవియట్ 45 రెట్లు ఉత్పత్తిచేస్తున్నది. ఈ 9 గంటలు సగటుకూడా కాన్పూరు, మున్నగు పెద్ద పట్టాణాలలో నూటికి 60 వంతులు వినియోగం అవుతుంది. అందులో మద్రాసు—ఇక మద్రాసులో మన స్థితి గమనించండి.

| సిస్టం | ఉత్పత్తి యూనిట్లు (లక్షల్లో) |
|---|---|
| పైకారా | 1730 |
| మెట్టూరు | 887 |
| పాపనాశం | 472 |
| ఆంధ్ర | 183 |

ఆంధ్ర అంటే విశాఖ, బెజవాడ, కాకినాడ కర్నూలు కలిసింది. విద్యుచ్ఛక్తితో జీవితమె విప్లవమార్గంపట్టుతుంది. పరిశ్రమలు విరివిగాసాగుతవి. అందుకు ఆంధ్రలో ఈక్రింది విద్యుచ్ఛక్తి సాధించాలి.

| | | |
|---|---|---|
| మాచ్‌ఖండ్. | 400000 | కి. వా. |
| రామపాద్. | 128000 | కి. వా. |
| తుంగభద్రా. | 160000 | కి. వా. |
| కృష్ణా-పెన్నా. | 100000 | కి. వా. |
| శ్రీశైలం. | 75000 | కి. వా. |
| గోదావరిలోయ | 55000 | కి. వా. |

వీటిని సాధించినపుడే ఆంధ్రజాతి ఆశాజ్యోతి వెలుగుతుంది. అదేకాకుండా పరిశ్రమలు ప్రారంభించవలెననే ఆశాలత ఆంధ్రులలోలేదు. ప్రభుత్వమూ పూనుకోవడంలేదు. ధనంలేదంటుంది. జమీందారులకిచ్చే 10 కోట్లు అవుదలచేసి ఈ ధనంతో పరిశ్రమలు ప్రారంభిస్తే గొప్ప భవిష్యత్తు నిర్మించుకోగలము. ముడిసరుకులు, ఖనిజసంపత్తికి లోటులేదుగదా, మానవబలానికి లోటులేదనేది జనం ఎక్కువైంది అనేది ప్రతివాడికి తెలిసిందే. అందువలన మానవ సంపద, ఖనిజసంపద, ధనసంపద మూడింటితో ఆంధ్రప్రభుత్వం మనోసంపదకూడా అలవరచుకొని జ్ఞానసంపద నుపయోగించాలి, పెంచాలి.

# విద్యాప్రచారం

విజ్ఞానసంపదంటే జ్ఞాపకంవస్తుంది. ఆంధ్రజిల్లాల్లో విద్య చాలా వెనుకబడింది అనక తీరదు. మద్రాసు విశ్వవిద్యాలయం ముందుకువచ్చిందని దానిలో చదివినవారే ఉద్యోగాలకు వచ్చారని, తమకు లభించలేదనే ఆంధ్రోద్యమం మొదట బయలుదేరిందని గమనించాలి. ఈనాటినుండి విద్యాభివృద్ధి గమనించండి—

సెకండరీవిద్య (10000 మందిలో)

| జిల్లా | 1916 లో. స్త్రీ | 1916 లో. పురుష | 1946 లో. స్త్రీ | 1946 లో. పురుష |
|---|---|---|---|---|
| విశాఖ. | 2 | 22 | 4 | 61 |
| తూ. గో. | 5 | 72 | 18 | 150 |
| ప. గో. | — | — | 10 | 118 |
| కృష్ణా. | 4 | 96 | 17 | 138 |
| గుంటూరు. | 3 | 41 | 11 | 95 |
| నెలూరు. | 2 | 31 | 11 | 66 |
| కడప. | 1 | 14 | 7 | 47 |
| కర్నూలు. | 1 | 14 | 8 | 72 |
| బళ్ళారి. | 1 | 7 | 7 | 80 |
| అనంతపురం. | 1 | 10 | 6 | 58 |
| చిత్తూరు. | 2 | 20 | 9 | 57 |

తాబేటినడక అభివృద్ధిని గమనించదగును. అయితే ఈ రెండుమూడు సంవత్సరాలలో హైస్కూళ్ళు విరివిగా ప్రజలచొరవతో పెంపొందుతున్నై.

పాడిపంటలు, ప్రాజక్టులు, పరిశ్రమలు, విద్యుచ్ఛక్తి, విద్య—ఈ అయిదు దేశ జీవానికి పంచప్రాణాలు. ఈ అయిదింటిలో ఏది తగ్గినా జాతి నీరసించుతుంది. వీటి అన్నింటిని సమన్వయంచేసికోవడంలోనే ఆ జాతి అభ్యున్నతివుంది. ఆ దేశసౌభాగ్యంవుంది. దేశమంటే మట్టిగాదోయ్, అనాడే దేశమంటే మనుజులోయ్ అవుతుంది. అందుకు ఆంధ్రప్రభుత్వం పూనుకుంటూ అంతకన్నా ముందుగా తెలుగులో రాజ్యాంగపాలన ప్రారంభించితేనే ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రభుత్వం అవుతుంది. అందుకు పూనుకొనేటట్లు అంతా దీక్షవహించాలె. విద్యాబోధనలో తెలుగుకే ప్రాధన్యత యివ్వబడాలె. అంటే ఇతర భాషలు వద్దని కాజాలదు.

## ఆ దా య వ్య యా లు

ఈ పనులు నిర్వహించుకొనుటకు అసలు ఆంధ్రప్రభుత్వం ఈ 11 జిల్లాల ఆదాయ వ్యయాలతో నిలవతొక్కుకో గలదా స్వయంపోషకమా అని అనుమానించబడలేదు.

ఆంధ్రజిల్లాల ఆదాయ వ్యయాలు పరికించండి.

ఆంధ్రజిల్లాల ఆదాయ వ్యయాలు

1949-50 సం॥ (వేలల్లో)

| జిల్లా | ఆదా | వ్యయం |
|---|---|---|
| విశాఖపట్నం | 16419 | 21114 |
| తూర్పుగోదావరి | 19053 | 16582 |
| పశ్చిమగోదావరి | 15893 | 11785 |
| కృష్ణా | 18213 | 12844 |
| గుంటూరు | 19715 | 16051 |
| నెల్లూరు | 6790 | 9918 |
| కడప | 4905 | 7958 |
| అనంతపురం | 5150 | 8749 |
| బళ్ళారి (3 తా) | 2434 | 1975 |
| కర్నూలు | 6009 | 9142 |
| చిత్తూరు | 4871 | 9153 |
| 11 జిల్లాల మొత్తం | 119452 | 126991 |

ఈ లెక్కలకు క్రిందటి సంవత్సరపు లెక్కలకు చాలా తేడా కనిపించుచున్నది. ప్రత్యేకోద్దేశంతో యివ్వబడినట్లున్నవి. అయినా ఈ లెక్కలను బరిశీలించితే జిల్లాలవారీ ఆదాయ క్రమాలనుబట్టిచూచినా 75 వేల తక్కువగా కనిపించుతున్నది. ఇందులో రాష్ట్రపాలనా వ్యయాలు కలుపలేదని అన్నారు. అందువలన ఆ వ్యయం మిగిలింది. అయితే అటులే కేంద్రంనుండి రాబడిపన్ను వగైరాలవల్ల రాష్ట్రాలకు రావలసిన ఆదాయంకూడా లేకపో లేదుగాని. వివిధరాష్ట్రాలనుండి కేంద్రానికివచ్చే ఆదాయం, అందుకు మించుమ రాష్ట్రాలకి కేంద్రప్రభుత్వం, నేమియర్ ఎవార్డ్ రద్దయిన తర్వాత సర్కారు ఆ ఎవార్డుప్రకారం యివ్వతేలిన వివరాలు గమనించండి.

## కేంద్రంరాష్ట్రాల లావాదేవీలు (లక్షలలో)

| | కేంద్రపు పన్నులు | | రాష్ట్రాలకు విరాళాలు | |
|---|---|---|---|---|
| రాష్ట్రం | 1947-48 | మిగత 48 లో | 1947-48 | మిగత 48లో |
| మద్రాసు | 2912 | 2299 | 685 | 685 |
| బొంబాయి | 12548 | 7427 | 624 | 757 |
| ప. బెంగాలు | 6480 | 5725 | 360 | 360 |
| సంయుక్త | 631 | 721 | 565 | 719 |
| మధ్యరాష్ట్రాలు | 166 | 133 | 178 | 216 |
| బీహారు | 513 | 265 | 300 | 300 |
| అస్సాం | 206 | 510 | 89 | 108 |
| ఒరిస్సా | 18 | 17 | 83 | 91 |
| తూ. పంజాబ్ | 74 | 232 | 148 | 175 |

ఈ విధంగా రాగల మొత్తం ఇంకా ఎక్కువగా వస్తుందని తలంచుటకు వీలున్నా మద్రాసుకు 685 లక్షలే వచ్చినా, ఆంధ్రభాగానికి 36 వంతున పంచుతే దాదాపు 2½ కోట్లు రాగలదు. దేశముఖులనిర్ణయంవల్ల ఎంత వస్తుందో తర్వాత చూచుకోవచ్చు.

యుద్ధ ఫలితంగా యేర్పడిన రివిన్యూ రిజర్వులో నిల్వ 33 కోట్లువుంది. అందులో ఆంధ్ర భాగం 10 కోట్లు వచ్చితీరవలసిందే. అంతేకాక అసలు ఆంధ్రజిల్లాల ఆదాయ వ్యయాలలో ఈ సంవత్సరం అంచనాలు గజిబిజిగా చూపబడినవని అనకతప్పదు. ఆంధ్రరాష్ట్రం ఆర్థికంగా లాభంలేదని ధృవపరచి లెక్కలు సేకరించి ప్రకటించిన ధార్ కమిటీ నివేదికలో 1945 నుండి 48 వరకు యిచ్చిన ఆంధ్రజిల్లాల ఆదాయ వ్యయాలకు వీటికి చాలా తేడా కన్పించుచున్నది.

### ధార్ కమిటీ వివరాలు

(ఆంధ్రజిల్లాల వివరాలు—లక్షల్లో)

| సం॥ | ఆదాయం | వ్యయం |
|---|---|---|
| 1945-46 | 1272 | 872 |
| 1946-47 | 1364 | 1101 |
| 1947-48 | 1343 | 1147 |
| సరాసరి | 1326 | 1040 |
| 1949-50 | 1194 | 1269 |

వీరి అంచనాల ప్రకారమె 1945-46 సంగలో 4 కోట్లున్నూ, 46-47 లో 2 కోట్లు, 47-48 లో 2 కోట్లు సరాసరిలో మూడుకోట్లు మిగులు చూపించగా ఈ సంవత్సరం ఆదాయ వ్యయాలల్లో 75 వేల తరుగు రావడానికి కారణం కాన్పించడంలేదు. ఎంతగా అంచనావేసినా ఒక కోటిన్నర మిగులు కన్పించితీరవలసిందే. అందువలన కేంద్రప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలకు డివాల్యుయేషను ఫలితంగా 50 కోట్లు ఎగరకొట్టినా రాబడిపన్నుల బాపతు విరాళాలు యివ్వకతప్పదుగా. అందువలన అవి 2 కోట్లు. ఈ పొరపాటు 2½ కోట్లు అయితే తరుగు 75 వేలుపోగా రాష్ట్రపాలనా వ్యయానికి దాదాపు నాలుగుకోట్లుండగలవు. ధార్ కమిటీ ఈ అంచనాలమీదనే 6 కోట్ల తరుగుచూపితే అదికాదని అంగీకరించుతున్న నేటి మద్రాసు ప్రభుత్వం ఆంధ్రజిల్లాల జమాఖర్చులను తరుగుగాచూపడం నమ్మదగినది కాజాలదు.

ఆంధ్రప్రభుత్వం ప్రయోజన రహితమైన దుబారావ్యయాలకు దిగకుండా ప్రజాజీవనాభివృద్ధికి సంబంధించి ఖర్చుచేసే అభివృద్ధి ప్రణాళికలకుకూడా పూనుకోవచ్చు. పూనుకోకలదు. పోనీ ఆంధ్రప్రభుత్వం తరుగు ప్రభుత్వం అవుతుందంటే మరి ఇతరరాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలు పరికించినా అంతే తేలుతుందిగా :

## వివిధరాష్ట్రాల ఆదాయవ్యయాలు

(1949—50—లక్షలల్లో)

| రాష్ట్రం | ఆదా | వ్యయం |
|---|---|---|
| మద్రాసు | 5175 | 5566 |
| బొంబాయి | 4881 | 5241 |
| ప. బెంగాల్ | 3183 | 3294 |
| సంయుక్త | 5573 | 5558 |
| బీహార్ | 2140 | 2152 |
| తూ. పంజాబ్ | 1487 | 2292 |
| మధ్యరాష్ట్రాలు | 1899 | 1879 |
| అస్సాం | 892 | 952 |
| ఒరిస్సా | 890 | 879 |
| ఆంధ్రజిల్లాలు | 1494 | 1569 |

అసలు మద్రాసు బడ్జట్టే లోటుది అయితే అందులోని ఆంధ్ర బడ్జట్టు లోటుగానే వుండక తప్పదుగదా. అన్నిపరిస్థితులు సమగ్రంగా ఆలోచించితే ఆంధ్రప్రభుత్వం ధీమాగానే నడవగలదు.

కేంద్రప్రభుత్వం యేమీ సహాయంచేయనపుడు, జిల్లాలల్లో ఎక్కడచూచినా కల్లు సారా బ్లాకులో విరివిగా అమ్మకం జరుగుతున్నపుడు, మద్యపాననిషేధం ఆచరణలో సాధ్యం కానపుడు అధికారులకు లంచాలకింద పోయేబదులు ప్రభుత్వం ఆ ధనాన్ని ఎక్సైజుపన్ను మూలంగా తీసుకోవడంలో తప్పేమివుంటుంది? రైతులను - బీదరైతులనుసహా - ముందు సంవత్సరం భూమిశిస్తుకూడా ముదరా చెల్లించమని కోరేబదులు, నిర్బంధంగా వసూలు చేయదలంచేబదులు, తమ ఖర్చులను అధికంగాచేస్తూ, అవి తగ్గించుకోలేనప్పుడు, గాంధీజీ నైతికసిద్ధాంతాలను ఒకదానినన్నా హృదయపూర్వకంగా అమలుజరుపలేనప్పుడు ఎక్సైజు పన్నును వసూలుచేయటానికి నైతికసూత్రాలడ్డు అనడంలో అర్థంలేదు. ఇందుకైతే కేంద్ర ప్రభుత్వం అంగీకరించుతుందికూడా!


కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాల అభివృద్ధికి విరాళాలాపినపుడు, అభివృద్ధి విరోధకు లగు జమీందారులకు 10 కోట్లు యివ్వాలెనని వత్తిడిచెయటందేనికి? చెల్లించడం, చెల్లించక పోవడం ఆయారాష్ట్ర ప్రభుత్వాలకు వదలితే జమీరద్దును ప్రజాబలము, ప్రభుత్వబలంకూడా కలసి అమలుజరుపుకోగలుగుతవి. అందుకు ఆంధ్రప్రజలు ప్రభుత్వం పూనుకోవాలె.


ఈ 11 జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం యేర్పడితే ఆంధ్రులు ఇన్నాళ్ళుగా సాగించిన ఆందో ళన జయప్రదం అయిందనే ఆత్మవిశ్వాసం వస్తుంది. కాంగ్రెస్ భాషారాష్ట్రాలు నిర్మించింది అవుతుంది. వివిధభాషా రాష్ట్రవాదులు తమ రాష్ట్రాలకై ఆందోళనచేసి భాషాప్రయుక్తంగా భారతదేశాన్ని విభజించడానికి పునాదివేస్తారు.

అది అటులుండగా మార్చినెలలో హైదరాబాదు సంస్థాన ప్రజాపరిషత్తు ఎన్నికలు జరుగ నున్నవి. రాజాజీ, పండిత నెహ్రూలు ఏమిచెప్పినా ప్రజానీకం ఈ ఎన్నికలలో సంస్థానాన్ని రద్దుచేసి అనుకొనిఉన్న భాషాప్రాంతాలతో లీనం అగుటకు నిర్ణయం తీసికోవలసివుంది. ఆంధ్రులు, మహారాష్ట్రులు అందుకై ఎదురుచూస్తున్నారు. నాయకత్రయ నివేదికలో కర్నాటకరాష్ట్రం యేర్పడడం సంస్థానాలల్లోని ప్రాంతాలు కలిసినపుడే అనడంతో బళ్ళారి విషయంలో ఆంధ్రులతో అనవసర కలహం పెట్టుకున్న కర్నాటకులుకూడా హైదరాబాదు సంస్థానంలో భాషాప్రాంతాలతో లీనం కావలెననే వివాదం తీసుకోకతప్పదు. భాషా ప్రాంతాలల్లో లీనం కావలెననే వాదం ప్రారంభించి అందుకు అనువగు మహోన్నత ఉద్యమం హైదరాబాదులో నిర్మించినవారు ఆంధ్రులే. ఈ ఆంధ్రజిల్లాల రాష్ట్రంతో అచటి వారికింకా ఉత్సాహంవచ్చి తెలంగాణా అమితోత్సాహంతో ఈ ఉద్యమానికి నాయకత్వం వహించగలదు. ఆ విధంగా నిర్ణయం తీసుకొని అటుపై ఉద్యమం సాగించి ప్రజానిర్ణయం అమలు జరుపుకొనుటకు ఆంధ్రులు—ముక్కోటిఆంధ్రులు—కలియగలరు. ఆంధ్రులు తమ ఐక్యబలంతో విశాలాంధ్రరాష్ట్రం సాధించగలరు.

36 సంవత్సరాలనుండి ఆంధ్రులాందోళనచేసిన 11 జిల్లాల రాష్ట్రమేగాక 10 సంవత్సరాల నుండి ముక్కోటి ఆంధ్రులాశించిన విశాలాంధ్రరాష్ట్రం నిర్మాణం కాగలదు. 1920 లో పల్నాటిపన్నుల నిరాకరణ సందర్భంలో కలెక్టరు వర్నను, 1923 లో హైదరాబాదు ఆంధ్ర సంఘ నిర్మాణ సందర్భంలో కలనల్ ట్రెంచీ తోడి ఆంధ్రులతో పరస్పరం కలుస్తారన్న భయం నిజమై వారాశించినట్లు ఆంధ్రప్రజాబలం నిరంకుశత్వాన్ని నిర్మూలించగలదు. ముక్కోటి ఆంధ్రుల విశాలాంధ్రరాష్ట్రం యేర్పడగలదు. ఆనాడు "ఇక్కడ ఒక ప్రాజెక్టును. అక్కడ మరొక ప్రాజెక్టును ఆపితే లోటులేకుండా ఆదాయ వ్యయాలు సరిపెట్టుకోవచ్చు"ననే మనోతత్వంకాకుండా విశాలాంధ్ర ప్రాంతంలోని మూడుకోట్ల ఆంధ్రుల స్వయంనిర్ణయంతో, స్వయంసమృద్ధమగు స్వయంజీవనాన్ని నిర్వహించుకొని ఆదర్శనీయమగు ప్రజాస్వామికంగా ఆంధ్రరాష్ట్రం మనగలదు. అందుకు ఆంధ్రులు ముందుకు సాగాలె. అందుకు ప్రాంత విశాలత్వభావమేకాకుండా స్థానిక దురభిమానాలతోగాని, మత, కుల తత్వాలతోగాని, స్వార్థ కేంద్రంగాగాని ఆలోచనలు సాగించడం మరచిపోయి స్వంతలాభం కొంత మానక పొరుగ వాడికి తోడుపడే మనోతత్వం అలవరచుకొని, దేశమంటే మట్టికాదని, దేశమంటే మనుజులనే యదార్థాన్ని గ్రహించి త్యాగాలకు, సేవలకు విలువలు ఆర్జించుదామనే సంచిత దృక్పథం పరిసరాలలోనికికూడా రానీయకుండా నవ్యాంధ్రజీవనంతో, నూతన ప్రజాస్వామికానికి పునాదులువేయుటకు ప్రతినపూనాలె. త్యాగాలతో, సేవలతో, ప్రజాఉద్యమాలతో ప్రజావాహినులను కదిలించి వేలసంవత్సరాలుగా గణించిన ఆంధ్రసంస్కృతిని మహోన్నత పథాలకు తీసుకొనిపోదాం. అందుకు ముందుకుపొండి. ఆంధ్ర జయపతాక దశదిశల ఎగరాలె! ఎగరాలె!! జై ఆంధ్ర!

"జారిన దేశగౌరవము చక్కనదిద్ది మహాంధ్రమండలీ
భావము శ్లాఘనీయముగం బాలనచేసి సమానరాష్ట్రముల్
కూరిమి నానజేయ తెనుగుంబుడమిన్ గయిసేయరయ్య! దీ
క్షారతి నాంధ్రపుత్రులు జగజ్జనధర్మమె దృష్టి నిల్పుచున్."





రిపబ్లికు అధ్యక్షుడు
బాబూ రాజేంద్రప్రసాద్

# తొలి ప్రెసిడెంట్ —రాజేంద్రబాబు

అధినివేశ ప్రతిపత్తిని వీడి, నేటినుంచి రిపబ్లిక్ ప్రతిపత్తిని పొందుతున్న భారత దేశానికి, ఈ మార్పుకు ప్రధానచిహ్నం ప్రెసిడెంట్.

నేటితో గవర్నర్ జనరల్‌కు ఉద్వాసన, ప్రెసిడెంట్‌గిరీకి నాందీ ప్రస్తావన జరిగినవి.

పరతంత్ర భారదేశానికి 1947 ఆగస్టు 15 వ తేదీన అధినివేశ ప్రతిపత్తి సిద్ధించడంతో బ్రిటిషు రాజప్రతినిధియైన వైస్రాయి పదవికి స్వస్తిజరిగినా, కామన్‌వెల్త్ చిహ్నమైన గవర్నర్‌జనరల్ పదవి మిగిలింది. అంటే, బ్రిటిష్ సింహాసనానికి అప్పటికీ భారతదేశంపై నామమాత్రపు అధికారం మిగిలినట్టే. అదికూడా నేటితో విరగడైపోతున్నదనడానికి తార్కాణమే ప్రెసిడెంట్ పదవి.

రిపబ్లిక్ ప్రతిపత్తిని పొందిన తరవాతకూడా భారతావనికి, కామన్‌వెల్త్‌లో సభ్యత్వం వుండగలదు కనుక అందుమూలంగా బ్రిటన్‌తోను, తదితర కామన్‌వెల్త్ రాజ్యాలతోను లాంఛన ప్రాయమైన సంబంధం తప్ప నేటినుంచి రాజ్యాంగరీత్యా ఇండియాపై బ్రిటన్‌కు నామమాత్రపు అధికారంకూడా వుండబోదు. ఇండియా రిపబ్లిక్‌పై రాజ్యాంగరీత్యా సంపూర్ణాధికారాలు ప్రెసిడెంట్‌వే.

అయితే, బ్రిటిష్ రాజువలె ఇండియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్‌కూడా సర్వాధికారాలు కలిగివుండగల లాంఛన ప్రాయమైన అధినేతయేగాని, అమెరికా ప్రెసిడెంట్‌వలె ప్రభుత్వాధికార నిర్వాహకుడుకాడు. ఇండియన్ రిపబ్లిక్ శాసన సభలు ఎన్నుకొనగల ప్రధానియే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకొని పరిపాలన సాగిస్తాడు. రాజ్యాంగవిధానం ప్రకారం, సమస్త ప్రజాకోటిని పరిపాలించే అధికారం ప్రధానిదే అయినా అది సక్రమంగా, ధర్మంగా, నిర్వహించబడేటట్లు చూచే బాధ్యత ప్రెసిడెంట్‌దే.

ప్రజాస్వామిక వ్యవస్థలో సర్వస్వతంత్రాధికారం ప్రజలదే కనుక ఆ ప్రజల ప్రతినిధియైన ప్రెసిడెంట్ సకలాధికారాలు కలిగివుండి, వాటివి ప్రజానీకానికి లాభదాయకం గాగల విధంగా వినియోగిస్తూవుంటాడు. అయితే, పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఇట్టి ప్రెసిడెంట్‌లు నియంతలుకాగల ప్రమాదాలుకూడా లేకపోలేదు. నిజానికి అందుకు అవకాశమివ్వగల అధికారాలుకూడా ప్రెసిడెంట్‌కు వున్నాయి. అవసరమైతే ప్రధాని సిఫారసులను త్రోసిపుచ్చడానికికూడా అధికారం ఉన్నది. ఇండియన్ రిపబ్లిక్‌కు అట్టి ప్రమాదాలు వాటిల్లకుండా చేయడానికై నవభారత రాజ్యాంగంలో తగు రక్షణలు కల్పించబడినవి.

యం. వి. యస్. శాస్త్రి

ఏమైనప్పటికీ, తన అధికారాలను వినియోగించుకొనేవారిపైనే ఆ అధికారాల సమంజసత్వంగాని, అసమంజసత్వంగాని ఆధారపడి వుంటుంది. అందుచేతనే, ప్రెసిడెంట్‌కుగల అధికారాలను, ఆయన సద్వినియోగం చేసుకోవాలనడానికి సూచనగా, ప్రెసిడెంట్‌కు ప్రత్యేక పతాకం సిద్ధపరచబడింది.

దీనిపైన ఒక అశోక స్తంభాగ్రం, ఒక అజంతా గజం, ఒక త్రాసు, ఒక పద్మ కలశం, అనేక వర్ణాలలో చిత్రించబడినవి. అశోక స్థంభాగ్రం సర్వమానవ సౌభ్రాతృ సమత్వ సమైక్యాదర్శాలకు, అజంతా గజం ఓరిమి, బలసంపదలకు, త్రాసు న్యాయ ధర్మాలతోపాటు సుస్థిర ఆర్థిక వ్యవస్థకు, పద్మకలశం (పూర్ణఘటం) సంపత్సమృద్ధులకు చిహ్నాలు.

ఈ పతాకాన్నిబట్టి ప్రజాసేవానురక్తితో ధర్మనిరతితో, సర్వాధికార సమన్వితుడైన ప్రెసిడెంట్ న్యాయదేవతామూర్తి కావలెననడం స్పష్టం.

* * *

ఇంతటి మహోత్కృష్టమైన పదవిని భారత నాయకులలో అజాతశత్రు వనదగిన ప్రేమమూర్తి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ స్వీకరించాడు.

ప్రజాస్వామ్యంపై భారతదేశానికి గల ప్రగాఢ విశ్వాసానికి, ప్రెసిడెంట్‌గిరి చిహ్నమైతే, నిరాడంబరుడై స్వార్థమెరుగని భారతీయ కృషీవలునికి ప్రతినిధి రాజెన్‌బాబు.

బీహార్‌లోని సామాన్యమైన కుటుంబంలో పుట్టి, గ్రామీణవాతావరణంలో పెరిగి, తోటి విద్యార్థులకు ఆదర్శప్రాయుడై, ప్రొఫెసర్‌గా సాటివారి మన్ననలను పొంది, న్యాయవాదిగా రెండుచేతులా ధనమార్జించి, వస్తుతహా కరుణామయుడు కనుక తన ఆర్జననంతా బీద విద్యార్థులకు పంచిపెట్టి, బ్యాంకులో 15 రూపాయిలు మాత్రమే నిలవవుండగా గాంధీజీ పిలుపునందుకొని చంపరాణ సత్యాగ్రహోద్యమంలో ప్రవేశించి, ప్రజానీకానికి నిరంతరం సేవచేసి, భారత జనకుని హృదయసీమలోనేగాక ముప్పదికోట్ల భారతీయ హృదయారామాలలో స్థానం పొందగలిగిన రాజెన్‌బాబు ప్రెసిడెంట్ పదవిపొందడం అస్వాభావికం కాదు. రుగ్మతనుగాని, వయోభారాన్నిగాని సరకుచేయక కాంగ్రెసు అధ్యక్షుడుగా, స్వతంత్రభారత ఆహార శాఖామంత్రిగా, రాజ్యాంగపరిషత్తు అధ్యక్షుడుగా, స్వాతంత్ర్య సముపార్జన కేమి, క్షామప్రమాద నివారణకేమి, పటిష్ట భారత నిర్మాణానికేమి కృషిచేసిన రైతునాయకుని, సముచితంగా సత్కరించి, తన కృతజ్ఞతను భారతదేశం ప్రకటించుకున్నది.

* * *

ప్రెసిడెంట్‌గా రాజెన్‌బాబు ఎన్నిక ఏకగ్రీవంగానే జరిగినప్పటికీ, అంతకు పూర్వం ఈవిషయమై సంచలనం కలుగకపోలేదు.

రాజెన్‌బాబు, రాజగోపాలాచారిగార్లలో ఎవరిని ఈ పదవికి సూచించడం ఉత్తమమా అని తర్జనలు జరిగాయి. ప్రెసిడెంట్ ఎన్నిక సమస్య, ముఖ్యంగా రాజ్యాంగ పరిషత్తుకే సంబంధించినదైనా, ఆ పదవి ఉత్కృష్టతను బట్టి కాంగ్రెస్ అధిష్టానవర్గమేగాక, ఇతర నాయకులుకూడా ఇందును గురించి చర్చించారు. ఉత్తరాదికి రాజెన్‌బాబు, దక్షిణాదికి రాజగోపాలాచారి ప్రతినిధులని, ఉత్తరాది వారిపై దక్షిణాది వారి పెత్తనం సాగకుండ వుండడానికి గాని, సంస్కృత పదభూయిష్టమైన హిందీకి ప్రాధాన్యం కల్పించడానికిగాని రాజెన్‌బాబునే ఎన్నుకోవాలని హిందీపట్ల, హిందూమతంపట్ల దురభిమానంగల వారు ప్రచారం సాగించారుకూడా.


హిందూధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లును రాజెన్‌బాబు ప్రతిఘటించని కారణంచేత హిందూతత్వ దురభిమానులు ఆయన తమకు ప్రతినిధికాగలడని ఆశించారు.

అయితే, విప్లవవాది కాకపోయినా, గాంధీజీ నాయకత్వాన శాంతియుత సంస్కరణల ఆవశ్యకతను గుర్తించి, అందుకై పోరాడినవాడు గనుక హిందీకంటె ముందుగా ఉర్దూ, పారసీకములతోబాటు ఏడు భాషలలో పాండిత్యాన్ని సాధించి సకల భాషలపట్ల, సర్వమతాలపట్ల సమాధిక గౌరవశ్రద్ధలు కలవని నిరూపించు కొన్నవాడు కనుక కాలానుగుణంగా స్వీయాభిప్రాయాలను మార్చుకుని ప్రజాక్షేమమే ప్రధానలక్ష్యంగా వ్యవహరించి తన ప్రజ్ఞను రాజెన్‌బాబు నిరూపించుకొనగలడని ఆశించవచ్చు.

* * *

ప్రెసిడెంట్ ఎవరైనప్పటికీ, ఇండియా, మంత్రులెవ్వరైనప్పటికీ, కాంగ్రెస్ అధిష్టానవర్గ సభ్యులెవ్వరైనప్పటికీ, భారత ప్రభుత్వాన్ని నడిపించేవారు సర్దార్ పటేల్, పండిట్ నెహ్రూలనడం లోకవిదితం।

అనేక సమస్యలపై అనేక విషయాలపై పరస్పర విరుద్ధభావాలు కలిగివున్న వారిరువురిమధ్య సమైక్యతను సమరసభావాన్ని పెంపొందించి, వారిరువురిని దేశానికి శ్రేయస్కరమైన మార్గాన్న నడిపించగల సామర్థ్యం వున్నవారు ప్రెసిడెంట్ పదవిని అధిష్టించినపుడే భారతావని సుభిక్షం కాగలదు. ఈ దృష్టితో చూచినపుడు గాంధిజీకి "రాజకీయ వారసుడు" కాకపోయినా, సర్దార్ పటేల్, పండిట్ నెహ్రూల భక్తిగౌరవాలను పొందడంలో గాంధీజీకి వారసుడన తగిన రాజెన్‌బాబు, వారిరువురిని ఒక కాడికి కట్టి స్వతంత్రభారత రథాన్ని దుర్గమారణ్యాల నుంచి సకలసౌభాగ్య సీమకు జేర్చి మున్ముందు ఆ పదవిని అధిష్టించువారికి మార్గదర్శి కాగలడని ముమ్మాటికి విశ్వసించవచ్చు.



ఆంధ్ర దేశమంతటా త్వరలోనే విడుదల!



★ మహాలింగం
★ సరోజ
★ సరస్వతి
★ స్వామినాథన్
★ కృష్ణన్
★ మధురం

మున్నగువారు నటించిన

# ఇన్బవల్లి (తమిళం)

(ప్రణయగాథలతో, ఒడలు పులకరింపజేసే సన్నివేశాలతో, వినోదాలతో కూడిన మహత్తర జానపద చిత్రం)

★

ఆంధ్ర, ఉత్తర ఇండియాలకు డిస్ట్రిబ్యూటర్లు:

## ది ఆంధ్రా ఫిలిమ్ సర్క్యూట్,

గాంధినగరం :: విజయవాడ